ఏప్రిల్ 16-30, 2022

సంపుటి 02, సంచిక 11

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

## జనహిత...
## ప్రాణహిత...



# బాబా సాహెబ్
# డా॥ బి.ఆర్. అంబేడ్కర్

ఆర్థిక వేత్త, న్యాయ కోవిదుడు, రాజనీతిజ్ఞుడు,
అంటరానితనం వివక్షలపై అలుపెరగని
పోరు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత,
భారతరత్న డా॥ బి.ఆర్. అంబేడ్కర్



*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

విషయ సూచిక




14 రైతు హితసేద్యం, సర్వ హిత జనామోదం అంటున్న **కోటం చంద్రశేఖర్** కవిత... **"బీళ్ళభూమి కాదు"**



31 **వంగీపురం చైతన్య దేవ్** విశ్లేషించిన వ్యాసం... **పి.వి. జీవితం**



19 **బుర్రా వెంకటేశం రామాయణ పరివారం** లోతులు విశ్లేషించిన **దాస్యం సేనాధిపతి** వ్యాసం...



05 కొత్త దంపతుల జీవితాలలో ప్రేమ దోబూచులాటను తెలిపే **ఇసుకపల్లి లక్ష్మీనృసింహశాస్త్రి** కథ **"తప్పటడుగు"**



04 మాయమౌతున్న మనిషితనం మధ్య స్త్రీ ప్రేమరూపం తెలిపిన **సరిత నరేశ్** కవిత... **"ప్రేమలత"**



25 **కందికొండను అమరుణ్ణి** చేసిన ఆయన పాటలను విశ్లేషించిన వ్యాసం...



15 కష్టాలలోనూ చదువుకున్న ఆడపిల్లకు ఊరి జనం మద్దతు తెలిపిన **ఆర్.పి. కృష్ణస్వామి** రాజు కథ... **"బుడబుక్కల బంగారు తల్లి"**



**ఆచార్య వెలుదండ నిత్యానందరావుతో అట్టెం దత్తయ్య** ఈ పక్షం ముఖాముఖి... 41

**మామిడి హరికృష్ణ కవిత్వం** లోతులు తడిమిన **వేణు నక్షత్రం** వ్యాసం.... ... పేజీ 09

పదాలను అల్లి పాటలుగా చల్లే బిల్ల మహేందర్ **"గాయాల పాట"**ను తడిమిన **ఉషారాణి.** ... పేజీ 23

బతుకంటే ఆశావహ దృక్పథం ప్రకటించే **పసునూరి** కవిత... **"బతుకంటే ఎల్లకాలపు ఎడారి కాదు!"** ... పేజీ 02

భూమి నవ్వును కనిపెట్టే **అఖిలాశ** **"ఎరుపు గంప"** కవిత ...పేజీ 34

జీవితంలోని మెలికలకు తాత్త్విక రూపం ఇచ్చిన **ఎలనాగ** అనువాద కథ **"సహచరులు"** ... పేజీ 27


**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

క
వి
త



# బతుకంటే ఎల్లకాలపు ఎడారి కాదు!



పసునూరి రవీందర్, 77026 48825

అంతా అయిపోయిందనుకుని
ఒంటరిగా శూన్యాలు చూసేవేళ
ఏమీ కాలేదు...ఇంకా చాలా ఉందనే
అభయహస్తమే కదా
ఏ బతుకుకైనా కొండంత భరోసా!

ఆకాశానికి ప్రేమలేఖ అందించేందుకు
పక్షులు ఎగిరినట్టు నువ్వూ ఎగరవచ్చు
కుండపోతవానకు ముందు
ఆకాశం ఫెళఫెళా ఉరిమినట్టు
నీ దు:ఖాన్ని ఆవలి తీరానికి విసిరేసి
దిక్కులదిరిలేలా నువ్వు నవ్వొచ్చు!

కరువు నేల మీద
ఆశల మొలక ఒకటి
నువ్వు ఊహించని సమయాన
భూమిని తొలుచుకొని పైకొచ్చి
నీకు చేతులందిస్తూ ముసిముసిగా నవ్వొచ్చు
బతుకంటే ఎల్లకాలం ఏడారే కాదని గుర్తించు!
దుబ్బ సెలుకల మీద
చెమటచుక్కలు తడితడిగా
వెచ్చని సంతకం చెయ్యొచ్చు!

కష్టాల తుమ్మకొమ్మ ముండ్లకో
బాధల కరెంటు తీగలకో చిక్కుకున్న
జీవితపు గాలిపటం
గుప్పెడు జీవితేచ్ఛను కూడగట్టుకొని
రెక్కలు విదిలించి
గిలాగిలా కొట్టుకున్న పశువు
తలుగు తెంపుకొని పరుగందుకున్నట్టు
ఎవ్వరూ ఊహించనట్టు
పెనుగులాడి...పెనుగులాడి...
ఒక్కసారిగా రివ్వున పైకెగరవచ్చు!

ఏమో...ఏదైనా జరగొచ్చు!
పిడికెడు ఆశను మాత్రం
వసివాడకుండా
గాలికి అటూ ఇటూ కొట్టుకుంటున్న
దీపం చుట్టూ చేతులు పెట్టినట్టు
నువ్వే కంచెవై కాపాడుతుండాలి!!

వెలుగునే కాదు
అప్పుడప్పుడు చీకటినైనా ప్రేమించాలి
అమావాస్యను ఈది
పున్నమిని వెంటతెచ్చుకునే తెగింపు కావాలి
గుండెకిందా...
ఒక్క వెలుగుపాటనైనా కలగంటూ
అన్నీ చూస్తూ...అన్నీ అనుభవిస్తూ
బయటికి కనిపించకుండా భరిస్తూ
సంచారివై సాగుతుండాలి...

నవ్వినా నువ్వే...
ఏడ్చినా నువ్వే...
ఎదలకు హత్తుకున్నా నువ్వే
ఎవరూ లేని సమయాన
బరువు దించుకున్నా నువ్వే!!
నీ సమస్త సుఖదు:ఖాలకు
ఇతరులే కాదు...
నువ్వు కూడా బాధ్యుడవే!

సంపాదకీయం

తంగేడు
తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక
16-30 ఏప్రిల్, 2022
సంపుటి 02 సంచిక 11



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# పాట పరిమళం

పాట మానవ జీవన ధాతువు. సాహిత్య ప్రక్రియలకు నిత్య ప్రేరకం. అమృతాన్ని వర్షించగలదు. అగ్నిని సృష్టించగలదు. ప్రభుత్వాలను గద్దె దించ గలదు. ప్రభుత్వాలను ప్రతిష్ఠించగలదు. ప్రపంచ విప్లవాల వెనుక పాట ఉంది. భారతీయ స్వాతంత్ర్య పోరాటం వెనుక పాట ఉన్నది. తెలంగాణ ఉద్యమం వెనుక పాట ఉన్నది. నిరంతర చైతన్య ప్రవంతి అయిన పాట సాహిత్యానికి హృదయం లాంటిది.

నిజానికి తెలుగు సాహిత్యంలో పాట అతి ప్రాచీనం. పూర్వ నన్నయ కాలంలోని శాసనాలలోనే పాట మొలకెత్తింది. పాల్కురికి ద్విపదలో కవితలా పాట తొంగిచూసి పలకరించింది. ఒకవైపు పురాణ... ప్రబంధ.. క్షీణ ప్రబంధాది సాహిత్యాలుగా తెలుగు కవిత్వం వికాసం చెందుతూంటే పాట ప్రజల జీవితాలతో పెనవేసుకొని వాళ్ళ పెదాలపై జీవించింది. తరువాత సాహిత్యంలో కూడా లాక్షణికుల శషభిషలకు చిక్కి ద్విపదగా, రగడలుగా, జాతి పద్యాలుగా అవతరించింది. తెలుగునాట పల్నాటి చరిత్ర లాంటి వీరగాథా కథనాలతో పాట జనులను ఉగ్రూతలూగించింది.

ఆంగ్లంలో కూడా లిరిక్ ప్రసిద్ధం. లైర్ అనే సాధనంపైన వాయిస్తూ పాడబడే ఈ పాట లిరిక్‌గా ప్రసిద్ధమైంది. ఆంగ్లంలో లిరిక్, ఎలిజి, ఓడ్, సానెట్, డ్రామెటిక్ మొనలాగ్ లాంటి వివిధ రూపాలు పొందింది. ఆంగ్లంలో లిరిక్ అనుభూతివంతంగా వుంటుంది. పాఠకుడు లిరిక్‌లో సంలీనం చెందగలిగే నిర్మాణం ఈ ప్రక్రియలో ఉంటుంది. లిరిక్ ఆంగ్ల సాహిత్యంలో క్రీ.పూ. 4వ శతాబ్దంలో ఎ.డి. హెబ్రేతో మొదలైంది. లిరిక్ వీరగాథా కథనంగా ఉంది. తరువాత కాల్పనికమైనదిగా పరిణామం చెందింది. ప్రపంచ దేశాలలోని అన్ని విప్లవాల వెనుక లిరిక్ ఉంది. అన్ని ఉత్సవాలలో భయ, దు:ఖ, శృంగార, హాస్యాది అన్ని సన్నివేశాలలో పాట రెక్కలు విప్పుతూంటుంది.

తెలుగు దేశంలోనైతే పాట సందడి చేయని సన్నివేశం ఉండదు. పెళ్ళిళ్ళలో, జన్మదినాలలో, మరణించే వేళ కూడా పాట ఉంటుంది. దసరా, హోళీ, బతుకమ్మ, సంక్రాంతి లాంటి అన్ని పండుగలలో పాటకే పట్టం. తెలంగాణలోనైతే మనిషి జీవనరీతుల్ని ప్రతిఫలించేది, ఒకరకంగా శాసించేది పాటే. శ్రమైక జీవన సంకేతంగా పాట పరవళ్ళు తొక్కుతుంటుంది.

పండితలోకాన్ని పద్యం, వచనకవిత అలరిస్తూంటే పాట పామరుల్ని అలరించేది.

ఆధునిక కాలంతోపాటు అటు ఈస్తటిక్స్‌ను ప్రోదిచేస్తూ ఇటు సామాజికాంశాలను చిత్రించింది. సాహిత్యంలో బలమైన అభివ్యక్తి వాహికగా రూపాంతరం చెందింది. ప్రజాపోరాటాలకు, దానితోపాటు అన్నిరకాల అనుభవాలకు పాట ఒక ఉపాధేయంగా నిలిచింది.

ఇట్లాంటి పాట లాక్షణికుల సూత్ర నిర్మాణంలో చిక్కుకొని నిర్వీర్యం కాకూడదు. ఉన్నత పౌర సమాజ నిర్మాణంలో పాట తన ప్రయత్నం కొనసాగిస్తూ మరింత వికసించాలి.

*జై తెలంగాణ, జై జాగృతి.*

కవిత



# ప్రేమలత

ఓరువాల సరిత నరేశ్, 99663 93456

ఆ పలుకులో వెలకట్టలేని
ఆప్యాయత తొణికిస లాడుతుంది
ఆ నడకలో నెమ్మదితనం
తనకెంత ఓర్పో చెబుతుంది
మనసునిండా నెనరు
మాటనిండా పావురం
ఆమె గుండెగూడు ఓ నిండు చెరువు
ఆమెంటేనే ఓ మమతల దీవి

నుదుట పావలంత కుంకుమ బొట్టు
మెడన మూడుమూరల పసుపు తాడు
చేతినిండా మట్టిగాజులు
చెవులకు చింత గింజంత సైజులో
తుమ్మ పువ్వులంటి బంగారు కమ్మలు
ముక్కుకు వయ్యారి బామ పువ్వంత పుడక
ఇవే ఆమె నిండు దనాన్ని చూపే ఆభరణాలు
మనుషులకు నగలూ నట్రా కాదు
వారి ప్రవర్తనే అసలైన అలంకారం అని
ఆమెను చూసి చెప్పొచ్చు

ఎన్ని బాధలున్నా ఎంత కష్టం కుదిపినా
వానకాలం చెరువంత కళకళగా కనిపించేది
అసలు ఓపికంటే ఎలా ఉంటుందని అడిగితే
ఆనవాలు తననే చూపించాలనిపించేది
ఎంత ఒడుపుగా గంపెడు సంసారాన్ని ఈదిందో
ఎంత నేర్పుగా బట్టలు కుట్టి ఇల్లు నెట్టుకొచ్చేదో
ఎంత ఓర్పుగా తాను తనలాగే బతికిందో!
ఎక్కడ చూసినా చదువుకున్న వాళ్లకి
సత్కారాల మీద సత్కారాలు చేస్తారుగానీ
అక్షరం పరిచయం లేకపోయినా
జీవితాలను చదివిన తనలాంటోళ్లకి
ఎందుకు పట్టం కట్టరో అని అడగాలనిపిస్తుంది.
కార్యేషు దాసి కరణేషు మంత్రి అంటూ
ఆరు సూత్రాలేవో చెప్తారు గదా
ఆడవారిని పనిమంతులుగా గుర్తించడానికి
ఆ వాక్యాలకు సరైన ఉదాహరణగా తనని చెప్పొచ్చు
ఎవ్వరేమన్నా ఎన్ని కష్టాలు చుట్టుముట్టినా
తొణకని నిండుకుండలా ఉండటం తనకే సాధ్యం
మా ఇండ్లళ్ల ఏ కార్యమైనా
ఉరుకులబెట్టుకుంటా పనిచేసే జంట వాళ్లది
ఆడంబరాల కన్నా ఆప్యాయతల వైపే మొగ్గు చూపేది
ఎపుడైనా ఇంటికిబోతే కోడిగుడ్లకూరతో అన్నం బెడ్తూ
చూపే ప్రేమకి కడుపుతో బాటు మనసూ నిండిపోయేది
ఆ బాటల ప్రయాణం చేసినపుడల్లా
ఆ పల్లె నేల మట్టివాసనకు
తన పిలుపుల ప్రాణం వాసన తోడై
ఓ కమ్మటి అనుభూతితో తిరిగొచ్చే వాళ్ళం
మాయమవుతున్న మనిషి తనాల మధ్య
తనో మనసున్న ప్రేమ రూపం
అపురూపమైన అనురాగ దీపం
ఆమె అల్లుకున్న ప్రేమలత

నాటి కథ

# తప్పటడుగు

పిల్లలను దంపతులు ప్రేమించే తీరును చిత్రించిన కథ....

ఇసుకపల్లి
లక్ష్మీనృసింహశాస్త్రి

ఆ తెల్లటి డ్రస్సు, ఆ తెల్లటి బూటు, ఆ తెల్లటి టోపీ, వసంత శరీరానికి చాలా బాగుంటాయని మధు అభిప్రాయం. 'నువ్వు యెంత స్వచ్ఛంగా వున్నావు వసంతా' అని మనస్సులో అనుకుంటూ వుంటాడు మధు. ఆమె కంఠానికి పెళ్ళయిన గుర్తు తాళిబొట్టు తప్ప యింకోటేమీ లేదు. అసలు ఆమె కోరుకోనూ లేదు, మధుకు వాటిమీద అసలే మోజు లేదు. పైగా అట్లా వుంటేనే బాగుంటుందని కూడా మధు అభిప్రాయం.

'వసంతా, నువ్వు నిజంగా నర్సు డ్రస్సులో చాలా బాగుంటావు...!' అని అంటూ వుంటాడు కూడ.

'అవును లెండి మీకు చీరెలు కొనటం తప్పిపోతుందిగా...!' అని అంటుంది వసంత.

అట్లా అని నిజానికి మధు వూరుకోనూ లేదు. అయినా వసంతకు అవకాశం మాత్రం యేముంది అవన్నీ కట్టుకోవటానికి. పగలల్లా యించుమించుగా డ్యూటీలోనే ఉండిపోతుంది! అప్పుడప్పుడు మాత్రం, మధు సరదాపడి, వసంతను శలవు పెట్టమంటూ వుంటాడు. అయితే వసంతకు ఒక్కరోజు శలవుమీద వున్నా, తన ప్రాణమంతా ఆసుపత్రిలోనే వుంటుంది. అందులో పిల్లల వార్డులో పని.

ఎప్పుడు చూసినా వాళ్ళమాటే. వాళ్ళ గొడవే. అందుకనే తెల్లారి లేచినప్పటి నుంచి యేదో హడావిడిగానే పనులన్నీ చేసుకుంటూ పోతూ వుంటుంది. యెక్కడ తనకు ఆలస్యం అవుతుందో అని. మధుకయితే సాధారణంగా సావకాశంగా మాట్లాడే అవకాశం ఉదయంపూట యెప్పుడు కూడా దొరకనే దొరకదు. అందువలన ఉదయం పూట యేమీ మాట్లాడనే మాట్లాడడు. అడపా, తడపా వసంతకు యేదో సహాయపడుతున్నట్లు అటూయిటూ తిరుగుతూ వుంటాడు యింట్లో మధు. నాచేతికి అడ్డం రావటం తప్ప అంతకంటె వుపయోగం యేమీ కనిపించటం లేదు అంటూ నవ్వుతుంది వసంత.

పదిగంటలు లోపుగానే యిద్దరి భోజనాలు అయిపోతాయి. వసంత డ్రస్సు విషయంలో చూపించవలసినంత శ్రద్ధ మధు తన డ్రస్సు విషయంలో చూపించ క్కర్లేదు. సైకిలుకట్టు ధోవతి, లాల్చీ, మోకాళ్ళ దాకా అవసరాన్నిబట్టి చేతిలో బెత్తం, మూడు మూర్తులా ఆయన వేషమే చెప్పుతుంది ఆయన చేసేదేమిటో, వసంత గబగబ డ్రస్సు వేసుకుని యింకా కొద్ది నిమిషాల్లోనే వెళ్ళిపోవాలి అంటూ తన రిస్టువాచి చూసుకుంటుంది. తాను రిస్టువాచి చూసుకుంటునప్పుడల్లా మధుకు కూడా వుంటే బాగుంటుంద నిపిస్తుంది వసంతకు. ఏమంత దరిద్రంతో కొట్టుకుపోతున్నామని యీ నెలన్నా కొనుక్కోరాదండి అంటూ వుంటుంది వసంత. అట్లానే.. అంటూ మధు దాని విషయంలో గట్టిగా ఆలోచించనే ఆలోచించలేదు. అయినా నాకేమిటి దాని అవసరం. గంట కొట్టంగానే లేచి చక్కాపోతాను. మళ్ళీ యింటికి వచ్చేవేళ గంట కొట్టేస్తారు అని అంటూ వుంటాడు మధు. మధు యింటికి తన బడికి మధ్య గోడే అడ్డం. వసంత సందు మళ్లేదాకా రోజూ ఆగోడ చాటున నుంచిని చూస్తూ వుంటాడు మధు. ఎప్పటికప్పుడు రిక్షాలో పొమ్మని మధు పోరుకూడా. వసంత నడుస్తూ వెళ్ళటం మధుకు యిష్టం వుండదు. సూటిగా యీ విషయం చెప్పడు. అసలు వసంతతో తాను యెన్నో విషయాలు చెప్పాలని, ఆమెతో యేవేవో సంప్రదించాలని, ఆమె ఆసుపత్రి కెళ్ళిన తర్వాత అనుకుంటూ వుంటాడు. కాని, మళ్ళీ యింటికి వచ్చిన తర్వాత ఒక్కటి జ్ఞాపకం వున్నట్లు కనుపించదు.

అయిదింటిదాక సతమతమయి యింటికి వచ్చిన మధు వసంతలిద్దరూ హాయిగా వాకిట్లో వేపచెట్టు క్రింద కుర్చీలలో కూర్చుని మాట్లాడుకుంటూ వుంటారు. ఎంతసేపటికీను, వసంత ఆస్పత్రిలోని విశేషాలు, మధు తన స్కూలులో జరిగిన విషయాలు చెప్పు కోవడంతోనే సరిపోతుంది. వాళ్ళిద్దరికీ

నాటి కథ

కూడా పిల్లలంటే మహామోజు. బళ్ళోవున్న కాసేపు మధుకు యెంతో ఆనందంగా వుంటుంది. వాళ్ళ చేష్టలు, వాళ్ళ ప్రశ్నలు, వాళ్ళ సమాధానాలు మధు హృదయాన్ని గిలిగింతలు పెడుతూ వుంటాయి. వాళ్ళతో ఆడుకున్నట్లుంటుంది మధుకు. వసంతకు అంతకంటే ఆనందం ఆసుపత్రిలో పిల్లల్ని సముదాయించటం.

ఇవ్వాళ వేణు అనే అబ్బాయిని ఆసుపత్రినుంచి తీసుకుపోయారు. వెళ్ళిపోతూ వుంటే నన్ను చూసి ఒకటే యేడుపు. చూసిన వాళ్ళందరూ కన్న కడుపుకంటే, పెంచిన అమ్మే యెక్కువ అంటారు యిదే కాబోలు అన్నారు. నా మనస్సుకు యెట్లాగో అనిపించింది. ఎంతో సిగ్గుతో తలవంచుకుంది వసంత.

మధు ఒక్క క్షణం ఆగి "వేలెడు లేదు ఆ మణి పద్యాలన్నీ అప్పచెపుతాడు. నన్ను వదిలి పెట్టి ఒక్కక్షణం వుండడు ఆ బళ్ళో వున్న కాసేపు. వాళ్ళ నాన్నకు తబాదల్ అయిందట. వెళ్ళిపోతున్నాను మాష్టరు గారు అంటూ నమస్కారం పెట్టాడు. వసంతా.... నాకు తెలీకుండానే దుఃఖము వచ్చింది...." అంటూ గుటక వేశాడు.

ఇద్దరు కూడా కొద్ది క్షణాలపాటు యెవరి ఆలోచనల్లో వాళ్లు వుండి పోయారు.

"ఇవ్వాళ నలుగురి పిల్లల్ని వరసగా

**"ఇవ్వాళ నలుగురి పిల్లల్ని వరసగా తొట్టి మంచాలలో పడుకోబెట్టాను. అందులో ఓ పిల్ల లేచి ఒకటే యేడుపు. ఎంతమంది సముదాయించినా ఆగలేదు. చివరకు నేను తీసుకునేటప్పటికి చటుక్కున యేడుపు మానేసింది...." అతి పేలవంగా ఆమె పెదవుల మీదనుంచి చిరునవ్వు అదృశ్యమయింది. మళ్ళీ యిద్దరూ కొంచెంసేపు మౌనంగానే వుండిపోయారు. "వసంతా.... పిల్లల్ని చూస్తూవుంటే నాకు యేమిటోగా వుంటుంది" ఆపేశాడు మధు, వసంత కళ్లల్లోకి చూస్తూ.**

తొట్టి మంచాలలో పడుకోబెట్టాను. అందులో ఓ పిల్ల లేచి ఒకటే యేడుపు. ఎంతమంది సముదాయించినా ఆగలేదు. చివరకు నేను తీసుకునేటప్పటికి చటుక్కున యేడుపు మానేసింది...." అతి పేలవంగా ఆమె పెదవుల మీదనుంచి చిరునవ్వు అదృశ్యమయింది.

మళ్ళీ యిద్దరూ కొంచెంసేపు మౌనంగానే వుండిపోయారు.

"వసంతా.... పిల్లల్ని చూస్తూవుంటే నాకు యేమిటోగా వుంటుంది" ఆపేశాడు మధు, వసంత కళ్లల్లోకి చూస్తూ.

"పిల్లలు నా మీదకు యెగబడుతూ వుంటే నాకూ యేమిటో అనిపిస్తుంది. వసంత ప్రాధేయపు చూపులు మధును వుత్తేజ పరచినాయి.

ప్రక్కయింట్లో గడియారం ఠంగుఠంగుమని కొట్టకపోతే యిలాంటి సంభాషణలే చాలసేపటిదాకా సాగేవి.

"రేపు మళ్లీ పెందరాళే వెళ్లాలి కూడ. శాంతకు ఆపరేషన్ చేస్తారుట. నేను లేకపోతే మారాము పెడుతుంది" అంటూ యింట్లోకి వెళ్లి పడుకుంది వసంత.

మధుకూడా వెళ్ళి పడుకున్నాడు.

"పాపా... నేను చెప్పలా... అంతా తగ్గి పోతుంది... నిద్రపో... మా అమ్మకాదు.... నామాట వినవూ...." వసంత కలవరింత బాగానే వినిపిస్తోంది మధుకు.

ఎంత ప్రేమ పిల్లలంటే. నిజంగా నర్సుకు తగిపోయినదానివి. పాపం అనుకున్నాడు మధు.

ఒక్కొక్కప్పుడు మధుకూడా పిల్లలమీదే కలవరిస్తూ వుంటాడు. తెల్లారిన తర్వాత యిద్దరు కూడా రాత్రి వచ్చిన కలల మీద వ్యాఖ్యానించుకుని నవ్వుకుంటూ వుంటారు.

ఆనాడు ఆలస్యం అవుతుందేమోనని అన్నంకూడా తినకుండానే ఆసుపత్రికి వెళ్లిపోయింది వసంత. పిల్లలంటే వసంతకు అంత ప్రాణం. మధుకూడా యెప్పుడూ చెయ్యిచేసుకొని యెరుగడు బళ్లోకూడ. ఎవరో మాష్టరు గోపాలాన్ని కొట్టాడని, మనస్సులో యెన్నోరోజుల దాకా బాధపడ్డాడు. ఓసారి తొట్లోంచి పిల్ల క్రిందపడిపోతే అది తన అజాగ్రత్త వల్లనేమోనని వసంత ఓమూల కూర్చుని తనను తాను నిందించుకుంటూ కళ్లనీళ్లు పైకి కనపరచకుండా మధు యెంత బ్రతిమాలినా. వంటింట్లోకి రాని రోజులు న్నాయి. నాకు ఆదివారం వస్తే ప్రొద్దు గడవడు వసంతా అంటూ వుంటాడు మధు.

ఆవూరికి దక్షిణంగా వున్న తోటలోకి యెప్పుడైనా షికారుకు పోతూవుంటారు మధు, వసంతలు. ఆతోటలోకి జనం



విపరీతంగా వస్తూ వుంటారు. అందరి ఆడవాళ్ల దగ్గర ఒకల్లో, యిద్దరో పిల్లలు వుంటూనే వుంటారు. వసంత మధువంక చూసి వెంటనే తల వంచేసుకుంటుంది. మధు బిక్క మొహం కనిపించకండా బింకంగా వెళుతూ ఉంటాడు.

ఆ యిద్దరిలోనూ తీవ్రమైన ఆవేశం, గాఢమైన కోరిక రోజురోజుకు పెరిగి పోతున్నాయి. వసంత! వసంత ఋతువు లోంచి గ్రీష్మంలోకి వచ్చేసింది. మధు ఆశలు చిగిరించేస్తున్నాయి. కోకిలా రావాలు యిద్దర్నీ పరవశుల్నిగా చేస్తున్నాయి. ఇద్దరి ఆనందానికి అవధిలేదు. తాను పనిచేస్తున్న ఆసుపత్రికే వెళ్లింది వసంత. బైట వరండాలో విరామం లేకుండా అటూయిటూ పచార్లు చేస్తున్నాడు మధు.

నర్సువచ్చి మగపిల్లాడు అని చెప్పిపోయింది. మధు పొంగిపోయాడు. చిన్న పాప కేవు కేవు అరుపుల్లో వసంత హృదయం వుప్పొంగిపోయింది. మధు జీవితంలో కోరుకుంది వసంత యిచ్చింది. వసంత తన గాఢమైన అనురాగాన్ని పాపలో చూసుకుంది.

మధు దగ్గరగా నిలబడ్డాడు. కళ్ళు రెండు మూసుకుంది గట్టిగా వసంత. మధు మనస్సులో నవ్వుకున్నాడు. ఎన్నాళ్ళ కోరిక యీనాటికి ఫలించింది.

మధు వుయ్యాల పట్టుకు వచ్చాడు. వసంత వుయ్యాలకు అలంకారం చేసింది. మధు బొమ్మలు కొన్నాడు. వసంత బొమ్మలతో ఆడిస్తోంది పాపని. ఇద్దరూ కూడా మురిసిపోతున్నారు చిట్టి పాపను చూసి ఒక్క క్షణమైనా పాపని వదలి వుండలేరు. కాని వసంత సెలవు పూర్తి కావస్తోంది. మధు బలవంత పెడుతున్నాడు యింకా సెలవు పెట్టమని వసంత ఆలోచనలో పడింది. సెలవు పెట్టకపోతే పాపను చూడటానికి ప్రత్యేకంగా యెవర్నైనా పెట్టవలసి వుంటుంది. పరాయివాళ్ళమీద పాపను వదిలిపెట్టి వెళ్ళటానికి మనస్సు వప్పటం లేదు. రోజూ తనతో కూడా ఆసుపత్రికి తీసుకు వెళ్ళటం సాధ్యమైన పనిగా కనిపించటంలేదు. ఇవన్నీ ఆలోచించే మరికొన్నాళ్ళు సెలవు పొడిగించింది. మధు బళ్ళోకి వెళతాడన్నమాటే గాని ప్రాణమంతా యింట్లోనే వుంటుంది.

రోజులు గిర్రున తిరిగిపోవటంతో వసంత డ్యూటీలోకి వెళ్ళవలసిన రోజు వచ్చేసేస్తోంది. తప్పనిసరిగా ఓ పనిమనిషిని పెట్టుకోవలసి వచ్చింది. వసంత ఆసుపత్రిలో వున్నప్పుడు, మధు యింటికే వస్తూపోతూ వుంటాడు. ప్రొద్దున్నే లేచినప్పటినుంచి వసంత తన కొడుకు పనులలోనే సతమతమయిపోతుంది. తాను వున్నకాసేపు కూడ కొడుకు విషయం తానే చూడాలని పనిమనిషిని దగ్గరకు రానిచ్చేదికాదు. ఏ ఒక్కరోజూ కూడా సరియైన టైములో అటు మధు బళ్ళోకి వెళ్ళటంలేదు; ఇటు వసంత ఆసుపత్రికి వెళ్ళటంలేదు.

"మాస్టారూ, ఫర్డు బెల్ కూడా కొట్టారండి" అంటూ ఓ పిల్లాడు పరుగెత్తుకుంటూ వచ్చి మధుకు చెపితే, "వస్తాన్లే పో" అంటూ కసిరికొట్టాడు. ఆ పిల్లాడు బిక్కమొహం వేసుకుని బళ్లోకి వెళ్ళిపోయాడు.

"అమ్మగారు, డాక్టరుగారు మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారండి" అంటూ ఆసుపత్రినుంచి ఒకత్తె వస్తే, "వస్తాను నువ్వు పద, అయినా అంతమంది నర్సులుంటే నన్నే పిలుచుకు రమ్మన్నా రేమిటి" అంటూ విసుక్కుంది వసంత. క్రమక్రమేణా, మధు సరిగ్గా పాఠాలు చెప్పడంలేదనే భావం తోటిమాస్టర్లలో బయలుదేరుతోంది. వసంత శ్రద్ధగా నర్సుపని చెయ్యటం లేదనేమాట కూడా అనిపించుకుంది అక్కడి డాక్టరుచేత.

ఎప్పుడూకూడా పిల్లల్ని కొట్టనివాడు ఆనాడు మధు, కాంతారావును కొడుతుంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఏ పిల్లాడు ఏది అడిగినా విసుగ్గా కూర్చోమనడం కంటే, ఆప్యాయంగా సమాధానం చెప్పటమనేది మధు పూర్తిగా మరిచిపోయినాడా అనిపించింది.

"అవును మందు త్రాగకపోతే రోగం ఎట్లా నయమవుతుందమ్మా, పిల్ల కదా అని వూరుకుంటే ఓ పట్టాన మందు త్రాగుతుందా" అంటూ ఓ పిల్లను బలవంతంగా గదిలోకి తీసుకుపోయింది వసంత ఆసుపత్రిలో. పిల్లలంతా వసంత దగ్గరకు వెళ్ళటమంటే భయపడి పోతున్నారు. తోటి నర్సులు కూడా ఆశ్చర్యపోతున్నారు వసంతలో మార్పును చూసి.

ఆనాడు వసంత కొడుకు గుక్కపెట్టి యేడుస్తున్నాడు. ఎన్నివిధాల సముదా యించినా, యేడుపు తగ్గేటట్టులేదు. మధు బజారుకు పరుగెత్తాడు. వసంత యేమీ తెలియని పనిమనిషిని గదమాయి స్తోంది. ఇద్దరూ కంగారు పడిపోతున్నారు. తలోరకంగా అనుకుంటున్నారు. వసంతేమో దిష్టి తగిలిందేమో అనుకుం టోంది. మధేమో డాక్టర్ని పిలవాలను కుంటున్నాడు. ఏడ్చి, ఏడ్చి, చివరకు నిద్రపోయారు. పాప, తొట్టె వూగిస్తూ ఆదుర్దాగా చూస్తోంది వసంత.

ఇంతలో, ఆసుపత్రి నుంచి వచ్చిన ఓ అమ్మాయి ఎదురుగా నిలబడివుంది. "కరుణకు ఆపరేషన్ చేస్తారట. మిమ్మల్ని తొందరగా పిలుచుకురమ్మన్నారు" అన్నది ఆమె ఆదుర్దాగా.

**వసంత బొమ్మలతో ఆడిస్తోంది పాపని. ఇద్దరూ కూడా మురిసిపోతున్నారు చిట్టి పాపను చూసి ఒక్క క్షణమైనా పాపని వదలి వుండలేరు. కాని వసంత సెలవు పూర్తి కావస్తోంది. మధు బలవంత పెడుతున్నాడు యింకా సెలవు పెట్టమని వసంత ఆలోచ నలో పడింది. సెలవు పెట్టకపోతే పాపను చూడటానికి ప్రత్యేకంగా యెవర్నైనా పెట్టవలసి వుంటుంది. పరాయివాళ్ళమీద పాపను వదిలిపెట్టి వెళ్ళటానికి మనస్సు వప్పటం లేదు. రోజూ తనతో కూడా ఆసుపత్రికి తీసుకు వెళ్ళటం సాధ్యమైన పనిగా కనిపించటం లేదు.**

“నేను లేకపోతే ఆపరేషన్ జరగదా యేమిటి? చీటీ పంపించానుగా” అంటూ ఆ అమ్మాయిని విదిలించేసింది వసంత.

ఇంట్లో యిద్దరికీ తొట్టెలో పాప మీదే వుంది ప్రాణం అంతా. వాళ్ళ మనస్సులు యేమీ పనిచెయ్యటం లేదు. అంతసేపు యేడ్చి యిట్టే నిద్రపోయిందే అని వాళ్ళ బాధ. ఆనాడు యేకంగా మధు శలవే పెట్టాడు.

ఎవరో ఆసుపత్రినుంచి హఠాత్తుగా వచ్చి, “రమ చచ్చిపోయిందండీ. మీతో చెప్పిరమ్మని పంపించారు” అంది.

“పాపం చచ్చిపోయిందా... అయినా నాతో చెపితే యేం లాభం, వెళ్ళి వాళ్లమ్మతో చెప్పు” అంటూ వసంత చికాకు పడింది. ఓ వారం రోజులదాకా చెప్పుకోదగ్గ మార్పులు కనిపించలేదు.

ఆనాడు ఆదివారం. తీరిగ్గా మధు కొడుకును వళ్లో కూర్చోపెట్టుకుని, ముద్దాడుతున్నాడు. వసంత యెదురుగా కూర్చుని పాపను పలకరిస్తోంది.

“ఏమిటి, పాపకు వళ్లు వెచ్చగా వుంది...” మధు ఆశ్చర్యంగా వసంత వైపుకు చూశాడు.

వసంత గభాలున పాపను తన వళ్ళోకి తీసుకుంది. “అవునండీ బాగానే వెచ్చగా వుందే” వసంత చేతులతోపాటు కంఠం కూడా వణికిపోతోంది.

మధు చటుక్కునలేచి వాకిట్లోకి వెళ్లాడు. డాక్టరు ఏదో మందిచ్చి పోయాడన్న మాటేగాని, ఆ రాత్రల్లా జ్వరం వేగిపోతూనేవుంది. ఇద్దరూ కూడా మంచానికి అటువైపు యిటువైపు యెదురుగా కూర్చునే వున్నారు. భళ్లున తెల్లారిందన్న మాటేగాని, జ్వరంలో మార్పేమీ కనిపించలేదు. ఏమిచెయ్యాలో ఎవ్వరికీ తోచటంలేదు. మందులైతే పోస్తూనే వున్నారు. మధు వసంతలిద్దరు యెంతో విచారంగా కూర్చుని వున్నారు. తమ జీవితాల్లో యిది వూహించలేని ఒక ఘట్టం. తమకు అతి ప్రియమైనది తమకు దూరంగా అయిపోతోందా అనే భావం యిద్దర్నీ వణికించేసింది. ఇద్దరూ కూడా ఒక్కసారిగా తమ జీవితాల్లోని వెనకటి అధ్యాయాల్లోకి వెళ్ళారు. అక్కడ అనంతమైన సంతోషాన్ని అనుభవించినట్లు యిద్దరికి జ్ఞాపకం వచ్చింది. అయితే మధ్యలో తమ యిద్దరిలోనూ కలిగిన మార్పుకూడా యేదో అస్పష్టంగా, వాళ్ళిద్దరికే అర్థమవుతున్నట్లనిపించింది. కాని వివరంగా వాళ్ళకు యేమీ తెలియడంలేదు. తమ ఆలోచనలన్నీ వెర్రివేమో, తాము అట్లా అనుకోకూడదేమో అన్నట్లు యిద్దరు ఒక్కసారిగా తొట్టివైపు చూశారు.

అటు వసంత ఆప్యాయత గాని, యిటుమధు ఆదుర్దా గాని తాము కోరుకున్నది సాధించలేక పోయినాయి. మానవశక్తికి మించిన పని అయిపోయింది. ఆ క్షణంలో మధు, వసంత రోదన ధ్వనే మిగిలిపోయింది.

కొన్నాళ్ల ఖాళీ తొట్టెవైపు చూడలేక పోయేది వసంత. మధు మొహానికి గుడ్డ అడ్డం పెట్టుకుని వసంతకు కనిపించకుండా తన మనోవేదన తీర్చుకుంటూ వున్నాడు. వసంత, మధు దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం నవ్వుతూ వుండాలనే ప్రయత్నం చేస్తున్నట్లు, మధు కనిపెడుతూనే వున్నాడు. ఇద్దరి హృదయాల్లోనూ ప్రజ్వరిల్లుతూవున్న ఆ బాధను ఒకరికొకరు చెప్పుకోకుండానే, ఎవరి హృదయంలో వారు దాచేసుకున్నారు. ఇద్దరికీ అతిసన్నిహితమైన ఒక ప్రాణం తమకు కాకుండా అయిపోయింది. ఇప్పుడు యిద్దరికీ కూడా యెవరూలేరు. ఓవిధంగా అందరూ కూడా వీళ్ళిద్దరికీ సన్నిహితమైనవాళ్లే. మధుకు తన బడిపిల్లలు, వసంతకు తన ఆసుపత్రిలో పిల్లలు.

ఇప్పుడిప్పుడే వసంత, ఆసుపత్రికి వెళ్ళినప్పుడు పిల్లల్ని ఆప్యాయతగా చూసుకుంటోంది. మధు అంటే బళ్లపిల్లలికి కొంచెం కొంచెంగా చొరవ యేర్పడుతోంది. అదివరకు చిరాకుపడి కొట్టిన మధుకు, దెబ్బలు తిన్న రాము దగ్గరకు వెళ్లటానికి తన మనస్సు పూర్తిగా సమాధానపడటంలేదు. రమ చచ్చి పోయింది. ఈ మాటలే వసంత గుణించుకుంటూ వెక్కివెక్కి యేడుస్తోంది. తాను యేదో ఘోరమైన తప్పుచేశాను అని అస్పష్టంగా మధుకు అర్థమవుతోంది. వసంత ఆసుపత్రికి వెళ్ళి అందరితోను అదివరకు మాదిరిగా వుండటానికి భయపడి పోతుంది. తానేదో తప్పు చేసినట్లు తన అంతరాత్మ ఘోషిస్తున్నట్లు అనిపిస్తోంది వసంతకు.

ఎంతసేపు ఆలోచించినా, యిద్దరికీ కూడా తమకు తెలియకుండానే తాము చెయ్యరానిది ఒకటి చేశామని మాత్రం బాధ పడిపోతున్నారు.

రోజులు గడిచినకొద్దీ, సంతానం కోసం పరితపించి పోయిన, మధు వసంతలకు బడి, ఆసుపత్రి పిల్లలే స్వంత పిల్లలు అయిపోతున్నారు. మళ్ళీ గతకాలంలోని మనస్తత్వం యిద్దరికీ అలవడింది. మధు యెప్పుడూ తన బళ్ళో పిల్లలమాటే చెపుతూ వుంటాడు. వసంత యెప్పుడు ఆసుపత్రిలో పిల్లలమాటే చెపుతూ వుంటుంది. ఇద్దరూ పిల్లల మాటలు, వాళ్ళ చేష్టలు చెప్పుకుంటూ ఆనందంలో పరవశులయి పోతూవుంటారు. తన అనే మాట అప్పుడప్పుడు మధుకు, వసంతకు స్ఫురిస్తూ వుంటుంది. కాని వీపుమీద తట్టినట్లు యేదో ప్రతిధ్వని వినిపిస్తుంది. మధు, వసంతలు ఒకరికి తెలియకుండా ఒకరు ఒట్టు వేసుకున్నారు. మధు యెంతో అందంగా కనిపిస్తున్నాడు వసంతకు. వసంత యెంతో ఆకర్షణగా కనిపిస్తోంది మధుకు.

‘ఆ పిల్లను విడిచిపెట్టి, నేను క్షణం వుండలేనండి, త్వరగా వెళ్ళి పోవాలి’ అంటూ పనులన్నీ పూర్తిచేసుకుని మధు వైపుకు తిరిగి చిరునవ్వు నవ్వి గడప దాటింది వసంత డ్యూటీలోకి వెళ్ళటానికి.

“నేనేనా యింట్లో కూర్చోనేవాన్ని, నీను నేను యెప్పుడువస్తానా అంటూ కనిపెట్టుకు కూర్చుంటాడు. నేను వెళుతున్నా....” అంటూ మధు వుత్తరీయం మెల్లిగా భుజంపైకి వేసుకుని, రెండు తలుపులు లాగి తాళం వేశాడు.

***(పరిసరాలు-2, కథల సంకలనం నుంచి)***

వ్యాసం

# మట్టి భాషకు శనార్తి "ఊరికి పోయిన యాళ్ళ"

**మామిడి హరికృష్ణ కవితా మూలాల్ని ఆవిష్కరించిన వ్యాసం...**



**వేణు నక్షత్రం**
(యూఎస్ఏ 17038618368)

కొంతమంది కవుల కవిత్వాలు చదువుతుంటే రాబోయే టెక్నాలజీతో మారబోయే కాలాల్ని వివరిస్తుంటే ఊహల్లో తేలి పోతాం. ఇంకొందరి కవిత్వంలో ప్రేయసీ, ప్రియుల ప్రణయం, చిలిపి చేష్టలు మాత్రమే ఉంటాయి. మరికొందరి కవిత్వం చదువుతుంటే రోమాలు నిక్క బొడుచుకుని ప్రశ్నించడం నేర్పిస్తుంది. అణచివేతకు, నిరాదరణకు గురవుతున్న వారి దయనీయ పరిస్థితిని కొందరు తమ కవిత్వంతో సమాజానికి తెలియ చేయడానికి ప్రయత్నిస్తుంటే చదివిన పాఠకులు భావోద్వేగానికి గురవుతారు. ఈ విధంగా ఒక్కో కవికి తన కవిత్వంలో పలికించే అంశాలు, చదివించే గుణాలు భిన్నంగా ఉంటాయి.

మామిడి హరికృష్ణ రాసిన 'ఊరికి పోయిన యాళ్ళ' కవిత్వం చదువుతుంటే మనం గడిపిన బాల్యాన్ని, ఊరితో, తల్లి దండ్రులతో పెనవేసుకు పోయిన బంధాల్ని గుర్తు చేస్తుంది. సగం పగిలిన మట్టి కుండలో కట్టెల పొయ్యి మీద వేయించిన మొక్కజొన్న ప్యాలాల రుచి చూపిస్తాడు తన కవిత్వంతో. గంటకో సెల్ఫీ దిగే ఈ కాలంలో, SSCలో దిగిన బ్లాక్ అండ్ వైట్ ఫోటోనే చాలా మందికి మొదటి ఫోటో అనే విషయం గుర్తుకు తెప్పిస్తాడు తన కవిత్వంతో. పొలాల పొంటి, పొనాదుల పొంటి పూచిన తంగేడు పూల



పచ్చదనంతో మురిపిస్తాడు. హైద్రాబాద్ బిర్యానీ రుచి చూపిస్తాడు, బోనాల పండుగ సప్పుళ్ళను వినిపిస్తాడు తన కవిత్వంతో.

ఇంకా ఈ తరం పిల్లలు కోల్పోతున్న బాల్యాన్ని కళ్ళకు కట్టినట్టు మన ముందు ఉంచుతుంది హరికృష్ణ గారి కవిత్వం. మన చిన్నప్పటి ప్రతి సందర్భం 'ఊరికి పోయిన యాళ్ళ' కవితా సంపుటిలో కవితాంశామే! అంతే కాకుండా తెలంగాణ వెతలు, తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడంలో మన తండ్లాట, మిలియన్ మార్చ్ పోరాటం, కాళోజీ తాత ముచ్చట్లు, తెలంగాణ పల్లెల్లో పోలీసు-నక్సలైట్ల పరస్పర దాడుల్లో అమాయక పల్లె ప్రజల కష్టాలు, అందరికీ నీడ నిచ్చే ఊరి రావిచెట్టు, ఉగాది పండుగ, హైదరాబాద్ విశిష్టత, తెలంగాణ విశిష్టత ఇలా ప్రతీ ఒక్కటీ కవితాంశమైన మనల్ని అలరిస్తుంది, ఆలోచింపచేస్తుంది మామిడి హరికృష్ణ గారి కవిత్వం. తెలంగాణ నేలని వర్ణిస్తూ 'తంగెడుపూల నేల' కవిత, హిందూ ముస్లిం తెహజీబ్ ని వర్ణిస్తూ 'యాకుత్ పురా' అనే కవిత ఇలా పల్లె బతుకును, పట్నం బతుకుని తాకని విషయం లేదు, ఈ కవిత్వంలో అంటే అతిశయోక్తి కాదు.

అనవసరమైన భాషాడంబరాలకి పోకుండా, భావాడంబరాలకి పోకుండా మనం చిన్నప్పుడు వాడిన ఎన్నో పదాలు, మనం దాదాపుగా మరచిపోయిన పదాలు ఈ కవితా సంకలనంలో మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి, గిలిగింతలు పెట్టిస్తాయి చాలా సందర్భాల్లో!

మన వెనకటి పెద్ద మనుషులు సమయము సందర్భమూ లేకుండా ఊ అంటే చాలు వాళ్ల చిన్ననాటి విషయాలను చెప్పేవారు. వాటిని మనం ఏదో ఉబుసు పోని ముచ్చట్లు గానే చూశాము కానీ మన మీద సంసార భారం పడ్డ తర్వాత కానీ వారి వేదన మనకు అర్థం కాలేదు. మామిడి హరికృష్ణ గారు కూడా పెద్దలు చెప్పిన ఎన్నో విషయాలను ఇదేవిధంగా విని ఉండవచ్చు. ఆయన పెద్దవాడైన తర్వాత జ్ఞానవంతుడు అయిన తర్వాత తమ పెద్దల అనుభవాలను ఆశయాలను పరిగణనలోకి తీసుకొని తన పల్లె జ్ఞాపకాలను కవిత్వంగా పొందుపరిచాడు.




బాల్యం గురించి మాట్లాడటం అంటే నాగరికులు ఆనాటి ముచ్చట్లను తక్కువగా చూస్తారేమో కానీ అవి అక్షర సత్యాలు. వాటిని కాదని తర్వాతి దశలను పేర్కొంటే అది నేల విడిచి సాము చేయడమే అవుతుంది. బాల్యం ప్రతివారికీ ఉంటుంది. బాల్య జ్ఞాపకాలు అంటే పెద్దల మాటలే! అందువలన అప్పటికే ఇంకొకరు రాసినారని తెలిసినా, ప్రతివారు బాల్యం గురించి రాస్తారు. మామిడి హరికృష్ణ వరంగల్ జిల్లా నేపథ్యంలో పుట్టిపెరిగిన పరిస్థితుల నేపథ్యంలో జ్ఞాపకాల నేపథ్యంలో రాసిన ఈ కవిత్వం ఒక అద్భుతం, ఒక అబ్బురం.

పుట్టి పెరిగిన చోటు, తిరిగిన పరిసరాలు, చదువుకున్న స్కూల్, ఆడుకున్న వీధులు, అల్లరి చేసిన గల్లీలు, చెరుకు తోటలు, మక్కకంకులు కాల్చుకోవడం, అమ్మ జుట్టు దువ్వుతూ స్కూల్‌కి పంపిన జ్ఞాపకాలు, బాపు చేయి పట్టుకుని నడిచిన గురుతులు, ఇంకా ఎన్నో ఎన్నో సంఘటనలు మనందరి చిన్న తనంలో మరచి పోలేని మధుర జ్ఞాపకాలు. ఇతర సంస్కృతుల ప్రభావం వల్ల మన చిన్న తనంలో వాడిన ఎన్నో తెలంగాణ పదాలు వాడుకలో లేనందున దాదాపు మరుగున పడిపోయాయి అనవచ్చు. ఉదాహరణకు బాల్ దూసుకోవడం, కాకి ఎంగిలి, వడ్ల గుమ్మి, కూరాడు, కాగు ఇలా మరెన్నో పదాలు మన చిన్నప్పుడు ప్రతిరోజూ వాడిన పదాలే! కానీ ఇప్పుడు ఎవ్వరికీ వాటిని గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం కానీ, అవకాశం కానీ రాలేదు. చిన్నప్పటి ప్రతీ జ్ఞాపకాన్ని, అప్పటి భాషనీ, ఆ భాషలోని మధురిమలను ఒక కవితగా మలచి మనకు మన ఊరి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ 'ఊరికి పోయిన యాళ్ళ' కవితా సంపుటిని మనకందించి మనం కోల్పోయిన, కోల్పోతున్న బాల్యాన్ని మనకు గుర్తుచేశాడు మామిడి హరికృష్ణ.

ఈ సంపుటిలో ప్రతీ అంశం హరికృష్ణ పుట్టి పెరిగిన ఊరు వరంగల్ జిల్లాలోని శాయం పేట గ్రామ పరిసరాలు, స్కూల్, ఆ ప్రాంతం లోని, జాతర్లు, వాగులు, రోడ్లు ఇలా ప్రతీ ఒక్కటీ కవితాంశంగా దర్శనం ఇస్తాయి. అయితే హరికృష్ణ ప్రతి కవితలో ఆయన అనుభవాలని, ఆయన పుట్టి పెరిగిన ప్రదేశాలని కవితల్లో రాసినా, ఆ అనుభవాలు అన్నీ తెలంగాణలోని అందరి జీవితాలకి, అన్ని ప్రాంతాలకి వర్తిస్తాయి.

శాయంపేట ఊరి దగ్గర జరిగే తీర్థం (జాతర) పేరు బుగులోని తీర్థం. అదే ఇంకొక దగ్గర ఏడుపాయల జాతర, మరొక్క దగ్గర యండాల జాతర - పేరు మాత్రమే వేరు, కానీ జాతర, ఆ అనుభవాలన్నీ ఒకటే. శాయంపేట ఊరు దాటాలంటే 'సీతకుంట' దాటాల్సిందే! ఇంకొక వూరిలో 'ఎర్ర కుంట', ఒక వూరిలో 'బతుకమ్మ కుంట' లేదా చింతలకుంట. ఇలా పేరేదయినా కావచ్చు, కానీ సందర్భం మాత్రం ఒక్కటే ఊరికి పోవాలంటే మాత్రం ఏదో ఒక కుంట దాటాల్సిందే. వర్షాకాలంలో ఆ కుంట నిండితే ఎక్కడి జనాలు అక్కడ, ఎక్కడి బతుకులు అక్కడ ఆగిపోవాల్సిందే! ఇలాంటి ఎన్నో మన చిన్నప్పటి అనుభూతులని, చేదు అనుభవాలని కూడా కవితల రూపంలో మన కందించారు హరికృష్ణ ఈ "ఊరికి పోయిన యాళ్ళ" సంపుటిలో.

పండుగొస్తుందంటే చాలు, తల్లిదండ్రుల ఆరాటం అంత ఇంతా కాదు. పట్నంలో బతుకు తెరువును వెతుక్కుంటూ వెళ్లిన పిల్లలు తమ దగ్గరికి వస్తున్నారని కళ్ళల్లో వత్తులు వేసుకుని చూసే తల్లిదండ్రులు. అందరి తల్లిదండ్రుల తండ్లాట కూడా ఒక్కటే! ఊరికి రావాల్సిన బస్సు కోసం ఎదురు చూపులు, వీధి గుమ్మం వైపు ఎదురు చూపులు! ఆ చూపుల విలువ, ఆ కళ్ళలో పిల్లల పైన ఉన్న ప్రేమ, ఆప్యాయతకు వెల కట్టలేనిది. పండుగొచ్చిందంటే ఆ తండ్రి పడే తండ్లాట 'పండుగ' కవితలో చాలా అద్భుతంగా వివరించారు హరికృష్ణ.

పండుగత్తాందంటే సాలు
దునియాల లేని హైరానంత పడతాడు
మా నాయన...
అది
సద్దుల బత్కమ్మ - దసరా - దివిలి -
సంకురాత్రి - ఉగాది - వినాయకచవితి
ఏదన్న గానీ
కండ్లల్ల పెట్టుకొని పెంచిన పిల్లలంతా
రెక్కలొచ్చి ఎగిరిపోయినంక
గిప్పు ఒక్కడే తెల్లారే గట్లల్ల నుండి
పొద్దు గుంకి చీకటి పడే దాక
అటు తిర్గి ఇటు తిర్గీ
ఊళ్లకు వచ్చే పత్రికల్ని సద్వి
పెద్దోడు తెచ్చిన రంగీన్ టీవీల
సిన్మాలు సూసినంక గూడ
దినం గడ్వలేదని

**శాయంపేట** ఊరు దాటాలంటే 'సీతకుంట' దాటాల్సిందే! ఇంకొక వూరిలో 'ఎర్ర కుంట', ఒక వూరిలో 'బతుకమ్మ కుంట' లేదా చింతలకుంట. ఇలా పేరేదయినా కావచ్చు, కానీ సందర్భం మాత్రం ఒక్కటే ఊరికి పోవాలంటే మాత్రం ఏదో ఒక కుంట దాటాల్సిందే. వర్షాకాలంలో ఆ కుంట నిండితే ఎక్కడి జనాలు అక్కడ, ఎక్కడి బతుకులు అక్కడ ఆగిపోవా ల్సిందే!

ఇంటి ముందు పందిరి కింద నీడల్ని తిట్టుంటడు'

ఆ తండ్రి కొడుకు కోసం చూసే ఆ ఎదురు చూపులు - ఈ నాలుగు లైన్లు చదువుతుంటే మాత్రం ఖచ్చితంగా అందరికీ వారి తల్లి దండ్రులు తప్పక గుర్తుకు రావాల్సిందే!

ఇప్పుడు నిమిష నిమిషానికి సమాచారం అందించే ఫోన్‌లున్నాయి, ఎంత వరకు వచ్చారు అని ఫోన్ చేసి కనుక్కోవడం, అది వేరే విషయం. నా చిన్నప్పటి విషయానికి వస్తే, ఆ రోజుల్లో హైదరాబాద్ నుండి మేమొస్తున్నామని తెలిసినప్పుడు మా బాపు మాత్రం రోజుకి ఎన్ని సార్లు గేటు దగ్గర వరకూ వెళ్లి చూసొచ్చాడనే విషయం అమ్మ చెపితే తెలిసేది.

ఏ కవిత చదివినా మన స్మృతుల్ని బాల్యంలోకి తీసుకెళ్లడం మాత్రం గ్యారంటీ “ఊరికి పోయిన యాళ్ళ” చదువుతుంటే. బతుకమ్మ పేర్చేటప్పుడు పైన అందమయిన శిఖరం పెట్టితే ఆ బతుకమ్మకు ఒక సంపూర్ణత చేకూరు తుంది. ఆ శిఖరం బతుకమ్మకి మరింత అందాన్ని ఇస్తుంది. బతుకమ్మ లాంటి హరికృష్ణ కవిత్వానికి “ఊరికి పోయిన యాళ్ళ” అనే శిఖరం లాంటి కవితని కవితా సంపుటికి శీర్షికగా పెట్టడం ఈ సంపుటికి మరింత వన్నె తెచ్చింది. ‘ఊరికి పోయిన యాళ్ళ’ బతుకమ్మకు శిఖరం లాంటి ఈ కవితలో ఏముందీ అంటే

ఊరికి పోవడం అంటే
‘ఊరికే’ పోవడం కాదు, ఊపిరి కోసం పోవడం!
చిరిగిన నిక్కర్‌లోని బాల్యాన్ని
గడీల బడి చూరులోంచి దిగిన సూర్యున్ని
పెద్ద బడి బాదం చెట్టు నుండి రాలిన తరగతి పాఠాలని
ఒక్కసారి ఒడిసి పట్టుకోవడమే!
మనాలి సమ్మయ్య కత్తెర,
మేర మధుసూదన్ కుట్టు మిషిన్,
మాదిగ సాయిలు డప్పు,
ఫకీరు సాయిబు నెమలీకల కట్ట
మడతలు పడ్డ మస్తిష్కం లోంచి మళ్ళీ వెలికి తీయడమే!

ఊరికి రావడం అంటే
బస్సు పాస్, పాస్‌పోర్ట్, వీసాలు renew చేసుకున్నట్లు
నా identityని మళ్ళీ పొడిగించుకోవడం!
పొగ చూరిన ఊపిరితిత్తుల నిండా
తంగేడు పూల వాసనని మురిపెంగా నింపుకోవడం!

ఊరిలో మన జీవితం అంటే ఎన్నో వృత్తుల వారితో మమేకం కావాల్సిందే! ఎన్ని ఏళ్ళ తరువాత ఊరికి వెళ్ళినా, ఆ పరిచయాలు తప్పని సరిగా గుర్తుకు రావాల్సిందే! దాన్నే అందంగా ‘మడతలు పడ్డ మస్తిష్కం లోంచి మళ్ళీ వెలికి తీయడమే!’ అంటారు హరికృష్ణ.

బాల్ దువ్వి పౌడర్ ఏసుకుంట చెప్పింది
కొడ్కా! నువ్వు ఢిల్లీల మంచిపని చేత్తే
గా తెలుగోడు మంచోడు అంటరు!
కొడ్కా! నువ్వు ఎక్కడికి పోతే అక్కడికి నువ్వొక్కనివే పోకు
నీకు కనిపించకుండా
నీ బుజాల మీన కూసోని
నీ తోనే వత్తయి
నీ ఇంటి పేరు నీ కుటుంబ పరువు
నువ్వెక్కడికి పోతే అక్కడికి
నీ ఎనక పొంటే వత్తది
నీ ఏడేడు తరాల చరిత్ర
మనుషులు పోయినా వారు చేసిన మంచి చెడూ, వంశ చరిత్రలో భాగమై పోతుంది అని అమ్మ పిల్లలను బుద్దిగా హెచ్చరించిన తీరు ‘అమ్మ చెప్పిన ఖాందాని కత’ లో చాలా అద్భుతంగా వివరించారు హరికృష్ణ.

బుగులోని తీర్థం పలారాలను,
పేపర్ల పొట్లాల లెక్క కడతారు.
ఊళ్ళే అందరి ఇండ్లల్లకు పోయి
ముత్తయిదుల కాళ్ళకు పసుకు రాసి
పలారం పొట్లాలను అందరికీ పంచుతరు.

తీర్థం అంటే కొన్ని చోట్ల జాతర అని కూడా అంటారు తెలంగాణలో. జాతరకు పోయిన వాళ్ళు బొంగు ప్యాలాలు, బత్తీసలు, బెండ్లు, చిలకలు చిన్న చిన్న పొట్లాలు కట్టి ఊర్లె తెలిసినోళ్లందరికి పంచడం అందరికీ గుర్తు ఉండే ఉంటుంది. ‘బుగులోని తీర్థం’ కవితలో ఆ పలారం పంచడాన్ని గుర్తు చేయడమే కాకుండా తీర్థానికి వెళ్లడం లాంటి మధుర జ్ఞాపకాలు, తాత-అమ్మమ్మలు, నాయ నమ్మలు పోవడంతోనే ఆ అనుభూతి ఒక జ్ఞాపకంగా మిగిలిపోయిందనే ఆవేదన కన్పిస్తుంది ఈ క్రింది పంక్తుల్లో కవితలో.

ఇప్పుడు మా తాత.. బుగులోని తీర్థానికి మా యాత్ర
రెండూ చిన్నప్పటి జ్ఞాపకాల లెక్కనే !
తల్లి పేగును తెంపుకున్న పసిబిడ్డ లెక్కనే..! అని ముగుస్తుంది ‘బుగులోని తీర్థం’ కవిత.

‘ఆషాఢమాసం వస్తే చాలు
గోల్కొండ ఖిల్లా మీన తీన్మార్ డప్పు
నాఫీర, డోలు, తాషల సప్పుడు
డిక్కిరి డిక్కిరి, డిల్లెం-బల్లెం, డించిక్ .. డించిక్ అని మోగుతది.
ఇంకేమన్నా ఉన్నదా...
పూరా హైద్రాబాద్ పూనకాలచ్చి శివాలూగుతాది’ అని వర్ణిస్తూనే ..
‘ఎన్ని సెప్తే ఏమస్తది
ఎంత జేత్తే ఏమున్నది
నువ్వేమో ఇది పండుగే కాదంటివి
ఇదంతా అనాగరికం అంటివి
Cosmopolitan Cityల ఇవన్నీ అవమానాలంటివి!’ అని బోనాల పండగని విమర్శించిన వారికి, ఇది పండగే

**2014 జూన్ 2న తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు హరికృష్ణ. తెలంగాణ మాండలికంగా కాకుండా ఒక భాషగా అందరూ గమనించాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కాళోజీ నారాయణరావు జయంతి అయిన సెప్టెంబరు 9వ తేదీని ‘తెలంగాణ భాషా దినోత్సవం’గా ప్రభుత్వ అధికార ప్రకటన(జీ. ఓ) రావడం వెనుక మామిడి హరికృష్ణకి తెలంగాణ భాష పట్ల ఉన్న ప్రేమ, మమకారం తెలుస్తుంది.**

వ్యాసం

కాదన్నోళ్లకి

'ఇక బోనం సాక -

మన అస్తిత్వ పతాక!

తెలంగాణ గడ్పల్ల పసుపు కుంకుమల దీప శిఖ!!

మట్టి బిడ్డల గుండెలల్ల ప్రవహించే రక్త రేఖ!!!'

అని కర్ర కాల్చి వాత పెట్టారు 'బోనంసాక' అనే కవితలో.

2014 జూన్ 2న తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు హరికృష్ణ. తెలంగాణ మాండలికంగా కాకుండా ఒక భాషగా అందరూ గమనించాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి అయిన సెప్టెంబరు 9వ తేదీని 'తెలంగాణ భాషా దినోత్సవం'గా ప్రభుత్వ అధికార ప్రకటన(జీ. ఓ) రావడం వెనుక మామిడి హరికృష్ణకి తెలంగాణ భాష పట్ల ఉన్న ప్రేమ, మమకారం తెలుస్తుంది.

ముప్పై కవితలున్న ఈ సంపుటిని, తన తల్లి శ్రీమతి మామిడి స్వరాజ్యంకి అంకితం ఇస్తూ "తన కొనసాగింపుగా నన్ను ఈ లోకానికి ఇచ్చినందుకు.." అంటూ అమ్మపై ప్రేమను చాటుకుంటూ తెలంగాణ ఆత్మను ఆవిష్కరించారు ప్రతి కవితలో.

"తెలంగాణ భాష, తెలంగాణ ప్రజాజీవనం ఎంత సులభంగా, సులువుగా, సరళంగా ఉంటుందో అంతే సాదాసీదా తనం నా కవిత్వంలో ప్రతిబింబించాలనే ఉద్దేశంతో కవిత్వంలో సంక్లిష్టత, సందిగ్ధత లేకుండా అత్యంత సరళంగా, సహజంగా రాసే శైలినే ఎన్నుకున్నాను" అంటారు హరికృష్ణ ఒక సందర్భంలో 'ఊరికి పోయిన యాళ్ల' సంపుటిలో.

చెత్తిరి, చెరుకు బాయి, సర్కారు తుమ్మలు ఇలా అన్ని జ్ఞాపకాలు కవితలై మనల్ని ఊరికి, మన చిన్నతనంలోకి తీసుకెళ్తాయి. 'దారం కట్టిన సందమామ' అని ఒక చక్కటి శీర్షికతో పతంగిని వర్ణించారు. పతంగి చేయడం, దారం కట్టడం, ఎగురవేయడం, ఎగరవేయడంలో పడే శ్రమ అన్ని వర్ణించారు. ఈ కవిత చదువుతుంటే చిన్నప్పుడు మాంజా చేయడం కోసం గాజుముక్కలు ఏరుకొచ్చి దంచి దారానికి పట్టివ్వడం లాంటి సంఘటనలు ఎన్నటికీ మరచిపోలేము.

'పతంగి అంటే ఆస్మాన్‌కు మనం చెప్పే ఆదాబ్ షుక్రియా!' అంటూనే

'పతంగి అంటే దారం కట్టిన చందమామ' అని అద్భుత వాక్యాలతో ముగిస్తారు ఈ కవితని.

ఉస్మానియా యూనివర్సిటీ జ్ఞాపకాలు, తన హాస్టల్ రూమ్ జ్ఞాపకాలను "E-1, రూమ్ నంబర్ 70" అనే కవితలో వర్ణిస్తారు. ఇప్పుడు వివిధ దేశాల్లో, వివిధ హోదాల్లో ఉన్న ఎందరో ఉస్మానియా పూర్వ విద్యార్థులు అప్పటి తమ ఉస్మానియా హాస్టల్ జ్ఞాపకాలను ఈ కవిత ద్వారా తమ జ్ఞాపకాలుగా ఊహించు కోవడంలో సందేహమే లేదు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న హరికృష్ణ అప్పటి ఎన్నో జ్ఞాపకాలను కవిత్వంలో పలికించారు. 'ఇనుప కంచె.. అడ్డుగోడ.. ఒక జన జాతర' మిలియన్ మార్చ్ నేపథ్యంలో రాసిన కవిత.

'మా ఇంటి గడప దాటి

నేను మొదటి అడుగు వేసినప్పుడు

నేల మించి రేగిన మట్టి రేణువులను కూడా

నువ్వు ఆపలేవు!!'

నియ్యి ఉక్కు పాదాలు కావచ్చు

కానీ మా ఛాతీల ఊపిరిని తొక్కి పట్టలేవు!!

మిలియన్ మార్చ్..!

మిలియన్ మార్చ్...!!

మన మట్టి తండ్లాటను సాగరం దాకా తీసుకెళ్తమ్

మా బిడ్డలా కన్నీళ్లను హుస్సేన్ సాగరం దాకా తోలుకెళ్తమ్' అంటూ మన మట్టి తండ్లాటను, తెలంగాణా పౌరుషాన్ని వర్ణించారు ఈ కవితలో.

'గాయన సెప్పిన మాటే

మా గుండెల్ని మండిచ్చింది

గాయన రాసిన కైతే మా చేతుల్ని కత్తుల లెక్క మార్చింది

గాయన సూపిచ్చిన తొవ్వే ఈ మట్టికి విముక్తి బాట యేసింది'

నీ వందేళ్ళ కల తెలంగాణ

గిప్డు -

జెండా యై నిలిచింది!

నీకు వందనం చేత్తాంది !!' అని కాళోజీ గారి పట్ల తన ప్రేమని, గౌరవాన్ని చాటుకున్నారు 'జెండాగా ఎగిరిన అచ్చరం' కవితలో.

ఇక హైదరాబాద్ మీద ప్రేమని చూపుతూ 'occupy హైద్రాబాద్' కవితలో

'హైద్రాబాద్ నా తాత ముత్తాతల తెహజీబ్ గదా

హైదరాబాద్ తోన నాకు తరతరాల సుట్టిరికం ఉన్నది కదా!

గందుకనే, హైద్రాబాద్ ముచ్చట ఏది తెల్సినా

మనసు అగులుబుగులు అయితది' అని కొంత భయాన్ని, భక్తిని తెలియ చేస్తూనే

'బత్కచ్చినోనికే హైదరాబాద్ మీద గంత హక్కు ఉంటే

బత్కు ఇచ్చినోన్ని - నా బ్రతుకు అనుకున్నోన్ని..

మరి నాకెంత పావురం ఉంటుంది?' అని హైద్రాబాద్ మీద తన హక్కుని, ధిక్కార స్వరాన్ని ప్రకటిస్తాడు.

అలాగే హైదరాబాద్ మీద ప్రేమను 'పట్నం పెద్దమ్మ అసొంటిది' అనే కవితలో

'హైదరాబాద్ హైదరాబాద్ -

నువ్వు ఈ జమీన్ మీన వాలిన చాంద్ కా టుక్ డా!

ఈ దునియాల నిల్సిన సూరజ్ కా ముఖ్ డా!! అని చంద్రునితో హైద్రాబాద్‌ని పోల్చుతారు.

తెలంగాణ ఉద్యమం - ఈ తరం వారందరికి ఆ జ్ఞాపకాలంటేనే నరాలు జివ్వుమనే సందర్భం. ఊరూ - వాడని ఒక్కటి చేసింది. బీదా -బిక్కీని ఏకం చేసింది. ముసలి-ముతకని కలిపింది, రైతూ-రాజుని కలిపింది ఉద్యమం.

వయసు పైబడి మంచాన్ని పట్టిన వారు, నడవడానికి కూడా ఇబ్బంది పడే వారిలో కూడా ఉవ్వెత్తున లేచిన ఈ ఉద్యమం సరికొత్త ఆశల్ని రేకెత్తించింది. ఆ సందర్భాన్ని, ఆ పల్లె వాతావరణాన్ని చాలా ఉద్వేగంగా వర్ణించారు 'సలిమంట' కవితలో !

'మొన్నటి దాకా - సలిమంట దగ్గరకు వచ్చేటోల్లంతా
ఒకటే మాట సెప్పెటోళ్లు
నాకు పురాగా ఏదీ సమజ్ గాలేదు గానీ
నెల పదిహేను రోజుల సమ్మె దేశంల హడల్ అయ్యిందని
ఢిల్లీ గుండెలు కదిల్నాయని
ఇగ తెలంగాణను ఆపుడు దేవుని తోని కూడా కాదని
ఒకడ్ని మించి ఒకడు సెప్పబట్టే!'
బూమి మన కన్న అవ్వ లాంటిది
మన బూమి మనగ్గావాలె
మన అవ్వ మనగ్గావాలె గంతే!'

అని పుట్టినూరిని కన్నతల్లితో పోల్చి తన తెలంగాణ మట్టి పై మమకారాన్ని చాటుకున్నారు హరికృష్ణ ఈ 'సలిమంట' కవితలో.

శాయంపేట ఊరికి వెళ్ళాలంటే తప్పనిసరిగా సీతకుంట దాటాల్సిందే! ఊరితో, సీతకుంటతో తన అనుభవాలని 'సీతకుంట' కవితలో వర్ణిస్తూ...

'తెల్ల అంగీ - నేవీ బ్లూ నిక్కరు - బుజాల మీన వయ్యిలు
సడక్ మీన హవాయి చెప్పుల నడకలు.....
గానీ, కంటి పాపల నిండా సీత కుంట అలల కదలికలే!
గా సీతకుంట కాలానికొక్క తీర్గ ఉండేటిది మా ఊరి రైతులెక్కనే'

అని మనం ఎప్పుడో మర్చి పోయిన 'వయ్యిలు' అనే పుస్తకాలని గుర్తు చేశారు. హవాయి చెప్పులు, స్కూల్ డ్రెస్ లాంటి ఎన్నో విషయాలను గుర్తు చేశారు ఇందులో.

తెలంగాణకు తంగేడు పూలకు అనుబంధం అంతా ఇంతా కాదు. తంగేడు పూలు లేనిదే బతుకమ్మ లేదు. బతుకమ్మ లేనిదే తెలంగాణ లేదు. అంతటి ప్రత్యేకతను సంతరించుకున్న తంగేడు పూలను తెలంగాణ రాష్ట్ర పుష్పంగా ప్రకటించిన వేళ "తంగేడు పూల నేల" కవితలో తన సంబురాన్ని ఇలా పంచుకుంటారు

'మా తెలంగాణల పువ్వులనంగనే
యాదికచ్చే పూలు తంగేడు పూలే!
గవ్వి
మా ఆడ బిడ్డల సేతులల్ల
సల్లంగ ఇమిడిపొయ్యే పసి పోరీలు
చెర్వు పక్కకెల్లినా - పొలానికి నీళ్లు కట్ట బొయ్యినా
గా పొంటే, పచ్చంగ నవ్వే పడుసు పిల్లలు!'
'తంగేడు పువ్వు అనంగనే
తెలంగాణ మట్టి పువ్వై మెరుస్తది!
తెలంగాణ ఆత్మ నిలబడి గెలుస్తది!!'

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే హరికృష్ణ రాసిన "ఊరికి పోయిన యాళ్ల" సంపుటిలోని ప్రతీ కవిత ఒక తంగేడు పూవు లాంటిదే. మరచి పోలేని సుతి మెత్తని తంగేడు పూల రెక్కల్లా ప్రతీ కవిత మన బాల్యం లోతుల్లోకి తొంగి చూస్తూ ఎన్నో మధుర స్మృతుల్ని మనకి గుర్తు చేస్తూనే ఉంటాయి.

ఈ సంకలనానికి ముందుమాటగా తన మాటల్ని 'మట్టి భాషకు శనార్తి' అనే శీర్షిక పెట్టి అందులో ఈ విధంగా అంటారు "ఇక తెలంగాణా మాట, పదం, వాక్యం, ఇక ముందు యాసనో మాండలికమో కాదు 'పరిపూర్ణ భాష' అని మరొక్క సారి కవితా పరంగా చెప్పడానికి, చూపడానికి, ఈ సంకలనం ఏ కొంచెం దోహద పడినా నా ఆశయం నెరవేరి నట్లేనను భావిస్తున్నాను". హరికృష్ణ ఆశించినట్టుగా 'ఊరికి పోయిన యాళ్ల' ఏ సందేహం లేకుండా పూర్తిగా తెలంగాణ భాషలో రాయబడ్డది అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

మామిడి హరికృష్ణ కవితలు చదువుతుంటే గత, వర్తమాన పరిస్థితులను పోల్చుకోవలసి వస్తుంది. వ్యవసాయ రంగంలో మార్పులు వచ్చాయి. పెట్టుబడి ధరలు పెరిగిపోయాయి. దళారీల ఆగడాలు మితిమీరాయి. రాబడి అంతంత మాత్రమే. వ్యవసాయం చుట్టూ ఉన్న కళలు, వృత్తులు ఒకటి ఒకటి గా విస్మృతికి గురవుతున్నాయి. కొన్ని కళలు, కళారూపాలు ఆదరణ లేకుండా, చిన్నాభిన్నం అయిపోయాయి. వ్యవసాయం మీద ఆధార పడిన వృత్తుల వారు వలస బాట పట్టి రోజువారి కూలీలుగా మారారు . పల్లె స్వరూపం మారిపోయింది. నిరుద్యోగం పెరిగిపోయింది. అంతా డబ్బు చుట్టు తిరుగుతున్న వ్యవస్థగా మారిపోయింది. పల్లెల్లో అటు వ్యవసాయం లేక బతుకుతెరువు లేక ఉద్యోగాలు వెతుక్కుంటూ, పెద్ద సదువుల కోసం యువత పట్నం బాట పట్టినపుడు ఊర్లు ఎలా బోసి పోయి ఉన్నాయో అని తన ఆవేదనని 'ఊరు బతుక బోతాంది..!' అనే కవితలో చాలా హృద్యంగా వర్ణించారు.

సూత్తాంటే సూత్తాంటేనే ఊరు -
పట్నం రంగు పూసుకునుడు
పట్నం బతుకు మీద
కతలు కతల్లెక్క సెప్పుకునుడు షురూ జేసింది
గియ్యాల మా ఊళ్లే అందరూ అయ్యవ్వలూ
గాల్ల పోరగాల్లను
"పట్నంల ఏదన్న పని సూస్కోరాదు కొడ్కా"
అని సాగుతోలుతాండ్లు'.

అని తల్లి తండ్రుల నిస్సహాయతను వినిపించారు ఈ కవితలో.

"మా గోసను మేము చెప్పాలే" అనే దశ నుండి "మా గోసను మా బాసలోనే చెప్పాలె" అనే తర్వాత దశలోని స్పష్టమైన తండ్లాటకు ఈ సంకలనం ఓ సంకేతం అని సగర్వంగా ప్రకటించారు హరికృష్ణ. హరికృష్ణ ఆశించినట్టుగా ఇప్పుడు తెలంగాణ భాష ఏ మాత్రం సంకోచం లేకుండా అక్షరాలా 'తెలంగాణ పరిపూర్ణ భాష' అని ఈ పుస్తకం ఋజువు చేసింది. అందరూ తప్పని సరిగా చదవాల్సిన కవితా సంపుటి 'ఊరికి పోయిన యాళ్ళ".

శనార్తులు!

కవిత



# బీళ్ళ భూమి కాదు

కోటం చంద్రశేఖర్, 94920 43348

బీళ్ళ భూమి కాదు
ముళ్ళభూమి కాదు
రాళ్ళభూమి కాదు
అటు చూడు
అలుగులు ఆడుతున్నాయి
గుంటలు నీటిగంటలు మోగిస్తున్నాయి
పగుళ్ళ భూమి కాదు
దిగుళ్ళ భూమి కాదు
ఇటు చూడు
కొండల్ని చుట్టుకొని
అడవుల్ని దాటుకొని
వాగులు వయ్యారాలు పోతున్నాయి
సెలయేళ్ళు పరవళ్ళు తీస్తున్నాయి
మాది నీళ్ళ భూమి -
ఇంకుడు గుంతలు కొట్టాం; చెక్ డ్యాములు కట్టాం
ప్రాజెక్టులు చేపట్టాం

నీళ్ళ భూమి మాది -
కష్టాల కొలిమిలోంచి
దారిద్రపు శృంఖలాల్లోంచి బైటపడ్డాం -
మనస్సులను మంత్రించే
హృదయాలను కదిలించే
కరువు కదలికల్ని కట్టడి చేసే
వాన నీళ్ళో వరద నీళ్ళో -
చెర్లు బోర్లు నిండి నీళ్ళు
పల్లెలన్నీ పసిడిపంటల లోగిళ్ళు -
చిత్రకారుడు నీటి కుంచెతో ఎంత
అందమైన చిత్రం గీసాడు
జీవన ప్రస్థానం సజావుగా సాగడాన్కి
నీరెంత అవసరమో చెప్పాడు
చేయూతతో
రైతు హిత సేద్యం
సర్వహిత జనామోదం

కథ

# బుడబుక్కల బంగారు తల్లి

ఆపదను ఎదుర్కొనే మనిషి స్థైర్యం తెలిపే కథ....

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
93936 62821

వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా భారీ వర్షాలు.

ఆగి ఆగి నిండు కుండను కుమ్మరించి నట్లుగా కురిసిన వానకు చెరువులన్నీ నిండిపోయాయి. రోడ్లన్నీ పాడయ్యాయి. పంట పొలాలు చెల్లాచెదురయ్యాయి. ఎన్నో చెరువులు తెగిపోయాయి, వాగులు పొంగాయి.

సాయంత్రం, సమయం నాలుగయ్యింది.

ఆదిలక్ష్మి ఊరి చెరువు గట్టు మీద నిలబడి ఏడుస్తోంది.

గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్ బై.పి.సి. కోర్సు పూర్తి చేసి, నీట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. నాయన బుడబుక్కల వేషం కట్టి ఊరూరూ తిరుగుతుంటాడు. నాయనతో పాటే ఢమరుకం వాయిస్తూ వెళుతుంది ఆదిలక్ష్మి. అయితే, పరీక్షలకు బాగా ప్రిపేర్ కావాలని, మెడిసిన్‌లో సీటు ఎలాగైనా సంపాదించాలని ఈ సారి అమ్మని నాయనకు తోడు చేసి పంపింది.

"ఏమి చేసేదిరా భగవంతుడా! తెల్లారితో నీట్ పరీక్ష ఉంది. చెరువు మధ్య ఉన్న కరెంట్ స్తంభాల తీగలు తెగి ఉన్నాయి. కరెంట్ పోయి గంటయ్యింది. ఇప్పుడు ఎవరు వచ్చి వీటిని రిపేరు చేస్తారు? పరీక్షలకు బాగా చదివాను. ఈ రాత్రికి సిలబస్ అంతా ఒక్కసారి రివిజన్ చేసుకుందామనుకున్నాను. ఎవరికి చెప్పుకునేది నా కష్టం. అమ్మనాన్నలు ఇంటికి ఎప్పుడు వస్తారో" అని తనలో తను బాధపడుతోంది.

అక్కడే బావి మోటారు స్టార్టరు రిపేరు చేస్తున్న దండాలస్వామి...

"కూసుంటే కూడు, సేతి కొత్తదా
కూసుంటే కుంపటి, రాజుకుంటదా"

అని పాడుకుంటూ వున్నాడు.

అవసరం వున్నా లేకున్నా కనబడిన వారికందరికీ దండాలు పెడతాడని అందరూ అతడిని దండాలస్వామి అని పిలుస్తారు.

దండాల స్వామి వానలో నిలబడి ఏడుస్తున్న ఆదిలక్ష్మిని చూసాడు. ఆది లక్ష్మిని విషయం అడిగి తెలుసుకున్నాడు.

ఏమి జరిగిందోనని పక్కనే వున్న టెంకాయ చెట్టు ఎక్కి, చెరువు నీళ్ళల్లో తెగి వేలాడుతున్న కరెంటు తీగల్ని చూశాడు.

ఏదో ఒక విధంగా ఆదిలక్ష్మికి సహాయం చేయాలని, అంత పెద్ద వానలో "అయ్యో, అయ్యో, అయ్యయ్యో." అనుకుంటూ పంచె ఎగేసుకుని 'తపక్ తపక్' అని నీళ్లలో నడుచుకుంటూ బయలుదేరాడు. దారిలో కాలుజారి పడబోయాడు. పక్కనే వున్న వేప చెట్టును పట్టుకుని తప్పించుకున్నాడు. "ఏనుగు కాలు పెద్దదైనా, ఏనుగు కాలు కూడా జారుతుంది కదా, మనమొక లెక్కా" అనుకుంటూ వెళ్ళాడు. మైలు దూరం నడిచి 33 కేవి సబ్ స్టేషన్ చేరినాడు. అక్కడ పని చేస్తున్న ఉద్యోగి కనకదాసుకు విషయం చెప్పాడు.

కనకదాసు వెంటనే తన కొలీగ్స్ కి ఫోన్ చేసి చెరువు కాడికి రమ్మన్నాడు. సీటు నుంచి లేచి తలకు టోపీ, రైన్ కోటు వేసుకుని బండి స్టార్ట్ చేసినాడు. ఇంతలో భార్య నుంచి ఫోన్ వచ్చింది.

"ఏమండీ, ఎక్కడ ఉన్నారు? వానలు ఎక్కువగా పడుతున్నాయి. జాగ్రత్తగా ఉండండి".

"చెరువులోని కరెంట్ తీగలు తెగినాయి. నీట్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే పిల్లోళ్ళు ఊర్లో ఉన్నారు వెళ్లి రిపేరు చేసి వస్తాను" అన్నాడు.

"ఇంత వానలోనా? ఎగిరెగిరి దంచినా, ఎగరక దంచినా జీతం ఒకటే కదా. ఎందుకంత కష్టపడతారు. మన ప్రాణాల మీదకు వస్తే మనల్ని ఎవరు కాపాడుతారు? ఊపిరి ఉంటే ఉప్పు అమ్మి అయినా బతకవచ్చు కదా" అని చెప్పింది.

"సరేలే, మల్ల మాట్లాడదాం" అని చెప్పి బండిలో బయలుదేరాడు. బండి వెనుక కూర్చున్న దండాల స్వామి దారి చూపించాడు.

అప్పటికే ఊరి జనమంతా చెరువు కట్ట మీద నిలబడి ఉన్నారు. వర్షం జోరుగా పడుతున్నా, భోరు గాలి వీస్తున్నా, అందరూ తెగిన తీగల వైపు చూస్తూ "ఏమి

చెయ్యాలా" అని గట్టిగట్టిగా మాట్లాడు కుంటున్నారు.

కనకదాసు నడుముకు తాడు కట్టుకున్నాడు. చెరువులోని ఒక కరెంట్ స్థంభంని ఆధారం చేసుకుని, కరెంట్ తీగలకు వేలాడుతూ సమస్య వున్న చోటికి వెళ్లి మరమ్మతు చేద్దామని నీళ్ల లోకి దిగాడు. ఊర్లో వాళ్లంతా "జాగ్రత్త, జాగ్రత్త" అని అరుస్తున్నారు. ఎక్కడి నుంచో ఒక నీటి ప్రవాహం వచ్చి నీళ్ల ఉధృతి పెరిగిపోయింది. నీళ్లు అతడి భుజాల వరకు రావడంతో కొంచెం దూరం నీళ్ళలోనే కొట్టుకుపోయాడు. ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితి. పక్కనే వున్న చిన్న కానుగ చెట్టును గట్టిగా పట్టుకున్నాడు. ఇంతలో ఒక పాము వీపు మీదుగా వెళ్లి అతడి చుట్టూ చక్కర్లు కొట్టి తన దారిన తను వెళ్ళిపోయింది. ఒక్క సారిగా ఉలిక్కి పడినాడు. నీళ్ళల్లో ఉన్నా, ముఖం చెమటతో తడిసిపోయింది.

ఇంతలో రావి చెట్టు మీది తేనెటీగలు 'జుమ్' అని అతడి చుట్టూ చేరినాయి. వాటిని చేత్తో తరిమే దానికి ప్రయత్నించి నాడు. అవి 'సురుక్ సురుక్' మని చేతిని కరిచి పెట్టాయి. చేతి నిండా ఎర్రటి దద్దులు. తేనెటీగలను తప్పించుకోవడానికి నీళ్ళల్లో మునిగి కొంచెం దూరం ఈది వేప చెట్టు ఒకటి కనబడితే దాని కొమ్మను పట్టుకున్నాడు. నీటి ఉధృతి రెట్టింపు

ఊర్లో వాళ్లంతా "జాగ్రత్త, జాగ్రత్త" అని అరుస్తున్నారు. ఎక్కడి నుంచో ఒక నీటి ప్రవాహం వచ్చి నీళ్ల ఉధృతి పెరిగిపోయింది. నీళ్లు అతడి భుజాల వరకు రావడంతో కొంచెం దూరం నీళ్ళలోనే కొట్టుకు పోయాడు. ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితి. పక్కనే వున్న చిన్న కానుగ చెట్టును గట్టిగా పట్టుకు న్నాడు. ఇంతలో ఒక పాము వీపు మీదుగా వెళ్లి అతడి చుట్టూ చక్కర్లు కొట్టి తన దారిన తను వెళ్ళిపోయింది.



అయ్యింది. మొండి ధైర్యం తెచ్చుకు న్నాడు. పట్టుకున్న కొమ్మ పట్టుజారే పరిస్థితి వచ్చినా ధైర్యంగా అక్కడే నిలబడినాడు.

ఇంతలో అక్కడికి చేరుకున్న కరెంట్ సిబ్బంది నీళ్ళలోకి దూకి అతడిని ఒడ్డుకు చేర్చారు. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ ఇంజినీర్ బుల్లెట్ బండిలో వచ్చి పరిస్థితి అంచనా వేశాడు. వెంటనే అటవీ శాఖ అధికారులతో మాట్లాడి లైఫ్ జాకెట్లు తెప్పించాడు. సిబ్బంది వాటిని వేసుకుని చెరువులో ఈదుకుంటూ వెళ్లి, తెగిన తీగలకు మరమ్మతు చేసారు. ఊరి జనం "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నారు.

దీపాలు వెలిగించే వేళ-

రచ్చబండ కాడ, చింత చెట్టు కింద ఊరు ఊరంతా గుంపుగా చేరింది.

దీపాల వెలుగులో కనక దాసు మెరిసిపోతున్నాడు. అతడితో పాటు అతడికి సహకరించిన సిబ్బంది కూడా ఉన్నారు.

అతడిని భుజాల మీద ఎక్కించుకుని మగపిలకాయలు "హై హై" అంటూ ఎగురుతున్నారు. ఆడ పిలకాయలు దొంగచూపులు చూస్తున్నారు. వారు చూసే కొద్దీ, మగపిలకాయలు ఎగిరెగిరి డ్యాన్సులు చేస్తున్నారు. మూలగా నిలబడి వున్న కనకదాసు భార్య వారి ఆనందాన్ని కళ్ళార్పకుండా చూస్తోంది.

తెల్ల పంచె, చొక్కా, వేసి తల పాగా చుట్టిన దండాలస్వామి చేతి రుమాలు పైకి ఎగుర వేస్తూ పాట పాడినాడు.

"నవ్వుల పువ్వుల రాజా, నువ్వు సల్లగుండాలి

ముసిముసి నవ్వుల రాజా, నువ్వు సల్లగుండాలి

మిలమిల మెరిసే రాజా, నువ్వు సల్లగుండాలి

తళ తళ లాడే రాజా, నువ్వు సల్లగుండాలి".

పాట పాడటం ఆపేసి ఆకూ వక్క నములుతూ, వయ్యారంగా చేతులు తిప్పుతూ ఇలా చెప్పాడు "మా ఊరిలోనే కాదు, మా పంచాయితీ లోనే డాక్టరు చదువు ఒక్కరు కూడా చదవలేదు. మగ బిడ్డలే చదవనిది, ఆడబిడ్డ చదవతా వుండాది. మా ఆదిలక్ష్మి డాక్టరు అవతా వుంది. మూడు నెలల ముందు కనకదాసు చేసిన సాహసం వల్ల ఇది జరిగింది. పరీక్ష ముందు రోజు ఒకటే వర్షం. కరెంట్ తీగలు తెగిపోయాయి. అతడు ప్రాణాలకు తెగించి సాహసం చేయడం ద్వారానే ఆదిలక్ష్మి పరీక్షలకు బాగా చదివి రాయగ

లిగింది. మెడిసిన్ సీట్ సంపాదించ గలిగింది"

ఊరి జనం పూల వర్షం కురిపించారు. మిఠాయిలు పంచారు. టపాకాయలు పేల్చారు. ఊళలు, ఈలలు వేసి రంగులు చల్లుకున్నారు. పలకలు వాయించినారు. పులి అడుగులు వేసినారు.

కనకదాసుకు శాలువా కప్పి పూలమాల వేశారు. ఆదిలక్ష్మి అమ్మనాన్నలు కనకదాసుకు పంచె, చొక్కా, ఇచ్చి జేజేలు పలికినారు. మిగిలిన సిబ్బందికి గౌరవ సూచకంగా పూలమాలలు వేసినారు. వారందరికీ పెద్దపెద్ద కుంకుమ బొట్టులు పెట్టినారు. తలకి తెల్ల తువ్వాలు చుట్టినారు.

కనకదాసు భార్యను పిలిచి కంచిపట్టు చీర బహుమతిగా ఇచ్చారు. ఆమె కళ్ళ నిండా నీళ్లు. చీర అందుకుంటున్న ఆమె "మా ఇంటాయన చేసే పని ఇలా వందలాది మందికి మంచి చేస్తుందని నాకు తెలియదు. ఆయన ఈ సాహసం చేస్తానన్నప్పుడు మామూలు గృహిణిలా వద్దన్నాను. కాస్తోకూస్తో చదువుకున్న దానినైనా స్వార్థంగానే ఆలోచించాను. మంచి జరుగుతుందనుకున్నప్పుడు, చేసే పని విషయంలో భయపడకూడదని ఇప్పుడు తెలుసుకున్నాను. ఆయన తన ఉద్యోగ నిర్వహణలో భాగంగా చేసిన ఒక మంచి పని ఇంతమందికి ఆనందాన్ని ఇస్తుందని ఊహించలేదు. ఏమైనా జరగరానిది జరిగితే ఎలా అని భయపడ్డాను. అడుగు ముందు కెయ్యాలంటే దైర్యం చేయాల్సిందే. పురిటినొప్పులు లేకుండా బిడ్డలు పుట్టరు కదా.

**పాట పాడటం ఆపేసి ఆకూ వక్కనములుతూ, వయ్యారంగా చేతులు తిప్పుతూ ఇలా చెప్పాడు "మా ఊరిలోనే కాదు, మా పంచాయితీ లోనే డాక్టరు చదువు ఒక్కరు కూడా చదవలేదు. మగ బిడ్డలే చదవనిది, ఆడబిడ్డ చదవతా వుండాది. మా ఆదిలక్ష్మి డాక్టరు అవతా వుంది. మూడు నెలల ముందు కనకదాసు చేసిన సాహసం వల్ల ఇది జరిగింది.**

ఇంతే కాదు, అంత ఇబ్బందులలో కూడా కష్టపడి చదివి తను అనుకున్న సీటు మెరిట్‌గా సంపాదించుకున్న బుడబుక్కల బంగారు తల్లి ఆదిలక్ష్మికి మంచి భవిష్యత్తు వుంది. మా వంతు సహాయంగా, ఆమె కాలేజీ ఫీజులు మేమే కడుతాం" అని చెప్పడంతో ఊరి జనం చప్పట్లు కొట్టారు.

దూరంగా వున్న ఆదిలక్ష్మి ఆవు రంకెలేసింది. ఆవు మెడలోని గంటలు ఆగి ఆగి మ్రోగుతున్నాయి.

పక్కనే నిలబడి వేడుక చూస్తున్న ఆదిలక్ష్మి రెండు చేతులెత్తి అందరికీ నమస్కరించింది. చల్లగా వీచిన గాలికి చింత ఆకులు గలగలా కదిలినాయి. చింత పూత పలపలా రాలింది. పలకలు బలంగా కొడుతున్నారు.

దండాల స్వామి అందరికీ దండాలు పెట్టింది పెట్టిందే.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in



# ఎక్కడి మతాలు...?
# ఎక్కడి కులాలు...??



బికారి, 9490617017

ఎక్కడికక్కడ అరాచకాలు
అన్యాయాలు
అమానుషాలు
అవమానాలు
అవరోధాలు
చరిత్ర చదివిన జ్ఞానుల్లారా....
శాస్త్రం తెలిసిన విజ్ఞానుల్లారా...
మతాల, కులాల గొడవలతో గతాన్ని మరచిన
అజ్ఞానుల్లారా...
ఎక్కడి మతాలు... ఎక్కడి కులాలు
గతుకుల... బ్రతుకుల... మెతుకుల పోరులో
వెలుతురు వెతుకుతు... వెతలను భరిస్తు...
కష్టం మడుగులో... అడుగులు వేస్తూ...
ఘడియ ఘడియకో గండం దాటే....
మనుషుల మనసులకెక్కడి మతాలు...
ఎక్కడి కులాలు...
పుట్టుక ఒక్కటి
మరణం ఒక్కటి
ఆకలి ఒక్కటి, దప్పిక ఒక్కటి
ఆశనిరాశల భాషలు ఒక్కటి
జీవి గ పుట్టిన ప్రతి ఒక్కరికి జీవన చలనం,
జీవిత గమనం ఒక్కటి.. ఒక్కటి....
ఇతర జీవులకు లేని మతం...
ఇతర ప్రాణులకు లేని కులం....
ఎక్కడిదేక్కడిదేక్కడిది....
జ్ఞానం నేర్పిన.. విజ్ఞానంలో... అజ్ఞానంతో
మనిషిని మనిషిగ చూడని మనుషుల
మనసులకెక్కడి మతాలు, ఎక్కడి కులాలు...

పుస్తక పరిచయం

# ఆద్యంతం సందేశాత్మకం... రామాయణ పరివారం!

బుర్రా వెంకటేశం రామాయణ రచనలోని లోతులు విశ్లేషించిన వ్యాసం....




దాస్యం సేనాధిపతి
94405 25544


భారతీయ సంస్కృతికి అద్దం పడుతూ... యుగయుగాలుగా... తరతరాలుగా నిత్య పారాయణ గ్రంథంగా వెలుగొందుతున్న రామాయణం... ఓ పుణ్య కావ్యం.. అందరిచే ఆరాధింపబడుతున్న రామాయణం జీవితంలో వచ్చే సమస్యలకు పరిష్కారం చూపే ఓ మహోన్నత గ్రంథం... త్రేతాయుగానికి సంబంధించిన శ్రీరాముని ఆదర్శాలు... కాలాలు మారినా... తరాలు గడిచి పోతున్నా.. ఇప్పటికీ.. ఎప్పటికీ అనుసరణీయం... సామాజిక విలువలకు పట్టం కట్టే అనేక అంశాలు రామాయణం ద్వారా పొందగలం.. శ్రీరాముని సుగుణాలు అజరామరంగా నిల్వడం విశేషం... అన్నదమ్ముల అనుబంధానికి.. ఆదర్శ దాంపత్యానికి... ఒక్కమాటలో చెప్పాలంటే... జీవితంలోని అన్ని సమస్యలను అధిగమించడానికి కావలసిన పరిష్కార మార్గాలను ప్రసాదించే గ్రంథం రామాయణం!

లోకకళ్యాణం కోసం దేవుడే మానవ రూపంలో జన్మించి... పురుషోత్తముడిగా భాసిల్లిన శ్రీరాముల వారి వ్యక్తిత్వం... మూర్తిమత్వం జగమంతా ఆచరించేలా మారడం విశేషం!

శ్రీరాములవారు భారతీయ కుటుంబ వ్యవస్థకు పటిష్టమైన పునాదులు వేసి. తమ సదాచార సంపన్నతతో.. పెద్దలు,




తల్లిదండ్రులు, గురువుల పట్ల శ్రద్ధాభక్తులతో... అందరి హృదయాల్లో కొలువు దీరిన ఆరాధ్యుడు. ఆదర్శవంతమైన కుటుంబ జీవన విధానానికి బాటలు వేసిన శ్రీరాములవారు... తమ నడవడి ద్వారా ఎన్నో విషయాల్లో జగతికి ప్రేరణ నిచ్చారు. రామాయణం అంటే ఒక పుస్తకం కాదు, దిక్కుతోచని జీవన గమనంలో ఓ దిక్సూచి, చిమ్మచీకట్లో వెలుగులు పంచే దీపం!

మారుతున్న ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలన్నీ మసకబారుతున్నాయి.. సంబంధ బాంధవ్యాలు కాస్త 'మనీ'తో ముడిపడి పోతున్నాయి... వేగవంతమైన యాంత్రిక యుగంలో... మన సంస్కృతి పట్లగాని.. దేశం పట్లగాని శ్రద్ధాభక్తులను అలవర్చే చదువులూ దూరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ ఆత్మకు మూలస్తంభంగా భాసిల్లే రామాయణం స్ఫూర్తితో బంధాలు అనుబంధాలు మరింత బలపడేలా చూసుకోవచ్చు.

ప్రపంచంలోని ఎన్నో భాషల్లో రామాయణం యొక్క ప్రాశస్త్యాన్ని వివరిస్తూ గ్రంథాలను ప్రకటించి.. భారతీయతను భారతీయ కుటుంబ జీవన ఔన్నత్యాన్ని చాటిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వాల్మీకి రామాయణంతో పాటు అనేక మంది మహానుభావులు రామాయణాన్ని విభిన్నమైన వ్యాఖ్యానాలతో సమాజానికి అందించిన వారున్నారు. వివిధ ప్రక్రియల్లో అసంఖ్యాకంగా పుస్తకాలు ప్రకటింపబడినాయి. ఇంకనూ వెలువడుతూనే ఉన్నాయి. కథ శ్రీరాముల వారిదే అయినా.. సామాజిక అవసరాలను... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో విధాలుగా ఆవిష్కరించడాన్ని చూస్తున్నాం... మసక బారుతున్న సంబంధ బాంధవ్యాలకు మెరుగులు అద్దాలని... బీటలు వారుతున్న కుటుంబ వ్యవస్థను సరైన బాటలో నడపాలన్న సంకల్పంతో

పుస్తక పరిచయం

రామాయణం వెలుగులో ఎంతో మంది కవులు, రచయితలు.. చరిత్రకారులు తమ భావాలను జోడించి.. అనేక రూపాల్లో గ్రంథాలకు జీవం పోశారు.

ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వ సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి బుర్రా వెంకటేశం ఓ కొత్త కోణంలో రామాయణాన్ని ఆవిష్కరింప యత్నించడం అభినందనీయం. రామాయణం కథా వెలుగులో.. కథలోని వివిధ పాత్రలను.. దృష్టిలో పెట్టుకుని 'రామాయణ పరివారము' అనే ఓ విలక్షణ గ్రంథాన్ని మనకు అందిస్తున్నారు. లోగడ వెంకటేశం 'గెలుపు పిలుపు' గ్రంథంతో సాహితీ లోకంలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్నారు. 'జీవన ధన్య శతకం' పేరుతో ఓ శతకాన్ని సరళమైన శైలిలో వెలువరించి పద్యరచనలో ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. 'బుద్ధం శరణం గచ్ఛామి'తో ఓ రచయితగా స్థిరపడినారు...

వెంకటేశం వృత్తిరీత్యా రాష్ట్రప్రభుత్వ ఐ.ఏ.ఎస్. ఉన్నతాధికారిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని... సాహిత్య సృజనకారునిగా అందరి దృష్టినాకర్షిస్తున్నారు. తెలుగు భాషపై మక్కువచూపే వెంకటేశం లోగడ వెలువరించిన "గెలుపు పిలుపు" గ్రంథం తెలుగులోనూ... ఆంగ్లంలోనూ బహుళ ప్రాచుర్యాన్ని పొందటం విశేషం!

సామాజిక చైతన్యం కోసం తమ జీవితానుభవాలను రంగరించి... చక్కని పదబంధాలతో ఛందస్సుతో నిమిత్తం లేకుండా సరళమైన రీతిలో 'జీవన ధన్య శతకం' పద్యరచన చేసి అందరి మెప్పు పొందారు. సార్వజనీన అంశాలకు పెద్దపీట వేస్తూ.. ఓ దార్శనికునిగా ఇప్పటి తరానికే కాక.. రాబోయే తరాలకు సైతం మార్గదర్శకంగా ఉండే విధంగా జీవన ధన్య శతకంలోని పద్యాలకు జీవం పోశారు. పద్యంలోని మొదటి రెండు పాదాల్లో కవిగా తాము చెప్పదలుచుకున్న విషయాన్ని చెబుతూ... మూడోపాదంలో నిర్దేశిత లక్ష్యాన్ని సూటిగా ప్రకటించే ప్రయత్నం చేశారు. 'సత్యమిదే తెలుసుకో మిత్రమా!' అన్న మకుటంతో పద్యాలను పూర్తిచేసి అందరి మన్ననలు పొందారు.

ఇలా వెంకటేశం ఏ రచన చేసినా.. సమాజహితమే పరమావధిగా వినూత్నంగా విలక్షణమైన రీతిలో ప్రకటించడం ఆయన ప్రత్యేకత! భారతీయ సంస్కృతి పట్ల.. మన మూల గ్రంథాల పట్ల అమిత శ్రద్ధా భక్తులున్న ఆయన రామాయణ విశేషాలను ఓ కొత్త కోణంలో ఆవిష్కరించారు.

రామాయణాన్ని ఎంతమంది... ఎన్ని భాషల్లో గ్రంథాల రూపాల్లో వెలువరించి నప్పటికీ... ఎప్పటికీ ఇంకా మిగిలే వుంటుందన్నది వాస్తవం.. 'రామాయణ పరివారము' పేరుతో వెంకటేశం వెలువరించిన ఈ గ్రంథంలో రామాయణంలోని వివిధ పాత్రలను తమదైన శైలిలో వైవిధ్యాన్ని విలక్షణతను పాటిస్తూ పరిచయం చేయ సంకల్పించడం వెంకటేశం చేసుకున్న పూర్వజన్మ సుకృతం.. ఎంతో నిష్ఠతో.. నిబద్ధతతో.. విస్తృతమైన ఆలోచనలతో ఇప్పుడే కాదు రాబోయే తరాలకూ ఉపయుక్తంగా ఉండే విధంగా తమ రచనను కొనసాగించి ధన్యులైనారు.

వాల్మీకి మహర్షి మొదలు.. శ్రవణ కుమారుడు వరకు యాభై పాత్రలను అద్భుతంగా పరిచయం చేసిన ఘనత వెంకటేశంకే దక్కుతుంది. రామాయణ పరివారంగా రామాయణంలోని పాత్రలను పరిచయం చేసే క్రమంలో వెంకటేశం అనుసరించిన రచనాశైలి... అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. రామాయణంలో ప్రతీ పాత్రకున్న వైశిష్ట్యాన్ని.. రామాయణంలో ఆయా పాత్రల ప్రయాణాన్ని సులభమైన రీతిలో అందించడానికి యత్నించారు.

**రామాయణంలో సంబంధిత పాత్ర ప్రయాణ వివరాలతో పాటు.. పాత్ర ఇతరత్రా విశేషాలను.. ఆ పాత్ర ద్వారా నేర్చుకోవాల్సిన విషయాలతో పాటు.. పాత్రకు సంబంధించి విస్మరించాల్సిన అంశాలను తమ ప్రతిభా వంతమైన పరిశోధనతో నేటి తరానికి, రాబోయే తరాలకు ఉపయుక్తంగా ఉండేలా ఇందలి ప్రతీ వ్యాసంలో విశ్లేషణా త్మకంగా పొందుపరిచి ఈ గ్రంథానికి మరింత శోభను కూర్చారు. తమ రచనా వైచిత్రిని ప్రదర్శించారు.**


బుర్రా వెంకటేశం

ప్రతీ పాత్రకున్న స్వభావం, వ్యక్తిత్వం, మూర్తిమత్వం, రామాయణగాథతో పెనవేసుకున్న బంధం, అనుబంధం, పాత్ర యొక్క ఆలోచనా సరళి, ప్రవర్తన.. ఇత్యాది విశేషాలను ఆయా పాత్రల పరిచయ వ్యాసాల్లో ఆలోచనాత్మకంగా... ప్రేరణదాయకంగా సందేశాత్మకంగా ఆవిష్కరించారు. రామాయణంలో సంబంధిత పాత్ర ప్రయాణ వివరాలతో పాటు.. పాత్ర ఇతరత్రా విశేషాలను.. ఆ పాత్ర ద్వారా నేర్చుకోవాల్సిన విషయాలతో పాటు.. పాత్రకు సంబంధించి విస్మరించాల్సిన అంశాలను తమ ప్రతిభా వంతమైన పరిశోధనతో నేటి తరానికి, రాబోయే తరాలకు ఉపయుక్తంగా ఉండేలా ఇందలి ప్రతీ వ్యాసంలో విశ్లేషణాత్మకంగా పొందుపరిచి ఈ గ్రంథానికి మరింత శోభను కూర్చారు. తమ రచనా వైచిత్రిని ప్రదర్శించారు.

రచయిత వెంకటేశం రామాయణంలోని వివిధ పాత్రలను పరిచయం చేసే క్రమంలో.. లోగడ వెలువరింపబడిన అనేక రామాయణాలకు సంబంధించిన గ్రంథాల్లోని విశేషాలను ప్రస్తావించారు. ప్రతీ వ్యాసం చివరన ఆయా పాత్రల

**పుస్తక పరిచయం**

ద్వారా పొందవలసిన ప్రేరణను... విస్మరించాల్సిన అంశాలను సందేశాత్మకంగా ప్రస్తావించారు.

త్రేతాయుగంలో రామాయణాన్ని రచించి బ్రహ్మరూపంగా వెలుగొందిన వాల్మీకిని పరిచయం చేస్తూ... మనిషిలో పరివర్తన వస్తే మహర్షిలా మారగలడన్న దానికి నిదర్శనం వాల్మీకి మహర్షి అని వివరించారు. కులం, మతం, నేపథ్యంతో సంబంధం లేకుండా, గతాన్ని విస్మరించి సంకల్ప బలంతో మనిషి మనీషిలా మారవచ్చునని నిరూపించారని చెప్పడం ద్వారా రచయిత వెంకటేశం నేటి తరానికే కాక భావితరానికి ఓ గొప్ప సందేశాన్నిచ్చిన వారైనారు. ఆనందంలో ఉన్నప్పుడు వాగ్దానాలు చేయకూడదన్న విషయాన్ని దశరథుని పాత్ర ద్వారా తెలుసుకోగలమని చెప్పారు. కర్మఫలాన్ని అనుభవించక తప్పదన్న సంగతిని దశరథుని పాత్ర ద్వారా తెలుసుకోగలమని వివరించారు.

విష్ణువు యొక్క దశావతారాల్లో రాముడు ఏడో అవతారం... 'రామో విగ్రవాన్ ధర్మః' అంటే సమస్త సద్గుణాలు రాశిపోసి మానవరూపం ఇస్తే ఎలా ఉంటుందో అతడే శ్రీరామ చంద్రుడన్న విషయాన్ని గుర్తు చేశారు. శ్రీరాముని 16 ఉత్తమ లక్షణాలను వివరంగా ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఏకపత్నీ వ్రతుడిగా... స్థితప్రజ్ఞతకు ప్రతీకగా... పితృవాక్య పరిపాలకుడిగా... తండ్రిమాట జవదాటని ఉత్తముడిగా... పురుషోత్త ముడిగా.. సఖ్యత కలిగిన సోదరునిగా... సౌశీల్యం కలిగిన భర్తగా, ప్రజారంజక పరిపాలకుడిగా... దుష్టశిక్షకుడిగా... శిష్టరక్షకుడిగా.. ఒకటే బాణం.. ఒకటే మాట.. కలిగిన ఆదర్శమూర్తిగా శ్రీరాముల వారిని వెంకటేశం చక్కగా ఆవిష్కరిం చారు. పాత్ర రూపురేఖలతో పాటు రామాయణంలో పాత్రకున్న వైశిష్ట్యాన్ని.. పాత్ర స్వభావాన్ని. ఆలోచనా విధానాన్ని ప్రవర్తనను ఆవిష్కరించిన తీరు బాగుంది.

రాముడు విష్ణుమూర్తి అవతారమైతే.. లక్ష్మణుడు విష్ణువు పవళించే ఆదిశేషుని అవతారమనీ.. ఆయన సౌమిత్ర అనీ..

> **సహనం సత్ఫలితాల నిస్తుందన్న సందేశాన్ని అందిస్తూ రామాయణం లోని శబరి పాత్రను పరిచయం చేశారు. క్షమ, దయ, ధైర్యం, వివేకం... ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీగా రామాయణంలో రాముని భార్యగా సీత భాసిల్లిన విషయాన్ని రచయిత చక్కగా ప్రస్తావించారు.**

లక్ష్మణుడు రామునికి తమ్ముడే కాదు తోడల్లుడని వివరించారు. లక్ష్మణుడు సద్గుణ సంపన్నుడనీ.. ధైర్యశాలిగా, వీరభక్తునిగా.. ఆదర్శ సోదరునిగా పరిచయం చేశారు.

స్వార్థం ముసుగులో అన్నదమ్ముల కుమ్ములాటలు, దాయాదుల పోట్లాటలు... కుటుంబంలోనే కక్షలు- చరిత్ర పుటల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి.. కానీ భరతుని త్యాగం, నిస్వార్థమైన ప్రేమ, నిబద్ధత చిరస్మరణీయమని భరతుని పాత్రను పరిచయం చేశారు.

శత్రుఘ్నుడిని పరిచయం చేస్తూ రచయిత పొందుపరిచిన విషయాలు బాగున్నాయి.. భరతుణ్ణి ఎప్పుడూ నీడలా వెన్నంటే ఉంటూ శత్రువులను ఓడించడమే కాక.. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను జయించిన ఉన్నతుడిగా శత్రఘ్నుని పాత్రను పరిచయం చేయడంలో రచయిత వెంకటేశం పరిశీలనా పటిమను అభినం దిస్తాం. ఇక్ష్వాకు వంశానికి కులగురువుగా మహర్షి వశిష్టుని పరిచయం చేశారు. ఎన్నో విశిష్ట కార్యాలను నిర్వహించడంలో వశిష్టుడు భాగస్వాములైనట్లు వివరించారు.

రామాయణంలో విశ్వామిత్రుడు రామలక్ష్మణుల గురువుగా... మన శాంతమే మనను రక్షిస్తుందన్న వాస్తవాన్ని విశ్వామిత్రుడు పాత్ర ద్వారా తెలుసు కోవచ్చని వివరించిన తీరు సందేశాత్మ కంగా ఉంది.

రామాయణంలో నాల్గవకాండ అయిన కిష్కింధకాండలో హనుమంతుని పాత్ర ప్రవేశిస్తుందనీ.. శ్రీరాముడి అవతార సమాప్తి వరకూ రాముడి సేవకుడిగానే, రామాయణంలో హనుమంతుడి దేహదారుఢ్యమే కాదు.. బుద్ధిబలాన్ని మనం అవగాహన చేసుకుని వ్యవహరించాలని రచయిత వెంకటేశం హితవు పలికారు.

మరుపురాని మైత్రికి, స్నేహధర్మానికి ప్రతీకగా సుగ్రీవుడు పాత్రను చక్కగా ప్రస్తావించారు. జీవితంలో పరిస్థితులు ఒక్కోసారి చిత్ర విచిత్రంగా ఏర్పడు తాయనీ.. ఆత్మీయుల మధ్యనే అపార్థాలు చోటు చేసుకుంటాయనీ... వైరాన్ని పెంచుతాయన్న వాస్తవాన్ని వాలి పాత్ర ద్వారా గ్రహించవచ్చని తెలిపారు. జీవితం వాలిలాగా వాలిపోకుండా.. రంగేళిలా, ప్రకాశవంతంగా మలచుకోవాలంటే విచక్షణతో.. వివేకంతో మసలుకోవాలని రచయిత సూచించారు.

భర్త పట్ల భార్య యొక్క విధులు ఎలా ఉండాలో... పరోక్షంగా సీతకు బోధించిన కౌసల్య పాత్రను ఉన్నతంగా చిత్రించారు. సీతకు కౌసల్య అత్త అయినప్పటికీ... సీతపై ఎంతమాత్రం గడుసుతనం ప్రదర్శించకుండా తన కూతురిలాగా ప్రేమతో చూసుకుందని తెలిపారు. నేటి అత్తలూ, తమ కోడళ్ళను స్వంతబిడ్డల్లా చూసుకుంటే ప్రతి ఇంటిలోనూ ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయని రచయిత గుర్తు చేశారు.

మానవ జీవితంలో చెప్పుడు మాటలు వింటే వచ్చే అనర్థాలను కైకేయి పాత్ర ద్వారా తెలుసుకోవచ్చనే సందేశాన్నిచ్చారు. శ్రీరామ పట్టాభిషేక భంగానికి, రామ వనవాస గమనానికి అనుకోకుండా ఆఖరి క్షణంలో కైక కారణం అని గ్రహించగలం.

రామాయణంలో దశరథుని భార్యగా.. లక్ష్మణుని తల్లిగా గల సుమిత్ర పాత్రను పరిచయం చేస్తూ సుమిత్ర మితభాషి అని.. మహాజ్ఞాన సంపన్నురాలని.. లోక కళ్యాణం కోసమే తమ పిల్లలంతా జన్మించారని సుమిత్ర ముందే గ్రహించగలిగిందన్న సంగతిని ప్రస్తావించారు. ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు తావివ్వని భార్యగా

సుమిత్రను ఆదర్శంగా తీసుకోవచ్చని రచయిత తెలియజెప్పారు.

'ఎరుకతో వ్యవహరిస్తే యవ్వనం వరమనీ.. ఏమరుపాటుతో వ్యవహరిస్తే యవ్వనమే ఒక శాపమని అహల్య పాత్ర నేర్పిన నీతి... అది నేటికీ పాటించాల్సిన చక్కటి రీతి' అంటూ రచయిత వెంకటేశం వ్యాఖ్యానించడం బాగుంది.

సహనం సత్ఫలితాలనిస్తుందన్న సందేశాన్ని అందిస్తూ రామాయణంలోని శబరి పాత్రను పరిచయం చేశారు.

క్షమ, దయ, ధైర్యం, వివేకం... ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీగా రామాయణంలో రాముని భార్యగా సీత భాసిల్లిన విషయాన్ని రచయిత చక్కగా ప్రస్తావించారు. సీత లేకుండా రాముని జీవితాన్ని ఊహించలేమని సీతలోని సుగుణాలు మగువలకు ఎంతో ఆదర్శమని.. మానవ జీవితంలో దాంపత్యం అత్యంత పవిత్రమైన బంధంగా... ఓ సుకుమార బంధంగా... ఒక మనోహర అనుభవంగా సీతారాముల దాంపత్యాన్ని రచయిత చక్కగా ఆవిష్కరించారు. దాంపత్య జీవనంలో హెచ్చుతగ్గులుండవనీ.. ముందు వెనుకలుండవనీ.. ఉన్నవన్నీ ఆత్మీయతలే.. అనురాగాలే అయినప్పటికీ.. అందులో ఎన్నో త్యాగాలు... కష్టసుఖాలు సమభాగాలని తెలియజెప్పారు. భర్త సహచర్యంలోనే భార్యకొక తృప్తి... ఆనందం.. భర్తకు అవసరమైన సహకారం అందించడమే పరమావధిగా భావించిన సీత అందరికీ ఆదర్శంగా నిలిచిందనీ ఆమె స్వభావాన్ని. ఆమె నుండి నేర్చుకోవాల్సిన అంశాలను రచయిత వెంకటేశం చక్కగా విశ్లేషించారు.

ఓర్మికి ఊర్మిళ మారుపేరని.. జనక మహారాజు ప్రకటించిన స్వయంవరంలో సీతను రాముడు వివాహం చేసుకున్నప్పుడే ఊర్మిలను లక్ష్మణుడు పెళ్ళి చేసుకున్న వృత్తాంతాన్ని రచయిత పొందుపరిచారు. సీతక్క పట్ల ప్రేమ, తల్లిదండ్రుల పట్ల గౌరవం.. భర్త మనసెరిగి మసలుకోవడం లాంటి పలు ఉత్తమ గుణాలను ఊర్మిల పాత్ర ద్వారా నేటితరం అలవర్చుకోవచ్చన్న గొప్ప సందేశాన్ని అందించడంలో రచయిత సఫలీకృతులైనారు.

రామాయణంలో మంథర మరపురాని పాత్ర. కైకేయి దాసిగా కనిపిస్తుంది. కైకేయికి దుర్బోధ చేసిన మహిళగా వాసికెక్కింది. రామాయణ మహాకావ్యమే ఒక పెద్ద మలుపు తిరిగేందుకు మంథర కారకురాలైంది. దుష్ట ఆలోచనల పుట్టగా పేరు తెచ్చుకున్న 'మంథర' లాగా నేడూ లోకంలో ఎంతోమంది మనచుట్టూ ఉంటారు. వారితో అప్రమత్తంగా దూరంగా ఉండాలన్న సందేశాన్ని మంథర పాత్ర ద్వారా తెలియజెప్పారు.

ఇంకా ఈ గ్రంథంలో అడుగడుగునా ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే అగస్త్యమహర్షి, సామాన్యుడైనప్పటికీ ఆతిథ్యం-ఉపకారం అనే రెండు లక్షణాలను అలవర్చుకుంటే మాన్యుడు కావొచ్చు అనడానికి రామాయణంలోని గుహుని పాత్రను పరిచయం చేశారు. రామాయణంలో కిష్కింధకాండలో కనిపించే 'తార', ఇంద్రియాలను, బుద్ధిని అదుపులో ఉంచుకోకపోతే వచ్చే అనర్థాలను శూర్పణఖ పాత్రను మరియు మండోధరి రావణాసురుని భార్య అయినప్పటికీ మహా పతివ్రతగా పేరొందిన మహిళగా.. బాహ్య సౌందర్యంతో పాటు.. అంతఃసౌందర్యాన్ని సొంతం చేసుకున్న మండోదరి నీతిని, ధర్మాన్ని, కర్తవ్యాన్ని ప్రబోధించే మనస్తత్వం, మానవత్వం గల ఓ గొప్ప మహిళగా మనం ఈ గ్రంథం ద్వారా గుర్తుకు తెచ్చుకోగలం.

రామాయణంలోని జటాయువు, మారీచుడు, కుంభకర్ణుడు, విభీషణుడు వంటి పాత్రలను చక్కగా పరిచయం చేయడంలో రచయిత వెంకటేశం ప్రతిభను ప్రశంసించి తీరుతాం.

వేద వేదాంగాలనూ అవపోసన పట్టిన మహాపండితుడిగా, నిత్య శివపూజా ధురంధరుడిగా, మహాతపస్విగా, గొప్ప రాజనీతిజ్ఞుడిగా సంగీత, సాహిత్యాలలో ప్రతిభావంతుడిగా రావణాసురుణ్ణి పరిచయం చేస్తూ... ఇలా ఎన్నో రకాల సుగుణాలున్నప్పటికీ రావణాసురుడు పరస్త్రీ వ్యామోహంతో.. తన సుగుణాలను తానే కప్పేసుకున్నది వివరించిన తీరు బాగుంది. పరస్త్రీని తల్లిలా భావించాలనీ.. సోదరిలా పూజించాలనీ లేదంటే రావణునికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

ఇంకా రామాయణంలోని ఇంద్రజిత్తు / మేఘనాథుడు, జాంబవంతుడు, అంగదుడు, లవుడు, కుశుడు, కైకసి, జనకుడు, త్రిజట, కుబేరుడు, మైరావణుడు, పరశురాముడు, మయుడు, దుర్వాస మహర్షి ఇల్వలుడు, వాతాపి, అక్షకుమారుడు, భూదేవి, కబంధుడు, ప్రహస్తుడు, అంజనాదేవి, మాండవి-శ్రుతకీర్తి నలుడు-నీలుడు, శ్రవణకుమారుడు వంటి పాత్రలను సందేశాత్మకంగా రచయిత విశ్లేషించారు.

ఆయా పాత్రల స్వభావాలు... ఆలోచనా విధానాలను- వ్యక్తిత్వాలను - ప్రవర్తనలను పరిచయం చేస్తూ.. ఆయా పాత్రల నుండి ప్రేరణ పొందాల్సిన అంశాలను సందేశాత్మకంగా వివరించారు. విస్మరించాల్సిన అంశాలను గుర్తు చేస్తూ పాఠకులను అప్రమత్తము చేసిన రచయిత వెంకటేశం రామాయణ పరివారము పేరుతో - రామాయణాన్ని వినూత్న కోణంలో ఆవిష్కరించారు. రామాయణంలోని ఆయా పాత్రల ద్వారా మనం అనుసరించాల్సిన... విస్మరించాల్సిన విషయాలను విడమరిచి చెప్పారు. ఈ గ్రంథాన్ని ఓ సందేశాత్మక గ్రంథంగా రూపుదిద్దిన రచయిత వెంకటేశం జీవితం ధన్యమైంది.

దీన్ని పఠించే పాఠకులుగా మన జీవితంలో అనుసరించాల్సిన అనేక మంచి విషయాలను గ్రహిస్తాం.. రామాయణం లోని సారాన్ని. సందేశాన్ని వినూత్నంగా... విలక్షణంగా ఆవిష్కరించిన రచయిత వెంకటేశం గారిని అభినందించి తీరుతాం. ముఖచిత్రం మరియు ఆయా పాత్రలకు వేసిన చిత్రాలు గ్రంథానికి మరింత శోభను కూర్చాయి.

# గాయాల పాట

సామాజిక గాయాల విషాదాన్ని చెప్పిన వ్యాసం...



సీహెచ్. ఉషారాణి
94412 28142

జీవితం అనేకం ఇస్తుంది. కొన్ని జ్ఞాపకాలను, అనేక పోరాటలను, కొత్త ఆవిష్కరణలను, తరిగిపోని కవిత్వాన్ని ఇచ్చింది....

బతుకు పోరాటంలో మిగిలిపోయేవి ఈ కవితాక్షరాలే...

కొన్ని పదాలను, మరికొన్ని అక్షరాలను భుజాన వేసుకొని పయనిస్తున్నాడు బిల్ల మహేందర్.

ఈ కవి వెలువరించిన "ఇప్పుడొక పాట కావాలి" కవితాసంపుటి.

తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రముఖ కవి 'చెమన్' రాసిన 'ఇప్పుడొక చెరువు కావాలి' కవిత గుర్తుకు వస్తుంది ఈ పుస్తకం టైటిల్ చూసినప్పుడు. చెరువు చుట్టూ పెనవేసుకొని ఉన్న జీవితాన్ని చాలా అందంగాను, బరువైన హృదయం తోనూ చెపుతారు చెమన్ తన కవితలో. బిల్ల మహేందర్ కవిత్వంలోనూ అందమైన పదాలతో పాటుగా గుండె బరువెక్కించే సన్నివేశాలు మనకు కనిపిస్తాయి.

ఈ కవి చుట్టూ కవిత్వపు అక్షరాల జలతారు ఎగురుతూనే వుంటుంది.

సందర్భాన్ని బట్టి ఎరుపు రంగును,
అనుభూతిని బట్టి అది నీలిపరదాను,
రంగు అద్దుకొన్న సీతాకోకలుగాను,
పదాలను అల్లి పాటలుగా
చల్లుకుంటూ పయనిస్తున్నాడు కవి.



కాలాన్ని, జీవితాన్ని, కష్టాలను, కన్నీటిని, గాయాలను, ఉద్యమాలు పంచిన జీవితాన్ని, గుండెల్లో దాచుకొన్నాడు. అన్నీ అతని కవిత్వంలో వస్తువులు అయ్యాయి...

మనసు పొరలలో దాగివున్న సందిగ్ధతను, విషాద బిందువులను రెక్కలు రెక్కలుగా ఆశావాహ భరితమైన కవితలోకి ఒలికించాడు...

"ఎక్కడి నుంచో తెగిపడ్డ కొన్ని పూల రెక్కలు
సూర్యుడితో పాటుగా పడమటి దిక్కులో మాయమైపోతాయి"...
"నాకు తెలియకుండానే
వాటిని చేతుల్లోకి తీసుకొని
ఒక ఉదయం వైపుకు అడుగులే
స్తాను"... ఇప్పుడొక పాట కావాలిలో

"పొలం దున్ని విత్తు జల్లి
పంట పండించిన నోటిలో
నాలుగు మెతుకులు కూడా
కరువైనప్పుడు వాడ్ని
ఏ గీతం పాడమంటావు...?"
పోగుల్ని సరి చేసి కండెల్ని బిగించి
రెక్కల్ని ఆడించి
అందమైన పట్టు పీతాంబురాలను
నేసిన దేహమ్మీద
ఓ నూలుపోగైనా లేని వాడ్ని
ఏ గీతం పాడమంటావు?"..

అంటూ రైతన్నల, నేతన్నల జీవన పోరాటాన్ని నాలుగే మాటలతో చెబుతాడు. కన్నీటిని తుడిచే, గాయాలను చెరిపే ఒక కొత్త సమాజాన్ని కలగంటాడు, దానికి ఒక కొత్త పాట కావాలంటాడు.

"కిటికీలోంచి"అనే కవితలో తన స్థితిని, మదనపడే అంతరంగానికి తోడైన కిటికీకి ఆవిష్కరణ ఈ కవిత. అట్లాంటి స్థితిలోనూ సన్నటి వెలుగురేఖ అయ్యింది అమ్మ ప్రేమ.

"ఇప్పుడు కాళ్ళు రెక్కలు తెగి
చక్రాల మీదకు నెట్టివేయబడిన నా జీవితానికి
మిగిలిన ఒకే ఒకతోడు ఈ కిటికీనే"...

రెక్కలు కట్టుకుని ఎగరాలనుకున్న ప్రతిసారీ జాలిపడే ఆప్తమిత్రుడు కిటికీఅంటాడు. జీవితాన్ని నిస్సహాయస్థితిని అమ్మతో ముడి వేసి, ఆ ప్రేమ తపనతో బతికేయ గలనంటాడు.

కవి ఆత్మతో కలసి నిలబడి, కిటికీకి

వ్యాసం

భారమైన మనసును, కళ్ళను అతికించి
మనమూ నిలబడతాము...

"అతను", "ఏ బ్యూటిఫుల్ మ్యాన్" వంటి కవితలలో వైకల్యం శరీరానికే గానీ మనసుకు కాదు. మనసు నిండా కుతంత్రపు వైకల్యం నింపుకున్న శరీరంతో మనిషి ఎలా జీవించగలడు అంటాడు.

"తనలాగే అవిటిదైపోతున్న ఈ దేశాన్ని
రెండు కాళ్ళ మీద సరిగ్గా
నిలబెట్టేందుకు
కొన్ని ప్రశ్నల్ని ఎముకలుగా నిలబెట్టి
ధిక్కారాన్ని నేర్పించడం
కొన్ని గాయాలకు పూత పూయడం."

అంతే తన కోసం ఏమీ చేసుకోలేదు.

"నాలుగు అక్షరాల్ని విత్తులుగా చేసి
గదిలో చల్లడం"....

ప్రొఫెసర్ సాయిబాబా గురించి రాసినా ఎంతో మందికి ఎన్నో కోణాల్లో బాణాల్లా తాకే కవితలు... ఇవి.

మట్టి విలువ తెలిసిన వాడు, మట్టితో బతికినవాడు. మట్టి పరిమళాన్ని శ్వాసలో నింపుకున్న మనిషి మాత్రమే ఇట్ల చెప్పగలడు. నల్లమల్ల అడవులను గురించి పడిన "పచ్చపువ్వు" ఆవేదన ఇది.

"మట్టి చుట్టూతనే మాగూడును
అల్లుకున్నోళ్ళం
మట్టితోనే మా పాణాల్ని పదిలంగా
పరుచుకున్నోళ్ళం"...

మనిషి తన అభివృద్ధి కోసం అడ్డంగా నడకను కొనసాగించాడు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని కుచించుకుపోయేలా నాశనం చేస్తున్నాడు. ప్రతి అడుగులో ప్రకృతితో సహజీవనం చేస్తూనే తాను ఎక్కిన కొమ్మను నరుకుతూనే వున్నాడు.

"బాల్యం //కొమ్మ కొమ్మకు
ఊగులాడుతుంటది//బంధాలు //
ఆకాశమంతా పరుచుకొని ఉంటయి//
జ్ఞాపకాలు//కుప్పలు కుప్పలుగ చెక్కబడి
ఉంటాయి...

"చెట్టు పాఠం" కవితలో

"ప్రతి రాత్రి ఎన్నో గాయాల్ని
వెతల్ని దిండునిండా మూటగట్టుకొని
కళ్ళు మూసుకుని కలవరపడుతూ
చీకటిని సాగనంపే నేను
ఉదయాన్నే పూల మొక్కలతో
గుసగుసలాడుతూ
నా మనసు తేలిక పరుచుకుం
టాను"...

ఎన్నో వెతలు, మరెన్నో కథలు మనిషిని అంటిపెట్టుకుని వుంటాయి. రాత్రంతా అన్ని వేదనలతో పోరాటం చేసి చివరకు ఉదయం ప్రకృతిలో పూలతోనో, తావితోనో ఊసులు ఆడి తనను తాను సేదదీర్చుకుంటాడు. చివరకు మనిషి ప్రకృతితోనే సేదదీరతాడు అంటాడు. మనమందరం ఒక అంధకారంలో కూరుకుపోయిన సమాజంలో గుడ్డిగా బతుకును వెళ్ళదీస్తున్నాం. తల ఎత్తుకొని అన్యాయాన్ని ప్రశ్నించలేని ఒక అగమ్యమైన పరిస్థితులలో జీవితాన్ని నడిపిస్తున్నాం. అవును ప్రస్తుత సమాజంలో ప్రశ్నించడం మహానేరం. అనేక నిజాలను బయటపెట్టే ఆయుధం కలం. ఇప్పుడు ఆ ఆయుధానికి సంకెలలు తగిలించబడ్డాయి. కుల మతాలు లేని సమాజం కేవలం కథలకు మాత్రమే పరిమితం.

ప్రశ్నించడం నేరమైనచోట యుద్ధం అనివార్యం అంటాడు. పోరాట కవితను పదునైన శిల్పంలా చెక్కి ఒదులుతాడు...

"వెళ్తున్నా...
ఎవరైనా వస్తారా మీరు?
అడుగులేస్తారా నాతో??"

అంటూ మొదటి అడుగు వేస్తాడు.

కవిత్వపు శైలి మనకు కవి యొక్క మనసును పట్టిస్తుంది. బిల్ల మహేందర్ కు పట్టుబడిన ఈ శైలితోనే ముందుకు సాగుతూ మరిన్ని సంకలనాలతో సాహిత్యంలో సాగిపోవాలి అని ఆకాంక్షిద్దాం.

కవిత

# నా ప్రపంచంలోకి ఘన స్వాగతం బిడ్డా....??

**మధు సార్వభౌమ**

"అజ్ఞాతం"లో నిన్ను తాకిన ప్రతీసారి
నీ రూపాన్ని,నీ పాద కోమలత్వాన్ని
నీ పెదాల కాంతిని,నీ వేళ్ళ ఎరుపు దనాన్ని
నేను కలగా ఎగరేసుకున్నా గుండె
మైదానంలో.....

మా ఇద్దరి ఏకాంత శిఖరాలను
నీ పాదాలతో
కూలుస్తున్నప్పుడూ
మా ఇద్దరి మౌన యుద్ధాల్ని
నీ ఉలికిపాటుతో బేధించినప్పుడూ..
మా ఇద్దరి కలల చిత్రాల్ని
నీ రాకతోనే రాగరంజితం చేసినప్పుడూ...
ఊపిరి తెరలెందుకో
దుఃఖపు రంగును పులుముకున్నాయి...

నా బిడ్డా......
నీవొచ్చే నాటికే ఇక్కడ మనుషుల మీద
విషం ధారగా కురుస్తోంది
నిఘా వెయ్యికండ్లు విప్పి సంచరిస్తోంది
తల్లి నుంచి బిడ్డలు
భార్యల నుంచి భర్తలు
విద్యార్థులనుంచి వాళ్ళ గురువులు
జనం నుంచి జన ప్రేమికులు
వేరు చేయబడుతున్నారు
జైళ్ల నోళ్ల తెరిచి స్మశాన నిశ్శబ్దాన్ని
విసురుతున్నాయి

అందరిలాగే మన బతుకులూ పూల
పాన్పులు కావు
బోలెడంత యుద్ధాన్ని తలమీద మోస్తూనే
ఈ లోకంలోకి వచ్చావని ప్రత్యేకంగా
చెప్పను
ఒక్క నా ఆరాట పోరాటల్ని తప్ప
మరేదీ నీకు పంచి ఇవ్వను...

నేననుభవించిన దరిద్రాతి దరిద్ర జీవనం
నేనెదుర్కొన్న ఆకలి పీడిత రాత్రులు
నే గావించిన ఒంటరి ఎడారి యాత్రలు
నే మోస్తూ తిరిగిన ప్రేమ రాహిత్యపు
సంక్షోభాలు
ఇవేవీ నీకు పంచను.......

ఒక్క నా కొత్త ప్రపంచపు కలను తప్ప......

వ్యాసం

# పాటలపుట్ట డా॥ కందికొండ

**గుండెల్లో నిలిచిపోయిన కందికొండ సినీ గీతాలను విశ్లేషించిన వ్యాసం...**



డా.వాసరవేణి పర్శరాములు
94921 93437

కందికొండ యాదగిరి సామాన్య కుమ్మర కుటుంబంలో సాంబయ్య-కొమురమ్మలకు మహబూబాబాద్ నర్సంపేట్ మండలం నాగుర్లపల్లిలో జన్మించారు. పి.జి పొలిటికల్ సైన్సుతో పాటు తెలుగు చదివారు. సినిమా పాటలపై పిహెచ్.డి చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రొఫెసర్ కిషన్ రావు కందికొండ గురించి గొప్పగా చెప్పేవారు. మీరిద్దరూ మట్టి బిడ్డలు (కుమ్మరులు) అంటూ అభినందించేవారు. కందికొండ సినిమా సాహిత్యంపై పరిశోధన చేశారు. కందికొండ "మట్టి వాసన" తెలంగాణ సినీ వైభవం"పుస్తకాలు, అనేక "ఓ లచ్చుమమ్మ", పిసుక బొమ్మయ్య లాంటి అనేక కథలు రాశారు. కందికొండ అన్నను ఎప్పుడు అన్నా అని పలుకరించినా ఫోన్లో మాట్లాడినా ఆప్యాయంగా మాట్లాడే వారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలలోగానీ, తెలుగు డిపార్ట్మెంట్ వద్ద గాని ఎదురు పడగానే బాల సాహిత్యంపై మాట్లాడేవాళ్లం. వారు బాల్యం నుంచి కష్టపడి పైకి వచ్చారు. పాటల్లోనే కాకుండా ఆటల్లో కూడా రాణించారు. అథ్లెటిక్. 42 కి.మీ రన్నింగ్ చేసి రికార్డ్ సొంతం చేసుకున్నారు. పలువురి ప్రశంసలు పొందారు. సాహిత్యంలో పరుగులు తీసారు. జానపద పాటలన్నో రాశారు.



పాటలతోట అయ్యారు. సినిమా రంగంలో దర్శకుడు పూరీజగన్నాథ్ "ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం"లో మల్లీ కూయవే గువ్వ మోగిన అందెల మువ్వ పాట రాసే అవకాశం ఇవ్వడంతో తర్వాత 1300లకు పైగా పాటలు రాశారు. చక్రి కూడా పాటలు రాయించారు. రజినీకాంత్, బాలకృష్ణ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు, రవితేజ లాంటి పెద్ద హీరోలకు పాటలు రాశారు. అల్లరి పిడుగు, ఆంధ్రవాలా, లింగ, దేశముదురు, ఆప్తుడు, ఒకరాదా ఇద్దరి కృష్ణులపెళ్లి, చక్రం పోకిరి, దొంగ దొంగది, రణం, పొగరు, చిన్నోడు, స్టాలిన్, ఆదిలక్ష్మి మొదలగు ఎన్నో సినిమాల్లో రాశారు." "మనసమ్మా నువుండే చోటు చెప్పమ్మా, చూపులతో గుచ్చి గుచ్చి చంపకే", "గలగలపారుతున్న గోదారిలా.." రామా రామా, మొదలగునవి ఎన్నో పాటలు మారుమోగాయి. తెలంగాణ పాటలు

చాలా రాశారు. "చిన్ని మా బతుకమ్మ చిన్నారెక్కల బతుకమ్మ", "రేలారే రేలారే నీళ్లల్ల నిప్పుల్లే", "కన్నేపల్లి జంగలిలో", "పచ్చ పచ్చని పల్లె పచ్చాని పల్లె", "మేమ్ కుమ్మరోళ్లమ్ కుమ్మరోళ్లమ్ మన్నుకు ప్రాణం పోసెటోళ్లమ్", "భోగిమంటలు", "ఏ చలో చలో చలో చలో బిసి - నువ్వే నీ తలరాతను రాసుకో లేసి", గోవుపై మొదలగునవెన్నో బతుకమ్మ, ఉగాది, సంక్రాంతి, బోనాల సంస్కృతి పాటలు రాశారు. తెలంగాణ ఉద్యమంలో పండుగల సమయంలో ఎక్కడ చూసినా, విన్నా కందికొండ పాటలే వినబడేవి.

తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారు. తెలంగాణ భాషా పదాలు ఉపయోగించి భాషకు సౌందర్యం తెచ్చారు. తెలంగాణ బతుకులను పాటల్లో సహజంగా చిత్రించారు. సమాజంలో దాదాపుగా అన్ని కోణాల్లో పాటలు రాశారు. ప్రతి తెలంగాణ పౌరున్ని పాటలు కదిలించాయి. అలాగే మట్టి మనిషి, మంచితనానికి మారుపేరు. చిరునవ్వుతో పలుకరించే మృదుస్వభావాన్ని కలిగి ఉండి సామాన్యంగా, నిరాడంబరంగా జీవించిన మహోన్నతులు కందికొండ. జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొన్నారు.

సమావేశాల్లో వివక్షకు గురయ్యారు. నేడు గొప్ప రచయితను కోల్పోయాము. క్యాన్సర్‌తో చాలా పోరాటం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, మంత్రి కేటీఆర్ స్పందించి ఆర్థికసహాయం అందించారు. విధి వెంటపడి తనను తొందరగా తీసుకెళ్లడం బాధాకరం. కందికొండ సాహిత్యంపై సమగ్ర పుస్తకం ప్రచురించాలి. వారి సాహిత్యంపై పరిశోధనలు జరిపించాలి. కందికొండ రాసిన పాటలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. వారు రాసిన పాటల్లోనే కందికొండ జీవించి ఉంటారు.



# పచ్చని సంతకం!



కళారత్న బిక్కికృష్ణ, 83744 39053

నదికి అడ్డుకట్ట వేయడం వ్యర్థం
ఆనకట్ట కట్టుకొని ఆనందించండి!
నాకు అడ్డుపడి ఏం సాధిస్తారు?
నేనో జీవనదిని!
నిరంతరం ప్రజాసమూహాలపై
నిబ్బరంగా ప్రవహిస్తూనే ఉంటాను!
రైతుగా శ్రమిస్తున్న మానాన్న
నా కవితగా మారిపోయాడేమో!

మా నాన్న హృది ఓ ప్రేమనది
నేనో మానవత్వపు కవితలగది!

నది వల్లనే కదా గట్టమ్మ
పూలచీర కట్టుకుంది!
నది వల్లనే కదా చెట్టమ్మ
పక్షులపూలకాగితప్పడవలు నెత్తిపై పెట్టుకుంది!
నది విసిరిన నీరెండ చీరే కదా
ఆ నీలాకాశం!

కవుల చేతి రాతలు, గుండెకోతలే
మహాకావ్యాలవుతాయనుకోకండి!
నదుల నీటిరాతలు, కొండకోనలే
ఎన్నో ప్రకృతికావ్యాలు రాసాయి!

చేపలు పట్టే వేటగాళ్ళున్న ఈ స్వార్థపు లోకంలో...
ప్రేమతో త్యాగపునదులై ప్రవహించే
శ్రమజీవులుంటారులే!
నాయకులు వేటగాళ్ళవారసులు
కవులు...శ్రమజీవుల ప్రతీకలు!

అదిగో పొలం వైపు వెళుతున్న
ఆ రైతును చూడండి!
సూర్యుణ్ణి సద్దిమూటగా తువ్వాల్లో కట్టుకుని
ఆకాశాన్ని తలపై గంపగా పెట్టుకుని..
రాత్రి దాచిపెట్టుకున్న విత్తనాల చుక్కల్ని..చేలల్లో చల్లాలని
ఆశతో వడివడిగా వెళుతున్నాడు!

ప్రేమ శ్రమను మరిపించే
దివ్యమైన ఔషధం కదా!
ప్రేమ వున్న రైతు హృదయమే ఓ జీవనది!
పరులకోసం నిరంతరం ప్రవహిస్తుంది!
ప్రజలకోసం రైతు శ్రమిస్తూనే ఉంటాడు!

అరే !జహాపనా!
నువ్వు రాజువైతేనేం...మంత్రివైతేనేం!
మేధావివైతేనేం అధికారి వైతేనేం
మానవత్వంలేని నీ సంపదంతా
కాలం ఏనుగు గర్భంలో చివరకు
కరిమింగినవెలగపండే అవుతుంది!

అందుకే చెబుతున్నా!
ప్రేమించే రైతు...సమస్తజీవులకోసం పంటపొలమైపోయినట్టు...
నిన్ను ప్రేమించి ఓటేసిన ప్రజలకోసం...అభివృద్ధిపైళ్ళపై
పచ్చని సంతకమైపో!

కథ

# సహచరులు

**అద్భుతమైన మలుపులతో దాగిన తాత్త్వికత చిత్రించిన రాజారావు ఆంగ్ల కథ...**



తెలుగు సేత: ఎలనాగ
98669 45424

**అయ్యో, నా మార్గనిర్దేశకుడు, విధి మార్గనిర్దేశకుడు ఒకడేనని ఇప్పటిదాకా నాకు తెలియలేదు. -హాఫిజ్**

అది మనం సాధారణంగా సంతల్లో చూసే సర్పంలాంటి పాము. పొడవుగా, ఒకటికన్న ఎక్కువ రంగులలో ఉండి పాములవాడు తను ఊదుతున్న పుంగీని ఆపినప్పుడు పడగను వేగంగా ముందుకు విసురుతుంది చూడండి, అట్లాంటిది. అయితే, దానికి సంబంధించిన ఒక రహస్యం ఉంది. ఆ రహస్యం మోతీ ఖాన్‌కు తప్ప వేరెవరికీ తెలియదు. అతడు ఆ పామును ఫతేపూర్ సిక్రీలోని ఆదివారపు సంతకు తీసుకొచ్చాడు. ఆ రహస్యమేమిటంటే, ఒక వైపు కుతుబ్ మినార్ బొమ్మ మరొక వైపు చక్రవర్తి బొమ్మ ఉన్న తెల్లని రూపాయి నాణేన్ని మోతీ ఖాన్ చూసేంత వరకు ఆ పాముకోరల్లో విషం ఉండదు. చూసిననాడు మాత్రం పాము అతణ్ని కాటేస్తుంది. దేవుడు కనపడితే తప్ప మోతీ ఖాన్ శవంగా మారిపోతాడు.

వాస్తవం ఏమిటంటే, మోతీ ఖాన్ ఆ పామును చాలా విచిత్రమైన పరిస్థితిలో పట్టుకున్నాడు. ఒకనాడు అతడు తన సోదరి ఊరికి పోతూ మధ్యలో ఉన్న రాంపూర్ గ్రామంలోని సీతాఫల్ చెట్ల వనంలో ఆగాడు. అక్కడ వాతావరణం చాలా వేడిగా ఉంది. చుట్టూ వున్న ఇసుకనేల ఎండకు మెరుస్తూ, కాలు తగిలితే చురుక్కుమంటోంది. మోతీ ఖాన్ ఒక మేడిచెట్టు కింద పడుకుని, తలపాగాను ముఖం మీద పెట్టుకున్నాడు. కాళ్లను బార్లా చాపి, ఎదురుగా వున్న బండకు ఆనించాడు. వేగంగా కిందికి దిగే సాయంత్రపు సూర్యునిలా నిద్ర అతణ్ని తక్షణం ఆవహించింది. తాటిచెట్లూ, గుట్టలూ, మిరుమిట్లు గొలిపే ఎండా... ఇవన్నీ ఒకదాని తర్వాత మరొకటి కనిపించాయి. అప్పుడొక వింత సంఘటన జరిగింది. ఒక పాము మనిషి రూపంలో వచ్చి నోరు తెరిచి, ముఖాన్ని చాలా గమ్మత్తుగా మెలితిప్పి, తాను తోతే పూర్ గ్రామానికి చెందిన శ్రీనాథ శాస్త్రి అనే పండితుడిననీ, గతజన్మలో లక్ష్మీదేవి పాదాల దగ్గర ఒక తరం పాటు జీవించాననీ, ఒకనాడు తను పారవశ్యంలో ఉండగా కరుణామయి లక్ష్మీదేవి దర్శనమిచ్చి రెండు వరాలను అనుగ్రహించిందనీ చెప్పింది. కూలిపోతున్న ఇల్లు, తాకట్టులో ఉన్న పూర్వీకుల భూమి జ్ఞాపకానికి రావడంతో వేరే ఆలోచన లేకుండా, ఒక బస్తా నిండా బంగారం, పునర్జన్మ నుండి విముక్తి అడిగాడతడు. "బంగారం నీకు లభిస్తుంది. కానీ నీది

## మూల రచయిత రాజారావు పరిచయం..

భారతదేశ స్వాతంత్ర్యసిద్ధికి ముందరి ముగ్గురు గొప్ప భారతీయ-ఆంగ్లేయ (ఇండో-ఆంగ్లియన్) రచయితలలో రాజారావు ఒకరు. మిగిలిన ఇద్దరు ముల్క్ రాజ్ ఆనంద్, ఆర్. కె. నారాయణ్. రాజారావు (1908 - 2006) ప్రస్తుత కర్ణాటక రాష్ట్రంలోని హసన్ లో జన్మించి, అమెరికాలోని ఆస్టిన్ లో మరణించారు. వీరి తండ్రి ఏచ్. వి. కృష్ణస్వామి హైదరాబాదు లోని నిజాం కళాశాలలో కన్నడ భాషను బోధించేవారు. రాజారావు అదే కళాశాలలో డిగ్రీ చదివారు. కాంతాపుర (1938), ద సర్పెంట్ అండ్ ద రోప్ (1960,) కామ్రేడ్ కిరిలోవ్ (1976) వీరి ప్రసిద్ధ నవలలు. కొన్ని కథలను కూడా రాసిన వీరు తాత్త్వికత (philosophy) తో కూడుకున్న రచనలకు ప్రసిద్ధులు.

ద సర్పెంట్ అండ్ ద రోప్ నవల 1964లో వీరికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును తెచ్చిపెట్టింది. రాజారావు పద్మభూషణ్, పద్మవిభూషణ్, ఫ్రాన్స్ దేశపు న్యుస్టాడ్ట్ అంతర్జాతీయ పురస్కారాలను కూడా అందుకున్నారు.

దురాశ కనుక, వచ్చే జన్మలో నువ్వు మోక్షాన్ని పొందేముందు పాముపై జన్మిస్తావు. ఎందుకంటే బంగారం, జ్ఞానం అన్నవి సబ్బూ నూనె వంటివి. పో, పోయి పాములవాడి సర్పంగా జన్మించు. నీ శరీరపు వంపులతో, మెరిసే నీ మేని తూగుతో ఎందరో పురుషుల హృదయాలను ఆహ్లాదపరచు. కేరింతలు కొట్టే చిన్నపిల్లల నడుమ పక్షివి అయిపో. వాళ్ల కాళ్ల దగ్గర ఊగాడు. అందరికీ వినోదం కలిగించేలా వృద్ధుల భుజాల మీదికి ఎక్కు. ఉడుత లాగా వాళ్ల బుజాలకు వేలాడుతూ కిచకిచల శబ్దాలు చెయ్. నీ పడగను కన్యల ముందుకు చాపు. పెళ్లి చేసుకోబోయే జంటల చుట్టు తిరుగు. గర్భిణుల స్వప్నాలలో కనిపించు. భక్తులను కొండ మీది దివ్యకాంతుల వైపు నడిపించు. అప్పుడు నీ పాపాలు విసుర్రాయి మధ్య గింజలలా నలిగిపోయి, నీ శరీరాన్ని నీలిమంట చుట్టుకుని, పునర్జన్మ రాహిత్యం కోసం ఎందరో మనుషులు వేచివుండే చీకటిలోకి అదృశ్యమౌతాయి. బుట్టలల్లే ఒకతను పాములవాడిగా పుట్టబోతున్నాడు. మోతీ ఖాన్ అనే పేరు ఉండబోతున్నది అతనికి. గతజన్మలో అతడు దేవుడిని కోరుకు న్నాడు కానీ, ఈసారి ఒక ఉంపుడుగత్తె మోహంలో పడిపోతాడు. అతని సోదరి ప్రసవించబోతున్నది కనుక, ఆమె ఉండే గ్రామానికి పోతుంటాడు. మధ్యలో సీతాఫల్ చెట్ల వనంలో పడుకుంటాడు. అతనితో మాట్లాడు. నీ మోక్షసాధనకు అతడు మార్గమౌతాడు,'' అన్నది లక్ష్మీదేవి.

"దీనికి నీ జవాబేమిటి మోతీ ఖాన్,'' అని అడిగింది పాము.

"అవును నేను పాపినే. కాని నేనూ, దేవుడూ, సాతాను ఒక్కటవుతామని ఎప్పుడూ ఊహించలేదు. నువ్వెవరు?''

"నేనే ఆ పామును.''

"మీ జాతి ఈ ప్రపంచంలోని మొట్టమొదటి పురుషుని పతనానికి నాంది పలికింది.''

"నేను లక్ష్మీదేవి పాదాల వద్ద కూర్చుని, పారవశ్యంలోకి పోయాను. నేనొక బ్రాహ్మణుణ్ణి.''

"వింతగా ఉన్నావు నువ్వు.''

"నన్ను నీతో తీసుకుపో. లేకపోతే జన్మజన్మల పాటు నిన్ను వెంటాడుతాను.''

"పో సైతాన్'' అని అరిచి, తన సోదరి ఇంటివైపు వడిగా అడుగులు వేశాడు మోతీ ఖాన్. నా సోదరిని, ఆమెకు పుట్టబోయే పిల్లవాడిని గురించే ఆలోచిస్తాను నేను, అనుకున్నాడు తనలో తానే. కానీ ఆకులు గలగలమన్నాయి. అన్ని దిక్కుల నుండి పాములు వచ్చాయి. అవి తెలుపు, నీలం, ఎరుపు, రాగి రంగు మొదలైన వివిధ వర్ణాలలో ఉన్నాయి. పొట్టి తోకలున్న పొడవైనవి, వంపు తిరిగిన తోకలున్న చిన్నవి... అన్నీ చెట్లపై నుండి, బండలపై నుండి జారిపడి ఆ ఇసుకనేల మీద బుసలు కొట్టాయి. అప్పుడు మోతీ ఖాన్ ఆ వాగు పక్కన ఇసుకలో నిలబడి, "ఆపవే ముదనష్టపు దానా. నిన్ను నాతో తీసుకుపోతాను,'' అన్నాడు. వెంటనే మిగతా పాములూ బుసలూ మాయమయ్యాయి. ఇల్లు చేరుకోగానే దాన్ని ఒక బుట్టలో వేసి ఒక మూలన పెట్టి, నిద్ర పోయాడు. నిద్ర లేచి చూస్తే బుట్టలో ఆ పాము చుట్ట చుట్టుకుని ఉండటం కనిపించింది. మోతీ ఖాన్ ఒక వడ్రంగిని పిలిచి, ఒక పుంగిని తయారు చేయించాడు. దాన్ని ఊదుతూ పామును ఆడించాడు. ఊరు మొత్తమే కాకుండా ఊరిలోని జంతువులన్నీ అతని చుట్టు మూగాయి. ఎందుకంటే, మోతీ ఖాన్ వాయించిన పుంగీ సంగీతం శ్రావ్యంగా ఉంది. పైగా ఆ పాము తన తోకమీద నిలబడి నాట్యం చేస్తోంది.

సోదరి నుండి వీడ్కోలు తీసుకున్న తర్వాత మోతీ ఖాన్ తన ఉంపుడుగత్తె ఊరికి పోకుండా నేరుగా ఉత్తరదిశలో ప్రయాణించాడు. ఎందుకంటే, అల్లా అక్కడి నుండి అతణ్ణి పిలుస్తున్నాడు. తోవలోని ప్రతి గ్రామంలో పురుషులు వచ్చి మోతీ ఖాన్‌కు ఆహారం ఇచ్చారు. స్త్రీలు పాముకు పాలు పోశారు. అది పిల్లల కాళ్ల చుట్టు తిరుగుతూ ఊగుతూ, వాళ్ల శరీరం మీది మచ్చలను మాయం చేసింది. మశూచి మొదలైన వ్యాధులను నయం చేసింది. ఈ కారణం వల్లనే గ్రామాలలోని ప్రజలు ఆహారం, పాలు ఇచ్చారు. ఆ పాము తమను తాకిన తర్వాత ముసలివాళ్లకు నిద్రలేమి మాయమైంది. స్త్రీలేమో పాముకు పాలు పోసిన నాడే గర్భం ధరించారు. ప్లేగు వ్యాధి అదృశ్యమై సమృద్ధి, సుభిక్షం కలిగాయి. కాని, మోతీ ఖాన్ ఒక్క రూపాయి నాణెం వైపు సైతం తన దృష్టిని పోనీయలేదు. పోనిస్తే అతడు చనిపోతాడు మరి!

రాత్రిపూట సత్రాలలో వారిద్దరు ఒకరితో ఒకరు కీచులాడుకునేవారు.

"నిన్ను అందరి ముందు గొప్పగా చూపించుదామనుకుంటే కనీసం ఒక స్త్రీవైనా కావు నువ్వు,'' అనేవాడు మోతీ ఖాన్

"కానీ నిన్ను చూసేందుకు ఎందరో స్త్రీలు, సత్కరించేందుకు ఎందరో పురుషులు వస్తుంటారు. నువ్వు కేవలం బుట్టలల్లేవాడివైనా ఒక రాజుకు ఉన్నంత గౌరవం దొరుకుతుంది నీకు.''

"కేవలం బుట్టలల్లేవాడినా!? కానీ నాకు రాణిలాంటి ఆడది ఉండేది. ఆమె పాట పాడితే గాత్రమంతా శరీరంలా, శరీరమంతా గాత్రంలా ఉండేది. ఆమె తాంబూలం నమిలేది. పెదవులు ఎర్రగా



కథ

ఉండేవి. రాజులు సైతం"

"ఇక ఆపు. ఈ మాటలకూ రూపాయి నాణేనికీ మధ్య సంబంధం"

మోతీ ఖాన్ తన గడ్డాన్ని పీక్కున్నాడు. కళ్లలో నిప్పులు కదలాడుతుండగా వేలికణుపులతో భూమిపైన గట్టిగా దెబ్బ వేశాడు.

"నాకు ఒక ఆడది ఉంటే బాగుండేది."

"మోతీ ఖాన్, నీకు దేవుడు కావాలంటే ఆడవాళ్లను మరచిపో."

"కాని నేను ఎప్పుడూ దేవుని కోసం అడగలేదు. నువ్వే అస్తమానం దేవుని ప్రసక్తి తీసుకొచ్చి నాకు విసుగు తెప్పిస్తుంటావు. నేనొక స్త్రీని ప్రేమించానని చెప్పాను కదా. నువ్వు కేవలం కోరలున్న ఒక జంతువు. యవ్వనప్రాయంలో ఒక సరీసృపంతో బతుకుతున్నాను నేను."

అకస్మాత్తుగా గుడిగంటలు, అల్లాహు అక్బర్ అనే నమాజు వినపడ్డాయి. అది పాము పనే అనేదాంట్లో అనుమానం లేదు. మోతీ ఖాన్ భయంతో వణుకుతూ ప్రార్థన చేయడం కోసం మోకాళ్ల మీద వంగాడు.

ఆ రోజు నుండి ఆ పాము ఒక కన్నును కుడివైపు, మరొకదాన్ని ఎడమవైపు ఉంచి నాట్యం చేయసాగింది. అది ఒకసారి పురుషుల పైన మరొకసారి స్త్రీల పైన దృష్టిని సారిస్తూ, మోతీఖాన్ ఆడవాళ్లను చూసి పుంగిని సరిగ్గా వాయించకుంటే బుసకొట్టి, తన పడగ వెనుకభాగంతో అతని చెంప మీద దెబ్బ వేసేది. ఆ ఆడవాళ్ల పిరుదులు గుండ్రంగా ఉన్నాయని, కనురెప్పల వెంట్రుకలు నలుపు నీలం రంగులలో ఉన్నాయని, రొమ్ములు పచ్చి మామిడి కాయల చివరలలాగా మొనదేలి ఉన్నాయని, కాళ్లుచేతులు వాటిలో ఐక్యం కావాలనిపించేటంత మనోహరంగా ఉన్నాయని అనుకునేవాడు మోతీ ఖాన్.

ఒకరోజు ముదురు నీలం రంగులో ఉన్న ఒక స్త్రీ సంత దగ్గరికి వచ్చింది. ఆమెలో యవ్వనం, చురుకుదనం ఉన్నాయి. పెదవులు ఎర్రగా ఉన్నాయి. ఆమె మజ్జిగ అమ్ముకునే స్త్రీ. మోతీ ఖాన్ పామును ఆడిస్తుంటే ఆమె వచ్చి అతని పక్కన నిల్చుంది. అతడు పుంగిని వాయిస్తూ పోయాడు. పుంగిలోంచి వస్తున్న నాదం ఊగి, చెదరిపోయింది. అతడు అకస్మాత్తుగా ఆమె వైపు, ఆమె కళ్లవైపు, రొమ్ముల వైపు చూశాడు. వెంటనే నాగస్వరం మోహస్వరంగా మారింది. అది ఆమెకు తెలిసిపోయింది. ఆమెకు తెలిసినట్టు అతనికి తెలిసిపోయింది. రాత్రి కాగానే ఇద్దరూ ఒకరి గురించి ఒకరు ఎంతగా ఆలోచించారంటే, అతడు సత్రపు తలుపు దగ్గరికి ఆమె సత్రపు గేటు దగ్గరికి వచ్చారు. ఆమె కురులలో ఒక పువ్వుంది. శరీరాన్నేమో సెంటు వాసన అంటుకుని వుంది. కాని, దేవుని కరవాలం లాగా ఒక పొడవైన తళతళలాడే కాంతిశకలం వచ్చి వాళ్లను చుట్టుముట్టింది. అది ఆమె చనుమొనలను గట్టిగా గిల్లి, చిక్కని చీకటి నిండిన రాత్రిలోకి వెళ్లిపోయింది. ఆమె కేక వేసింది. ఊరు మొత్తం మేల్కొంది. మోతీ ఖాన్ బుట్టను చంకలో పెట్టుకుని ఉత్తర దిశ వైపు ప్రయాణించాడు. ఎందుకంటే, అల్లా అక్కడి నుండి అతణ్ని పిలుస్తున్నాడు.

ఇక నేను దేవుడిని దర్శించుకోవాలి. లేకపోతే ఈ ప్రాణి నన్ను చంపేస్తుంది. తర్వాత నేను నరకంలో కాలిపోవాల్సి ఉంటుందని ఈ దయ్యానికి తెలుసు, అనుకున్నాడు మోతీ ఖాన్. కాబట్టి, అతడు ఏ సాధువు సమాధినైనా చేరుకుని, అక్కడ ధ్యానం చేయాలని నిశ్చయించుకున్నాడు. కానీ ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి, ఒక సంత నుండి మరొక సంతకు ఎంతగా ప్రయాణించినా ధ్యానం చేసుకునేందుకు అనువైన దర్గా ఒక్కటి కూడా కనిపించలేదతనికి. ఎందుకంటే, దేవుడు అతణ్ని ఉత్తరం వైపు నుండి పిలుస్తూనే ఉన్నాడు. మోతీ ఖాన్ అడవులను దాటాడు, కొండలను ఎక్కాడు, దిగాడు. పక్షులు కిలకిలా రావాలు చేసే, జింకలు ఉల్లాసంగా గంతులు వేసే సన్నని లోయలను చేరుకున్నాడు. అక్కడ పూర్తి నిశ్శబ్దం ఆవరించి ఉంది. ఇక నేను వెనుతిరిగి నా యింటికి పోతాను, అనుకున్నాడు. కానీ వెనక్కి తిరిగి చూడగానే భయంతో వణికిపోయాడు. దేవుడు నన్ను పిలుస్తున్నాడు కనుక నేను ఉత్తరదిశగా ప్రయాణించాల్సిందే, అనుకున్నాడు. తర్వాత మళ్లీ కొండలను ఎక్కాడు, అడవుల్లోంచి పరుగెత్తాడు. ఆపైన విశాలమైన జనావాస ప్రాంతాలు వచ్చాయి. అతడు సంతలకు పోయి పామును ఆడించాడు. ప్రజలు తమ బియ్యం దుకాణాలను, బట్టల కొట్టులను, అంబా అని అరుస్తున్న పశువులను, పంట కల్లాలను, విసుర్రాళ్లను, ఇటుక బట్టీలను వదిలేసి అతని పుంగీ నాదాన్ని వినేందుకు, నాట్యమాడే ఆ పామును చూసేందుకు వచ్చారు. వాళ్లు అతనికి అన్నం, పండ్లు, బట్టలు ఇచ్చారు. "ఇదిగో రూపాయి బిళ్ళ" అనగానే, "వద్దు" అన్నాడు మోతీ ఖాన్. పాము అందుకు బాగా సంతోషించింది. మోతీ ఖాన్ దేవుణ్ని దర్శించే లోపు అతడిని చంప వద్దనుకుంది అది. మోతీ ఖాన్‌కు కూడా చావడం అసలే ఇష్టం లేదు. అతడు నర్మదా నదిని, భాగీరథి నదిని దాటి, యమునా నదిని చేరుకున్నాడు. తర్వాత పామును ఆడిస్తూ ఆగ్రా నగరం మొత్తాన్ని దాటాడు. అయినా అతనికి దేవుడు కనిపించలేదు. దాంతో అతని మనసును కసి ఆవహించింది. పైగా పాము కూడా ఇబ్బంది పెట్టసాగింది.

కానీ ఫతేపూర్ సిక్రీ దగ్గర మోతీ ఖాన్, ఇక్కడ షేక్ చిస్తీ సమాధి వుంది. ఇక నేను ఆహారం మాని చావనైనా చస్తాను గానీ ఒక్క అంగుళం కూడా కదలను, అనుకున్నాడు. అతడు ఆ సమాధి పక్కన కూర్చుని, "షేక్ చిస్తీ, విధి నన్ను ఎక్కడికి తీసుకుపోతోంది? ఈ పాము చాలా దుష్టమైనది. అది ప్రతి క్షణం బుసకొట్టి మంటను ఊస్తుంది నా మీద. దేవుణ్ని దర్శించు అంటుంది. షేక్ చిస్తీ, ఇప్పుడు నేను దేవుణ్ని ఎలా దర్శించగలనో చెప్పు. అతణ్ని దర్శించే వరకు నేను ఈ ప్రదేశాన్ని వదలను," అన్నాడు.

కానీ ప్రార్థన చేస్తుంటే తన తలలోంచి పాములు వెలువడటం, నీటి ఊటలు తొణకడం, తాజ్ మహల్ దగ్గర నీళ్ల పడ్డట్టు పాములు మెల్లగా అటూయిటూ పడటం, వాటిలోంచి స్త్రీలు రావడం చూశాడతడు. కోమలమైన స్త్రీలు, నాట్యం చేస్తున్న స్త్రీలు, గుండ్రని పిరుదులు

తమలపాకు నమిలిన పెదవులు గుండ్రని రొమ్ములు ఉన్న స్త్రీలు కనిపించారు. వారిలో కొందరు సిగ్గరులు. కొందరేమో వగలాడులు. వాళ్లు కుడినుండి వచ్చి ఎడమ వైపు పోయి, అకస్మాత్తుగా అతని గడ్డాన్ని లాగుతున్నారు. ఒక్కసారిగా నేలలో పగుళ్లు ఏర్పడి, వాటిలోంచి తెల్లని పాములు బయటికి వచ్చి, ఆ స్త్రీలందరినీ చుట్టుకున్నాయి. మోతీ ఖాన్ కదలలేదు. తర్వాత ఇట్లా అన్నాడు: "షేక్ చిస్తీ, ఇప్పుడు నేనొక వింత ప్రపంచంలో ఉన్నాను. కానీ దూరాన ఒక చీకటి ప్రపంచాన్ని చూస్తున్నాను. చాలా చీకటిగా ఉన్న ఆ ప్రపంచం వెనుక, కాంతి నిండిన మరొక ప్రపంచం కనపడుతోంది. అల్లా అక్కడ ఉన్నాడనుకుంటాను."

ఇరవై తొమ్మిది రోజుల పాటు అతడక్కడ మోకాళ్ల మీద కూర్చుని, చేతులతో చెవుల్ని అదిమిపట్టుకుని, ముఖాన్ని షేక్ చిస్తీ సమాధి వైపు పెట్టాడు. జనం వచ్చి,"లే ముసలాయనా, లే" అన్నారు. కానీ అతడి నుండి జవాబు రాలేదు. షేక్ చిస్తీ సమాధి మీద ఒక పాము కనబడింది వాళ్లకు. "ఇది విచిత్రం," అని అరుస్తూ వాళ్లు పారిపోయారు. కొందరు మాత్రం ముల్లాలను, మౌల్వీలను తీసుకొచ్చారు. అయినా మోతీ ఖాన్ నుండి జవాబు రాలేదు. నిజం చెప్పాలంటే అతడు చీకట్లో ప్రవాహాన్ని దాటుతున్నాడు. అందులో పడ్డవాళ్లు విపరీతమైన ఇబ్బందికి గురై నీళ్లు తొణికేలా తపతపా చేతులతో కొడుతూ, అశాంతిగా అదేపనిగా కదులుతుంటారు. అక్కడ ఆకాశమంతా చాలా చల్లగా ఉంటుంది. నక్షత్రాలన్నీ చనిపోయి వుంటాయి. అవతలి ఒడ్డును చేరేవరకు శాంతి దొరకదు, దేవుడు కనపడడు.

ఇరవై తొమ్మిదవనాడు రాత్రి షేక్ చిస్తీ తన సమాధి నుండి మేల్కొని బయటికి వచ్చాడు. ఆయన తల మీద టోపీ ఉంది. "నాయనా, నేను నీకు ఏమివ్వాలి?" అని అడిగాడు.

"ఈ పాము నుండీ దేవుడి నుండీ శాంతి కావాలి నాకు."

"నాయనా దేవుడు కనపడడు. ఆయన అంతటా ఉన్నాడు."

"దేవుణ్ని చూడగలిగే కళ్లను నాకు ఇవ్వండి. ఉత్తరదిశకు ఇక ఏమాత్రం పోలేను నేను."

"దేవుణ్ని చూడగలిగే కళ్లను ఇస్తున్నాను."

"ఇంకా ఈ పాము నుండి కూడా శాంతి కావాలి."

"అది దేవుణ్ని కోరుకునేవాళ్లకు నిజమైన సహచరునిగా, విశ్వాసపాత్రంగా ఉండగలదు." "ప్రజలందరికీ శాంతి దొరకాలి," అన్నాడు మోతీ ఖాన్.

"ప్రజలందరికీ శాంతి లభిస్తుంది. నీకు మరో విషయం చెప్తున్నాను మోతీ ఖాన్. సూర్యోదయం కాగానే మౌల్వీ మొహమ్మద్ ఖాన్ గన్నేరు పువ్వులాంటి సుకుమారమైన తన కూతురును ఇవ్వడానికి నీ దగ్గరికి వస్తాడు. ఆమె ఎప్పటి నుండో నీకోసం వేచిచూస్తూ ఉంది. ఆమె నిన్ను వివాహం చేసుకుంటుంది. నాయనా, నీకు నా దీవెనలు."

"అల్లా కనిపించాడు. జయహో అల్లా," అని అరిచాడు మోతీ ఖాన్. పాము అతని చుట్టూ గెంతి, పాదాల మధ్యంలోంచి జారిపోయి, మెడ చుట్టూ చుట్టుకుని, తలమీద నాట్యం చేసింది. మోతీ ఖాన్ దేవుణ్ని దర్శించినప్పుడు అతని పాపాలన్నీ విసుర్రాయి మధ్య నలిగిన గింజల్లా నలిగిపోయాయి. ఇన్ని రోజులు అతడు కష్టాల మధ్య నలిగిపోయాడు. ఇక ఇప్పుడు ప్రజలందరికీ శాంతి దొరుకుతుంది.

మౌల్వీ మొహమ్మద్ ఖాన్ కూతురు భక్తిపరురాలు. మోతీ ఖాన్ ఆమెను పెళ్లి చేసుకుని, ఎంతగానో ప్రేమించాడు. అతడు ఫతేపూర్ సిక్రీలో స్థిరపడి, షేక్ చిస్తీ సమాధికి సంరక్షకుడుగా ఉండిపోయాడు. పాము అతనితోనే ఉండిపోయింది. మోతీ ఖాన్ దాన్ని అప్పుడప్పుడు పిల్లల కోసం సంతకు తీసుకుపోయి నాట్యం చేయించాడు.

ఒకరోజు మోతీ ఖాన్ భార్య చనిపోయింది. ఆమెను ఖననం చేసి, పైన నల్లని చలువరాయితో సమాధిని నిర్మించారు. పదకొండు నెలల తర్వాత మోతీ ఖాన్ చనిపోయాడు. ఆయనకు తెల్లని చలువరాయితో సమాధిని నిర్మించారు. కానీ పైన వుండే చిన్న గుమ్మటాన్ని మాత్రం ఒకే రంగు రాయితో రెండు సమాధులను కలుపుతూ కట్టారు. మూడు రోజుల తర్వాత పాము కూడా మరణించింది. దాన్ని దర్గా పక్కన పాతిపెట్టి, మంచి రేగడిమట్టితో సమాధిని కట్టారు. దానిమీద ఒక రావిమొక్క మొలిచింది. అట్నుంచి పోతున్న ఒక బ్రాహ్మణుడు ఆ రావిచెట్టు పక్కనే ఒక వేపమొక్కను నాటాడు. ఊళ్లోని ఒక వర్తకుడు ఆ రెండు చెట్ల చుట్టు ఒక గద్దెను నిర్మించేందుకు డబ్బు ఇచ్చాడు. రావిచెట్టు ఆకాశాన్ని తాకేలా చాలా ఏపుగా పెరిగి, గుమ్మటం మీద చిక్కని చల్లని నీడను పరచింది. బ్రాహ్మణులు దానికింద పాముల రాతివిగ్రహాలను నిలిపారు. గుడిగంటలు మోగాయి. కర్పూరాలు వెలిగాయి. కొత్త పెళ్లిజంటలు ఆ గద్దె చుట్టూ ప్రదక్షిణాలు చేశాయి. పాముకు కర్పూరం సమర్పించినప్పుడు మోతీ ఖాన్ దాని పరిమళాన్ని స్వీకరించాడు. ఊరిలో వ్యాధి ప్రబలినప్పుడు మేము జెండాలతో, బాజాలతో అక్కడికి వెళ్తాము. రావిచెట్టు గద్దె ముందు, దర్గా ముందు సాష్టాంగ ప్రణామం చేస్తాము. రాత్రివేళ గాలి పైకి లేచి, ఊరిలోని దుష్టభావాలన్నీ కొట్టుకుపోయేలా వీస్తుంది. పిల్లలు ఏడ్చినప్పుడు, "నా బంగారం, మోతీ ఖాన్ నీకు నయం చేస్తాడు," అని ఓదార్చుతాము. నిజంగానే వాళ్లకు నయమౌతుంది. రాజులు, చక్రవర్తులు వచ్చారు పోయారు గానీ, వాళ్లు మా ఊరినెప్పుడూ ధ్వంసం చేయలేదు. ఎందుకంటే, పామూ మనిషీ స్నేహితులు. మోతీ ఖాన్ దేవుణ్ని దర్శించాడు.

ఆగ్రాకూ ఫతేపూర్ సిక్రీకీ మధ్య ఇప్పటికీ మీకు చిన్న సమాధి, రావిచెట్టు కనిపించవచ్చు. దాని గోడల మీద అబ్బాయిలు తమ పేర్లను రాసుకున్నారు. సమాధి మీది గుడ్డ దుమ్ము, ఆకులతో కప్పబడి ఉంటుంది. ఒకాయనెవరో దాని పక్కనే బావిని తవ్వించాడు. రోడ్డు మీద పోయేటప్పుడు మీకు దాహం వేస్తే అక్కడ నీళ్లు తాగి, రావిచెట్టు కింద విశ్రమిస్తూ దేవుని గురించి గాఢంగా ధ్యానం చేసుకోవచ్చు.

వ్యాసం

# విలక్షణ పి.వి. - ఒక సాధికారిక జీవిత చరిత్ర

**పి.వి. జీవితం కొండను అద్దం లాంటి పుస్తకంలా వివరించిన తీరుపై విశ్లేషణ...**




వంగీపురం చైతన్యదేవ్
63047 55901


ప్రజాస్వామ్య దేశాలలో ఆయా దేశాలను అధ్యక్ష లేదా ప్రధాని హోదాల్లో పాలించిన నేతలు తమ పదవీ నిష్క్రమణ అనంతరం స్వీయ చరిత్రలు (ఆత్మ కథలు) రచించుకోవడం ఒక సంప్రదాయం. పది సంవత్సరాల పాటు ఇంగ్లండ్‌ను పాలించిన ఉక్కు వనిత మార్గరెట్ థాచర్ (ది డౌనింగ్ స్ట్రీట్ ఇయర్స్), రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడైన బిల్‌క్లింటన్ (మై లైఫ్) ఆత్మకథలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును పొందాయి. దక్షిణాఫ్రికా పోరాట యోధుడు నెల్సన్ మండేలా ఆత్మకథ యావత్ విశ్వాన్ని కదిలించింది! అయితే భారత ప్రధాన మంత్రులు ఎవరూ ఆత్మకథా రచన చేయలేదు.

రాష్ట్రపతుల్లో నీలం సంజీవరెడ్డి, జ్ఞానీ జైల్ సింగ్, ఆర్.వెంకటరామన్, డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్‌కలాం, ప్రణబ్‌ముఖర్జీలు ఆత్మకథా రచన చేశారు. వీటిలో వెంకటరామన్, అబ్దుల్‌కలాంల రచనలకు మంచి గుర్తింపు లభించింది. ఇక జీవిత చరిత్రల విషయానికి వస్తే శ్రీమతి ఇందిరాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ కొంత మేరకు లాల్ బహదూర్ శాస్త్రిల జీవిత విశేషాల పై మాత్రమే గొప్ప రచనలు ఇంగ్లీషులో వచ్చాయి. ప్రాంతీయ భాషల్లో వీటి సంఖ్య మరీ తక్కువ. ఇకపోతే సంక్లిష్ట సమయంలో ఐదు




సంవత్సరాల పాటు భారత ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన తెలుగు బిడ్డ పి.వి. నరసింహారావును గురించి గతంలో మన భాషలోనూ అంత విస్తారమైన జీవిత చరిత్రలు రాలేదు. పి.వి.పై ఇంగ్లీషులో వి.ఆర్.ఆదిరాజు, 'ది రైట్ ప్రైమ్ మినిస్టర్' తెలుగులో ఎం.ఎల్. నరసింహారావులు రచించినవే చాలా కాలంపాటు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ఎం.ఎల్. రచన ప్రాథమిక స్థాయికి చెందిందే. ఐదు సంవత్సరాల నాడు వినయ్ సీతాపతి అనే పరిశోధకుడు 'హాఫ్ లయన్' (తెలుగులో నరసింహుడు) అనే పేరుతో విశేష పరిశోధన ద్వారా చక్కని గ్రంథాన్ని రచించారు. ఇది పి.వి. జీవితంలోని వెలుతురునూ, నీడలను కూడా తెలియ జేసింది. అయితే తాను ఎంతో లోతుగా పరిశోధన చేశానని అందరికీ తెలియాలన్న కోరికతో కావచ్చు, రచయిత అవసర, అనవసర సందర్భాల లోనూ పాద సూచికలు, ఉటంకింపులు చేర్చారు. ఇది సాధారణ పాఠకులకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఎంత గొప్పదైనా అనువాద చిత్రం అనువాద చిత్రమే. వినయ్ సీతాపతి 'నరసింహుడు' డబ్బింగ్ సినిమా వంటిదే. అంటే స్థూలంగా ఇప్పటి దాకా పి.వి.నరసింహారావు జీవితాన్ని సర్వ సమగ్రంగా తెలియజేసే తెలుగు రచన వెలువడలేదనే అర్థమవుతుంది. బహుశా ఈ లోటును గుర్తించే "విలక్షణ పి.వి." - "నరసింహరావుగారి జీవిత చరిత్ర" అన్న గొప్ప గ్రంథాన్ని రచించారు డాక్టర్ గుమ్మన్న గారి బాల శ్రీనివాసమూర్తి, నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వ విద్యాలయం తెలుగు అధ్యయన విభాగంలో ఆచార్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సాహితీ లోకానికి చిరపరిచితులు. లోతైన పరిశోధకులుగా, సహృదయ సాహిత్య విశ్లేషకులుగా ఇప్పటికే డాక్టర్ బాలశ్రీనివాస మూర్తికి తెలుగు నాట మంచి గుర్తింపు ఉంది.

"విలక్షణ పి.వి." గ్రంథాన్ని గురించిన

ప్రస్తుత సమీక్షా వ్యాసంలో తొలుత మూడు ప్రశంసనీయమైన అంశాలను తప్పక పేర్కొనాలి. అందులో తొలి అంశం గ్రంథంలో రచయిత చూపించిన సర్వ సమగ్రత. ఈ రచన మొత్తం 305 పుటల్లో విస్తరించింది. ఇందులో 27 అధ్యాయాలు ఉన్నాయి.

ఇట్లాంటి సమగ్ర జీవిత చరిత్ర రచన అన్నది ఇంగ్లీషు సాహిత్యంలోని ఒక మంచి సంప్రదాయం. ప్రముఖ జాతీయోద్యమ నాయకుడు సర్దార్ పటేల్ జీవితాన్ని గురించి సీనియర్ పాత్రికేయుడు రాజ్‌మోహన్‌గాంధీ, పండిట్‌నెహ్రూను గురించి సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆచార్య సర్వేపల్లి గోపాల్ రచించిన ఆంగ్ల గ్రంథాలు ఎంతో విస్తారంగా ఉన్నాయి. అయినా ఈ జీవిత చరిత్రల్ని అనేకమంది పాఠకులు చదివారు. ఎందుకో ఏమో తెలుగులో "సర్వసమగ్ర జీవిత చరిత్ర రచన" అన్న సంప్రదాయం ఇప్పటికీ బలపడలేదు. తొలినాళ్ళల్లో అంటే చిలకమర్తి, కందుకూరి వంటి వారు జీవితచరిత్ర రచనలు చేసిన రోజుల్లో సమగ్ర జీవిత చరిత్ర రచనలు వచ్చాయి. అటు తర్వాత ఇవి క్రమేపీ సన్నబడ్డాయి. దీనితో జీవిత చరిత్రలు సమగ్రతతోపాటు సాధికారికతను కూడా కోల్పోయాయి. కేవలం వ్యక్తి జనన మరణాలు, మరికొన్ని జీవిత విశేషాలతో సరిపెట్టే 'మోనోగ్రాఫ్' సంప్రదాయం తెలుగులో బలపడింది. ఇందుకు భిన్నంగా ఉన్న రచన "విలక్షణ పి.వి." నరసింహారావు గారు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ప్రధానమంత్రిగా ఉన్ననాళ్ళ సంగతులు కొన్ని అయినా ప్రజానీకానికి తెలుసు, కానీ ఆయన నిజాం వ్యతిరేక పోరాటంలో చాందా శిబిరంలో సాయుధులై పాల్గొన్న సంగతి, తెలుగు అకాడమీ ఏర్పాటు ద్వారా నేటి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది మంది తెలుగు మాధ్యమ విద్యార్థులు ఉన్నత విద్యా సాధనకు పరోక్షంగా దోహదం చేసిన సంగతి ఎంత మందికి తెలుసు? ఇంకా ఇటువంటివి ఎన్నో బాలశ్రీనివాసమూర్తి ప్రస్తుత రచనల్లో కానవస్తాయి. జీవిత చరిత్ర రచనలు కొన్ని సందర్భాల్లో జానపద గాథల తరహాలోనూ మరికొన్ని సార్లు స్తోత్ర పాఠాలుగానో ఉండడం తెలిసిందే. రచయితల అధ్యయనలేమి ఇక్కడ సుస్పష్టంగా కనబడుతుంది. దీనితో ఆయా రచనలు తేలికైనవిగా విలువను కోల్పోతాయి. అయితే 'విలక్షణ పి.వి.'లో ఈ బలహీనతలు ఎక్కడా లేవు. రచయిత తాను చెబుతున్న అంశానికి ప్రమాణాలుగా పలువురు ప్రముఖుల రచనల్ని ఉటంకించారు. జైరాంరమేష్, ప్రణబ్ ముఖర్జీ, పి.సి.అలెగ్జాండర్, పి.వి.ఆర్.కె.ప్రసాద్, కృష్ణారావు, రామచంద్ర గుహ, కుల్‌దీప్ నయ్యర్ ఇట్లా ఎంతో మంది ఆనాటి ప్రముఖుల అనుభవాలు, జ్ఞాపకాల పరంపర ఉటంకింపుల్లో కనబడుతుంది. పి.వి. సాహిత్యాన్ని విశ్లేషించే సందర్భంలో, ఇతర అధ్యాయాల లోనూ రచయిత తన ప్రామాణిక స్థాయిని చక్కగా నిరూపించుకున్నారు. అవుట్‌లుక్, దివీక్, ఫ్రంట్‌లైన్ వంటి అప్పటి అగ్రశ్రేణి వార్తా సంచికల సమాచార విశ్లేషణల్ని, వార్తా కథనాల్ని విరివిగా ఉపయోగించుకున్నారు.

**"ఒక మంచి పుస్తకాన్ని చదివిన తరువాత విందు భోజనం చేసినట్టుగా ఉండాలి" అంటారు ప్రముఖ కవి, పరిశోధకులు ఆరుద్ర. వచన రచనకు ఇటువంటి కమ్మదనాన్ని కలిగించేది ఆ రచనలోని హాయిగా చదివించే గుణం. ఇది డాక్టర్ బాలశ్రీనివాస మూర్తి "విలక్షణ పి.వి."లో స్పష్టంగా కనబడుతుంది. ఎక్కడా విసుగును తెప్పించని రచనా శైలి. బహుశా రచయిత గతంలో పత్రికలకు వ్యాసాలు రచించడం వల్ల ఆయన శైలిలో ఈ తీరు చేరి ఉంటుంది. తొలి అధ్యాయనం నుండి తుది పుట దాకా అంతటా ఆహ్లాదక రమైన శైలి పరుచుకొని ఉంది.**



"ఒక మంచి పుస్తకాన్ని చదివిన తరువాత విందు భోజనం చేసినట్టుగా ఉండాలి" అంటారు ప్రముఖ కవి, పరిశోధకులు ఆరుద్ర. వచన రచనకు ఇటువంటి కమ్మదనాన్ని కలిగించేది ఆ రచనలోని హాయిగా చదివించే గుణం. ఇది డాక్టర్ బాలశ్రీనివాసమూర్తి "విలక్షణ పి.వి."లో స్పష్టంగా కనబడుతుంది. ఎక్కడా విసుగును తెప్పించని రచనా శైలి. బహుశా రచయిత గతంలో పత్రికలకు వ్యాసాలు రచించడం వల్ల ఆయన శైలిలో ఈ తీరు చేరి ఉంటుంది. తొలి అధ్యాయనం నుండి తుది పుట దాకా అంతటా ఆహ్లాదకరమైన శైలి పరుచుకొని ఉంది. భారత అమెరికా సంబంధాలు, మన విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణల వంటి క్లిష్టమైన అంశాల్ని వివరించే క్రమంలోనూ శైలిలో రచయిత చూపించిన నేర్పు ప్రస్ఫుటమవుతుంది.

ఈ గ్రంథం పి.వి.ని గురించి ఎన్నో లోతైన, వెలుగు చూడని విషయాల్ని తెలియజేస్తున్నది. నరసింహారావు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీలో సంపూర్ణమైన ప్రజాస్వామ్య సంస్కృతి పరిఢవిల్లాలని కోరుకున్నారు. అందుకు తనవంతు ప్రయత్నం చేశారు. భారతీయ సమాజంలో సానుకూలమైన ఆర్థిక ఆకాంక్షలు బలపడాలని కోరుకున్నారు. అందుకు నూతన విధానాలతో తనవంతు ప్రయత్నం చేశారు. సమాజంలో ఆర్థిక రాజకీయ న్యాయాలు ఎంతమాత్రం సరిపోవని

విశ్వసించారు. వీటితోపాటు సామాజిక న్యాయ దృష్టి ఎంతో అవసరమని భావించారు. సామాజిక అగ్రవర్ణంలో అదీ అధిక భూవసతి కలిగిన కుటుంబంలో జన్మించినా బడుగు వర్గాల మేలుకోరే వ్యక్తిగా తన నిబద్ధతను కాపాడుకున్నారు. 1972లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అధిక ప్రాతినిధ్యం ఉండేలా చూశారు. 1992 తిరుపతి కాంగ్రెస్ ప్లీనరీ తర్వాత ఏర్పడిన సి.డబ్ల్యు.సి. (కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ)ని బడుగువర్గాలు, మహిళల ప్రాతినిధ్యం లేదనే ఉద్దేశంతో రద్దుచేయించారు. నేటి రెసిడెన్షియల్ పాఠశాలలకు మౌలిక ప్రాతిపదిక వంటి గురుకుల పాఠశాలల్ని (సర్వేల్, తాడికొండ, కొడిగెనహళ్ళి) 1970లోనే ఆంధ్రప్రదేశ్‌లో మూడు మూలల్లో ప్రారంభింపజేశారు. పి.వి.ఏనాడూ మత ఛాందసవాది కాదు. ఆయన నిరంతరం పూజల్లో కూర్చున్న వారూకారు. తన ఇష్టదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని మాత్రం తరచూ దర్శించు కున్నారు.

భారతీయ జనతాపార్టీలో అటల్‌బిహారి వాజ్‌పేయి మాత్రమే పి.వి. మిత్రులు. ఇక ఉభయ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ-సిపిఎం) లలో ఇంద్రజిత్‌గుప్తా, హరికిషన్ సింగ్ సుర్జిత్‌లపట్ల ప్రత్యేక గౌరవం. పి.వి. అజాత శత్రువే అయినా స్వపక్షంలో అర్జున్‌సింగ్ వంటివారు ఆగర్భ శత్రువులుగా మారారు. పి.వి. ఆనాడు అంకురింపజేసిన విదేశాంగ విధానమే నేటికీ కొనసాగుతున్నది. “ఆర్థిక సంస్కరణల ద్వారా ఒక్క ఉద్యోగి ఉపాధి పోగొట్టుకున్నా నాకు ఈ సంస్కరణలు అవసరం లేదు.” అని తనలోని మానవీయ కోణాన్ని బయటపెట్టారు, పి.వి. ఇట్లా ఆయన జీవన-పాలన-వ్యక్తిత్వ విశేషాలు ఎన్నో విలక్షణ పి.వి. గ్రంథంలో సవివరంగా ఉన్నాయి.

పి.వి.లో బలహీనతలు లేవా? ఆయన లోనూ పాలనా వైఫల్యమే లేదా? ఉన్నది. దీన్ని దాచేందుకు గ్రంథ రచయిత బాల

> **1952 తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి ఒక వైఫల్యం, అటు తరువాత సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాల్లో ప్రతిభావంతుడైన మంత్రి అయి కూడా నిశ్శబ్దంగానే కొనసాగడమూ వైఫల్యమే. స్వల్పకాలం పాటు కొనసాగిన ముఖ్య మంత్రిత్వం మరో భారీ వైఫల్యం. స్వరాష్ట్ర రాజకీయాలలో పట్టులేకపోవడం, స్వంత పార్టీలోనూ స్వీయ వర్గం ఏర్పడక పోవడం వంటివి కూడా వైఫల్యాలే.**

శ్రీనివాసమూర్తి ఎంతమాత్రం ప్రయత్నించ లేదు. 1952 తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి ఒక వైఫల్యం, అటు తరువాత సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాల్లో ప్రతిభావంతుడైన మంత్రి అయి కూడా నిశ్శబ్దంగానే కొనసాగడమూ వైఫల్యమే. స్వల్పకాలం పాటు కొనసాగిన ముఖ్యమంత్రిత్వం మరో భారీ వైఫల్యం. స్వరాష్ట్ర రాజకీయాలలో పట్టులేకపోవడం, స్వంత పార్టీలోనూ స్వీయ వర్గం ఏర్పడక పోవడం వంటివి కూడా వైఫల్యాలే. 1984 చివరలో శ్రీమతి ఇందిరాగాంధీ దారుణ హత్యానంతర హింసాకాండను నిలువరించ లేకపోవడం కేంద్ర హోంమంత్రిగా

నరసింహరావు ఘోరవైఫల్యం. 1996 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించలేకపోవడం కూడా వైఫల్యాల లెక్కలోకే వస్తుంది. నిరంతరం స్వీయ రక్షణ ధోరణితో ఉండడం, తన మనో భావాలను అత్యంత సన్నిహితుల వద్ద కూడా ప్రస్తావించకపోవడం ఈ వైఫల్యాల కారణాలలో కొన్ని అని పరోక్షంగా ఈ గ్రంథం ద్వారా రచయిత తెలియజేశారు. తనలో తానొక లోకాన్ని నిర్మించుకొని అందులోనే ఉన్న ఏకాంత తపస్వి వలె పి.వి. కనబడతారు. పి.వి. కనుక తొలి నాళ్ళ నుండే దూకుడుగా ఉంటే ఆయన రాజకీయ ప్రస్థానం ఎట్లా ఉండేదో? ఊహలకే విడిచిపెట్టదగిన అంశమిది!

పి.వి. హద్దు, అదుపులు లేని ఆర్థిక సంస్కరణల్ని ఆమోదించారని అను కోలేము. ఆయన ఈ అంశంలో తనదైన సుస్పష్టమైన వైఖరిని ప్రధానిగా ఉన్నప్పుడూ, పదవి నుండి నిష్క్రమించిన తరువాత కూడా చెబుతూ వచ్చారు. అయితే ఆయన ఆర్థిక సంస్కరణల వ్యతిరేకి మాత్రం కాదు. దీన్ని సమర్థవంతంగా రచయిత తెలియజేయ గలిగారు. బాబ్రీ మసీదు విధ్వంసం రామమందిర నిర్మాణ ఉద్యమం గురించి వివరాలు ప్రస్తుత గ్రంథంలో పెద్దగా వ్రాయలేదు. ఇప్పటికే సమస్య పరిష్కారమై పోయింది కనుక సమీక్ష అవసరం లేదని లౌక్యంగా ముందుకు పోయారు రచయిత. నరసింహారావు అధికారాంతంలో అనుభవించిన విషాద యోగంలోనూ రచయిత ఇదే తీరును చూపించారు. అప్పట్లో ఆయనపట్ల అతివ్యతిరేకత చూపించిన అహ్మద్‌పటేల్, చిదంబరం వంటి నాయకుల పేర్లను పేర్కొనలేదు. పి.వి. ఆదరణ వల్లనే లోక్‌సభ స్పీకర్ ఆయన శివరాజ్‌పాటిల్ ఆయన మరణ సమయంలో కేంద్ర హోంమంత్రి, అయినా దేశ రాజధానిలో పి.వి. అంత్యక్రియలు నిర్వహించాలని పల్లెత్తు ప్రకటనా చేయలేదు!

అనేక రోజులపాటు లోతైన అధ్యయనం ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎంతో నైపుణ్యంతో విశ్లేషించి డాక్టర్ గమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి చక్కటి గ్రంథాన్ని రచించారు. గ్రంథానికి ముందు మాట రచించిన ప్రసార భారతి పూర్వ సిఇఒ సీనియర్ ఐఎఎస్ అధికారి కె.ఎస్.శర్మ అభిప్రాయ పడినట్టు “విలక్షణ పి.వి. ఇటీవల కాలంలో వెలువడిన ప్రామాణిక జీవిత చరిత్ర” నిజంగానే ఇదొక సాధికారిక జీవిత చరిత్ర.ఈ రచన ఇంగ్లీషులోకి అనువాదం కావలసిన అవసరం ఉన్నదని సమీక్షకుడి సూచన. ప్రసిద్ధ ప్రచురణ సంస్థ “నీల్ కమల్ పబ్లికేషన్స్” ఈ రచనను ఎంతో సుందరంగా ప్రచురించింది.

కవిత

# ఎరుపు గంప



అఖిలాశ, 72595 11956

పదే పదే చూసుకుంటున్నాను
బహుశా!
కాలం మొదలైనప్పటి నుండి
చూసుకున్న ప్రతిసారీ
కాస్త ఊపిరిని కోల్పోతూనే ఉన్నాను

ఏదో శబ్దమైనప్పుడల్లా
ఒక వెలుగు
కనుగుడ్లపై ఆరిపోయినప్పుడల్లా
భూమి నవ్వినట్టే అనిపిస్తుంది

ఇసుక కన్నులను
సీసాలో దాచుకొని పైకి కిందికి తిప్పడం,
మోచేతులపై
విరిగిపడుతున్న నిప్పులను ఆర్పుకోవడం,
నా నీడలను నేనే తొక్కుకుంటూ
పదే పదే చూసుకుంటాను

ఏదీ మారడం లేదు
అక్కడక్కడే ఉండిపోతోంది
దిబ్బలో ఎరుపు కుప్పలా
అక్కడే అక్కడే అక్కడే

ఇప్పుడు అక్షర ఎరుపును
సమాజంలో చల్లాలి
పదే పదే చూడటం కాదు
సాహిత్య ఎరుపును సృష్టించాలి

అదిగో
ఎరుపు గంప అందుకో
పురుగు పట్టిన సమాజంపై చల్లుదాము

కథ

# ఒప్పుకోలు

లాక్‌డౌన్ వివాహ ప్రయత్నాలు,
వాటి కష్టాలను తెలిపే కథ...



బివిఎన్ స్వామి

(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)

తిన్నది పెయ్యికి పట్టకపోవడానికి, రాత్రి నిద్రలేకపోవడానికి ఒకటే కారణం. అమ్మాయి పెళ్ళి నిశ్చయం కాకపోవటం. కాలు వంకరా, ముక్కు వంకరా! అదేం లేదు. చదువు, ఉద్యోగం లేవా. అన్నీ ఉన్నాయి. మరెందుకాలస్యం. అబ్బాయి దొరకటం లేదు. అందము, ప్రాయము, ఐశ్వర్యము గల సుందరుడు దొరుకుట అరుదు కదా. అదేం కాదు. బోలెడు మంది ఉన్నారు. 'రాశికూటములు'తో సహా అన్నీ కుదరాలి. జరిగేనా పెళ్ళి. ఒక మెట్టు దిగాలి కదా! వరుడు దొరికితే దిగుడే. మా వంశం పిల్లలు పనికిరారు. తెలిసిన బంధువుల పిల్లలు ఈడుకు లేరు. కులంలో మా శాఖ నుండి బయటికి వెళ్ళి చేసుకుందామంటే 'రాశికూటములు' కలవడం లేదు. అన్నీ కలిసినప్పుడు, అమ్మాయి, అబ్బాయిని నచ్చడం లేదు. అమ్మాయి ఈడు పెరుగుతుందని తెగరంధి పట్టుకుంది. కంటిమీద కునుకు లేదు. సాంకేతిక పట్టభద్రులు బోలెడంత మంది ఉన్నా సాంకేతిక నిపుణుల కరువున్నట్లు, అబ్బాయిలు అనేకము ఉన్నా, అన్ని అర్హతలున్న అబ్బాయిల కరువు కనపడుతుంది. కొంతవరకు రాజీ పడాలి. అనుకున్నవన్నీ కుదరని పని. అమ్మాయి ముందు రాజీఫార్ములా ఉంచాను. ఒప్పించాను. ఇది జరిగిన కొన్నిరోజులకే కరోనా వైరస్ ప్రపంచాన్ని చుట్టుకుంది. పెళ్ళి ప్రయత్నాలకు గండిపడ్డట్టనిపించింది. అంతకు ముందు చేసిన ప్రయత్నాల ఫలితంగా ఒక సంబంధం చేరువలోకి వచ్చింది. పెళ్ళి చూపుల్లో కళ్ళు సమాధానపడ్డాయి. కట్నకానుకలు కుదిరాయి. రాశికూటాల వద్ద రాజీపడ్డాను. మిగిలింది పెళ్ళి. ఇప్పుడదొక అగ్నిపరీక్ష. అగ్ని పరీక్షకైనా తంతు తప్పదు. కరోనా కాలమైనా పెళ్ళి క్రమం తప్ప ఎంగేజ్‌మెంట్, మ్యారేజ్, రిసెప్షన్ ఇదొక తాపత్రయం. ఒక దాన్నుండొకటి పుట్టుకుంటూ మరొకదాన్ని ప్రభావితం చేస్తూ, మందని కుప్పబోసే తంత్రం. వధూవరులు ఈ వలయాన్ని దాటి ఎనిమిదో అడుగు వేస్తేనే కలయి సాధ్యం. ఈ ఘట్టం అంతా సజావుగా సాగకుండా, సైంధవుడిలా కరోనా అడ్డుపడింది.

మార్చ్‌లో ఎండలు మెండు. ఆ సమయంలో లాక్‌డౌన్ మొదలైంది. మనుషులు ఇండ్లు దాటడం లేదు. కొందరైతే ఇంటికి రావద్దని మొహం మీదే చెబుతున్నారు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న డాక్టర్లు ఇంటికి వెళ్ళడం లేదు. డాక్టర్స్ కిరాయికి ఉంటున్న ఇంటి ఓనర్లు, వాళ్ళను ఖాళీ చేయమంటున్నారు. మెడికోలకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదు. కరోనా వైద్యం చేయడానికి డాక్టర్లు కూడా శ్రమిస్తున్నారు. అవసరం పేరు చెప్పి కొందరు యువకులు రోడ్లమీద స్వేచ్ఛా విహారం చేస్తున్నారు. వాళ్ళను నియంత్రించడానికి పోలీసులు, వారికి గులాబీపూలు ఇచ్చి గాంధీగిరి చేశారు. కొన్నిచోట్ల గుంజీలు తీయించారు. ఎప్పటిలాగా వర్షాకాలం వచ్చింది. ఈ కాలంలో జంతువులకు రోగాలు, మనుషులకు వైరల్ ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువ. కరోనా ఆనందతాండవం చేసింది. ప్రభుత్వం జాగ్రత్తలు చెప్పింది. కరోనా కాలంలో విధినిర్వహణలో భాగంగా పనిచేసిన 'ఫ్రంట్ లైన్ వారియర్స్'లో చాలామందికి కరోనా సోకింది. అలా సోకిన వాళ్ళలో పెళ్ళి కూతురు తండ్రి ఒకరు. పొద్దనక, మాపనక, తిండనక, తిప్పలనక, ఎండనక, వాననక, ప్రజలు కరోనా బారిన పడకుండా కాపలా కాసిన పోలీస్, అలసినపుడు బారికేడ్స్ నీడల్లో విశ్రమిస్తూ, ఆకలయినపుడు రోడ్డు పక్కన తింటూ కాలం గడిపారు. అలాంటివాళ్ళలో పెళ్ళికూతురు తండ్రి ఒకరు. పెళ్ళి ముందున్నదనే భయం, కరోనా సోకిందనే బాధ ఆయనను తొలచింది. విషయం ఎవరికీ తెలుపలేదు. పెళ్ళి కారణం చూపి సెలవు పెట్టాడు. ఇంటివాళ్ళ నోరు మూయించాడు. 'ఇమ్యూనిటీ పెంచుకుంటే కరోనా పారిపోతుంది' అని బోధించాడు. 'తిప్పతీగ పసరు', 'పాలల్లో పసుపు' వేసుకొని తను తాగి అందరితో

తాగించాడు. వేడినీరు తాగుదామనీ, వేడినీటి ఆవిరి సరిపోతాయని తీర్మానించాడు. ఐసోలేషన్ కెళితే పనులు సాగవనీ, పెళ్ళి ఆగుతుందనీ అభిప్రాయపడ్డాడు. అతని పోలీస్ బుద్ధి ముందు అందరి నోళ్ళు మూతబడ్డాయి. అవసరం వారి మెడలు వంచింది. ద్వైదీభావంతో అన్యమనస్కంగా పెళ్ళిపనులకు కదిలారు. చుట్టుపక్కల నోళ్ళకు, గుచ్చిగుచ్చి చూసే చూపులకు జడుస్తూ, వెరుస్తూ అడుగు ముందుకేశారు. జరుగుతున్న తతంగాన్ని చూస్తూ, జరగబోయే పరిణామాల్ని ఊహిస్తూ వణికింది పెళ్ళికూతురు. తండ్రి దగ్గరున్న చనువుతో మాటలు కలిపింది. ఉపోద్ఘాతం లేకుండా సూటిగా విషయాన్ని కదిపింది.

"డాడీ, అబ్బాయి వాళ్ళకు చెప్పి పెళ్ళి వాయిదా వేద్దాం. భౌతికదూరం పాటించాల్సిన సమయంలో సామూహిక కార్యక్రమం చేస్తే ఎట్లా? చికిత్స తీసుకుంటూ క్వారటైన్ కావాల్సిన వేళ, ఏమీ జరగనట్లు వ్యవహరిస్తే ఎట్ల?" అంది పెళ్ళికూతురు.

"కరోనాను అడ్డుకోవడంలో ప్రభుత్వమే ఉదాసీనంగా ఉంది. వ్యాధి నిరోధం, వ్యాధి నిర్మూలన అనే రెండు మార్గాలను వదిలింది. కనీసం కరోనా టెస్ట్‌లను కూడా పూర్తిస్థాయిలో చేయడం లేదు. దేశవ్యాప్తంగా వెలిగించిన దీపాల వెలుతురులో వలస పాదాల పగుళ్ళు కనిపించాయి. సంఘీభావ చప్పట్ల శబ్దం విని బాధితులు ఆశగా చూశారు. ఈ బహుదూరపు కాలంలో ఆరోగ్యరంగంలో నెలకొన్ని వ్యాపారాన్ని ప్రభుత్వం కట్టడి చెయ్యాలి. వైరస్ దెబ్బకు పేద, మధ్యతరగతి కుటుంబాలు పాతాళానికి పడిపోతున్నవి. సంపన్న కుటుంబాలు గజగజ వణుకుతున్నవి. కూడబెట్టిన డబ్బంతా కోవిడ్ పాలు చేయాలా? నూరు అబద్దాలాడి అయినా ఒక పెళ్ళి చేయాలంటారు. నా కూతురు పెళ్ళి కోసం ఒక్క నిజాన్ని తొక్కిపెడత. ఇక నువ్వు నాతో వాదించకు" అన్నాడు.

"డాడీ, మీరు ప్రజలను రక్షించే డిపార్ట్‌మెంట్‌లో ఉన్నారు. మీరే ఇట్ల ఆలోచిస్తే ఎట్ల?"

"బిడ్డా, నీకు లోకానుభవం లేదు. ప్రయోజనం, ప్రాణం ఈ రెంటిలో ప్రాణం అనేది ఇప్పుడు అప్రధానమైంది".

"డాడీ, మీది దుర్మార్గమైన ఆలోచన. మనం భయభక్తులను పోగొట్టుకున్నట్లే, దయ, దాతృత్వాలను కూడా పోగొట్టుకున్నాం. సమస్త ప్రాణులు జీవించడానికి కావలసిన అన్నిటిని ప్రకృతి ప్రసాదించింది. జీవజాలాలన్నీ ప్రకృతి నియమాల ప్రకారం నడుచుకుంటూ జీవిస్తున్నవి. మనిషి మాత్రం తన పరిధిని అతిక్రమించి, ప్రకృతి ప్రమాదకారిగా మారిండు. ఆడే అలవాటును సమాజం పట్ల అనుసరిస్తున్నాడు. కనుకనే మనుషుల మధ్య అపనమ్మకం, వ్యవస్థల పట్ల చిన్నచూపు, భవిష్యత్ భయం, జీవితానికి భరోసా లేకపోవడం దాపురించినవి. దేనికీ బాధ్యత వహించని తత్వంలో జీవజాలాన్ని ఊచకోత కోసినం. దానివల్ల ప్రకృతిలో సమతుల్యత లోపించి కోవిడ్ ప్రాప్తించింది. ఇకనైనా బాధ్యతగా ఉందాం. అది మనదగ్గరి నుండే ప్రారంభిద్దాం".

"ఉపన్యాసాలు ఎన్నయినా ఇవ్వవచ్చు. నీకు పెళ్ళి చేయాల్సిన బాధ్యత నాది. చాలా కష్టపడితే ఈ సంబంధం కుదిరింది. కోవిడ్ కారణంగా పెళ్ళి చెడిపోతే, నేను శాశ్వతంగా క్వారంటైన్‌లో మగ్గిపోత".

"డాడీ, చివరగా ఒక మాట. మీకు పాజిటివ్ లక్షణాలు కనపడుతున్నవి. కరోనా చిన్నపిల్లల్ని, ముసలివాళ్ళను కబళిస్తుంది. మనింట్లో 80 సంవత్సరాలు పైబడిన నాయనమ్మ ఉంది. జాగ్రత్త. ఇంతకంటే నేను చెప్పేది ఏమిలేదు".

"నేను వినేది కూడా లేదు. నేను చెప్పేది నీవు విను. అనుకున్న సమయానికి ఈ పెళ్ళి జరగాల్సిందే. ఎంగేజ్‌మెంట్ డేట్ వాళ్ళకు పంపిస్తున్న. అరేంజ్‌మెంట్స్ చూడు".

ఎంగేజ్‌మెంట్ కోసం పిల్లవానితో కలిసి పదిమందిని పిలిచారు. అబ్బాయి తరఫున ముప్పైమంది వచ్చారు. "మామూలు రోజుల్లోనైతే వందమందికి తగ్గేవాళ్ళం కాదు. అంతటి బలం, బలగం మాది" అందులో నుండి అన్నారొకరు. అది వింటూనే భౌతిక దూరం పారిపోయింది. ఎంగేజ్‌మెంట్ పూర్తయింది. పనివేగం పెరిగింది. షాపింగ్ ఒక తీరని దాహం. లంకిణిలా దుకాణం నోరు తెరిచింది. అందులోకి వెళ్ళారు. మాయాబజార్‌లో తిరిగారు. మోయలేని బరువుల్ని నెత్తికెత్తుకొని, ఖాళీ జేబుల్తో బయట పడ్డారు. ఇంటిల్లిపాదీ వస్తువుల్ని ప్యాక్ చేయడంలో మునిగారు. వరుడి తండ్రి దుప్పటి ముసుగేశాడు.

తెల్లవారింది. ఒళ్ళంతా పొగలు కక్కుతుండగా "డోలో-650 ట్యాబ్లెట్" మింగి లేని ఓపిక తెచ్చుకొని, కార్డ్స్ పంచడమనే యుద్ధానికి బయలుదేరిండు.

"అదృష్టవంతుడివి. కరోనా వల్ల పెళ్ళి ఖర్చు తగ్గింది".

"కార్డ్ ఇవ్వడానికెందుకొచ్చావు. ఫోన్ చేస్తే సరిపోతుండె".

"కార్డ్, కుర్చీలో పెట్టండి".

"కరోనా కాలంలో రిసెప్షన్ ఎందుకు పెట్టుకున్నారు?"

"మాస్క్ పెట్టుకొని మాట్లాడండి".

"శానిటైజ్ చేసి కార్డు ఇవ్వండి".

"అందరం వచ్చుడెందుకు. ఎవరమో ఒకరం వస్తం".

**ఎంగేజ్‌మెంట్ కోసం పిల్లవానితో కలిసి పదిమందిని పిలిచారు. అబ్బాయి తరఫున ముప్పైమంది వచ్చారు. "మామూలు రోజుల్లోనైతే వందమందికి తగ్గేవాళ్ళం కాదు. అంతటి బలం, బలగం మాది" అందులో నుండి అన్నారొకరు. అది వింటూనే భౌతిక దూరం పారిపోయింది. ఎంగేజ్‌మెంట్ పూర్తయింది. పనివేగం పెరిగింది. షాపింగ్ ఒక తీరని దాహం. లంకిణిలా దుకాణం నోరు తెరిచింది.**

కథ

"పెండ్లికి బస్ ఎందుకు పెట్టారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారొస్తరు"

"పెండ్లికి పిలవడానికి భార్యాభర్తలు రావాలె. ఒక్కనివే ఎందుకు వచ్చినవు"

"ఇప్పుడు ఈ ఫార్మాలిటీస్ అవసరమా. చక్కగా రిజిస్టర్ మ్యారేజ్ చేయకపోయినవా".

"అన్నా, కరోనా ఎవరికుందో తెలుస్తలేదు. నాకు ఉండొచ్చు. నీకైనా ఉండొచ్చు. బాగా తిరుగుతున్నావు జాగ్రత్త!"

"ఇంత రిస్క్ ఎందుకు. కార్డ్లను వాట్సప్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో పెట్టక పోయినవా".

కర్ణుని రథం భూమిలోకి కృంగినట్లు, మాటలన్నీ విన్నా అతని గుండె, పొట్టలోనికి జారింది. ఉదయాన్నే కాఫీ తాగి బయల్దేరాడు. మామూలు రోజుల్లోనైతే బయట ఎక్కడో ఇంత తినేవాడు. చుట్టాలో, స్నేహితులో తినడానికి పెట్టేవారు. రెండువిధాలుగా అతడు ఎండి, మాడిపోయాడు. తలనొప్పి మొదలయింది. నాలుగు సిగరెట్లతో పొద్దు గడిపాడు. ఒక్కరోజులోనే కార్డ్స్ పంచడం పూర్తయిందనిపించాడు. ఇంటికి చేరాడు. విపరీతమైన దగ్గు, ఆయాసం అతణ్ణి పట్టుకున్నవి. 'అజిత్రోమైసిన్, సి-విటమిన్, జింక్ టాబ్లెట్స్'తో కడుపు నిండింది. పరిమితంగానైనా పెద్ద పనులు జోరందుకున్నాయి. ఫంక్షన్ హాల్స్ అన్నీ మూతపడ్డాయి. అనివార్యంగా అమ్మాయి ఇంటిముందు పెళ్ళి పందిరి వెలసింది. రిసెప్షన్ హాల్ కోసం చేసిన ప్రయత్నాలు వృధా అయ్యాయి. "భయంకరమైన పాండమిక్ సిట్యుయేషన్‌లో రిసెప్షన్ వద్దు" అనే మాటను పెళ్ళికొడుకు పెడచెవిన పెట్టాడు. అబ్బాయి ఇంటి వెనక మైదానంలో వేడుక జరపాలనుకున్నారు. పెళ్ళిరోజు దగ్గర పడుతుంటే, ఇంట్లో హడావిడి ఎక్కువైంది. పదిమంది రావాల్సిన చోట ఒకరిద్దరు వచ్చారు. పిండివంటలు, పెండ్లివంటలు బయట నుండి వచ్చాయి. "పుదీన, అల్లం, వెల్లుల్లి, శొంఠి, మిరియాలు, దాల్చినచెక్క, ఏలకులు"తో తయారుచేసిన కరోనా కషాయం ఇంట్లో తయారైంది. పెళ్ళి వంటలతో పాటు కషాయం అందరికీ పోసారు. తెల్లారితే పెళ్ళి, రావాల్సినవాళ్ళు రాలేదు. పెళ్ళికొడుకును తయారు చేస్తున్నారు. రెండింతలైన దగ్గు, ఆయాసంతో తండ్రి అవస్థ పడుతున్నాడు. మంత్రోచ్చారణల మధ్య వరుడు ముస్తాబయ్యాడు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో తండ్రి ఆసుపత్రికి వెళ్ళాడు. దగ్గరివారు వరుడికి బట్టలు పెట్టే కార్యక్రమం ముగించారు. అత్యంత వేగంగా తండ్రిని హైదరాబాద్ తీసికెళ్ళండని డాక్టర్ పురమాయించాడు. "పెళ్ళి వాయిదా వేద్దామా" అనే మాట చక్కర్లు కొట్టింది. "పెళ్ళి జరిపించండి"


## మామూలు

**రోజుల్లోనైతే బయట ఎక్కడో ఇంత తినేవాడు. చుట్టాలో, స్నేహితులో తినడానికి పెట్టేవారు. రెండువిధాలుగా అతడు ఎండి, మాడిపోయాడు. తలనొప్పి మొదలయింది. నాలుగు సిగరెట్లతో పొద్దు గడిపాడు. ఒక్కరోజులోనే కార్డ్స్ పంచడం పూర్తయిందనిపించాడు. ఇంటికి చేరాడు. విపరీతమైన దగ్గు, ఆయాసం అతణ్ణి పట్టుకున్నవి. 'అజిత్రోమైసిన్, సి-విటమిన్, జింక్ టాబ్లెట్స్'తో కడుపు నిండింది. పరిమితంగానైనా పెద్ద పనులు జోరందుకున్నాయి.**


అంటూ ఒకరిద్దరు సన్నిహితుల్ని తీసుకొని తండ్రి హైదరాబాద్ వెళ్ళిండు. ఆసుపత్రిలో అతడు ఆక్సిజన్ గ్రహిస్తే మండపంలో ఇతడు పాణిగ్రహణం చేసాడు.

పెళ్ళి అయ్యాక రెండు రోజులకు, అమ్మాయి ఇంట్లో హడావిడి మొదలయింది. ఆరోజు రాత్రి అమ్మాయి నాయనమ్మను దగ్గు, దమ్ము విపరీతంగా పీడించాయి. అంతవరకు పెళ్ళి పనులపై దృష్టి కేంద్రీకరించినవారు, అనివార్యంగా ముసలమ్మను పట్టించుకోవాల్సి వచ్చింది.. తప్పనిసరి ఆసుపత్రికి కదలాల్సి వచ్చింది. అంబులెన్స్‌లో ఆమెను, ఆరాత్రి అనేక హాస్పిటల్స్‌కు తిప్పారు. ఎక్కడా ఎవరూ జాయిన్ చేసుకోలేదు. రోగికి 'రాపిడ్ టెస్ట్' చేయాలి. కరోనా ఉందో లేదో తెలియాలి. అంతవరకు పేషెంట్‌ను జాయిన్ చేసుకునేది లేదు" అనే మాట ప్రతిచోటా వినిపించింది. తప్పనిసరై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ "కోవిడ్ - నాన్ కోవిడ్" పేషెంట్స్ కలగలిసి ఉన్న వార్డులో ఉంచారు. 'కరోనా టెస్ట్' చేశారు. టెస్ట్ రిజల్ట్ రావడానికి రెండురోజులు పడుతుంది. రోగికి న్యూమోనియా ఉంది. పల్స్ ఆక్సీమీటర్ రీడింగ్ 92% చూపెడు






తుంది. అంతవరకు ఈమెకు 'ఆక్సీజన్' పెడతాము. అని వైద్యం మొదలుపెట్టారు. వ్యాధి తీవ్రమై ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్ళను అతడు చూశాడు. అయినా చలించలేదు. ఇప్పుడు తల్లి పరిస్థితి భయాన్ని కలిగించింది. విధి నిర్వహణలో భయంకరమైన, అమానవీయమైన దృశ్యాలను, సంఘటనలను అతడెదుర్కొన్నాడు. పక్క బెడ్‌లోని పేషెంట్ తన కొడుకుతో "నాయనా, ఈ దావఖానల నుంచి వేరే దావఖానకు నన్ను తీసుకపో. ఇక్కడ మెడ మర్లుతలేదు" అనడం విన్నాడు. గత వారం నుండి ఓపిక చేసుకొని భరిస్తున్న టెన్షన్ ఇప్పుడు తీవ్రమైంది. ధృడచిత్తుడైన అతడిని హైపర్ టెన్షన్ అతలాకుతలం చేసింది. కాసేపు కళ్ళు మూసుకున్నాడు. "తనను తాను స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. బయట చెట్టు కింద, చల్లటి గాలిని అనుభవిస్తున్నాడు. "అమ్మ ఆరోగ్యంగా బతికింది. వృద్ధాప్యంలో కరోనాకు చిక్కింది. బయటపడాలి. బయటపడాలి. పడకుంటే? పడకుంటే...?? పడకుంటే చావాలి. కాని చస్తూ బతకకూడదు" అనుకున్నాడు. అప్పుడతని కళ్ళలోకి కాంతి చేరింది.

"అన్నా, నమస్తే. ఇక్కడ ఎందుకున్నావు?" పరిచయస్తుడి పలకరింపు.

"అమ్మకు ఆరోగ్యం బాగాలేదు. కరోనా సోకిందనే అనుమానంగా ఉంది".

"టెస్ట్‌లో తేలిందా, నువ్వే అనుకుంటున్నావా"

"ఇంకా తేలలేదు. నేనే అనుకుంటున్నా"

"నువ్వేమీ అనుకోకు. కరోనా చావులు తక్కువనే ఉన్నాయి. భయమే ఎక్కువుంది. ఈ సమయంల ముసలోళ్ళు పిట్టల్లెక్క రాలుతున్నారు. వాళ్ళకు పెయ్యిల ఏదో ఒక రోగం ఉంటది. దీంతోటి అది ఎక్కువై చస్తరు. కరోనాతోటి చచ్చిన పేరు వస్తుంది".

"నువ్వెందుకు వచ్చినవు తమ్మీ"

"బాపుకు కరోనా అని తేలింది. ఇప్పటికి వారం రోజులైతుంది. డాక్టర్లు కష్టపడుతున్నారు. వాళ్ళ చేతుల ఏం ఉంటది. ఎనభై ఏండ్లు దాటినయి. నాకు నమ్మకం లేదు. ఇవ్వాళనో, రేపో అనిపిస్తుంది".

"చనిపోతే ఇంటికి తీసుకపోతవా".

"కరోనా శవాల్ని ఇంటికి తీసుకపోనీయరు. ఒకవేళ బాపు చనిపోతే, నేను ఇక్కడే ఉన్న కనుక, నిప్పు పెట్టే అవకాశం నాకు ఇస్తరు. వీళ్ళ ఆధ్వర్యంలో కాలపెడితే మన సంప్రదాయం ప్రకారం "బూడిద ఎత్తిపోసుడు, బొక్కల్ని గంగల కలుపుడు" అనే వాటికి అవకాశం ఉండదు. ఈ పదిరోజుల్లో అనాధ శవాల్ని, కోవిడ్ శవాల్ని కాలపెట్టుడు, ఖననం చేసుడు చూసిన. అనుకుంటాం గాని ఎవలకెవలన్నా" అంటూ నిట్టూర్చిండు.

రాత్రి భారంగా గడిచింది.

తెల్లవారింది. ముసలమ్మ బిడ్డ వచ్చింది. "అమ్మకెట్లుందిరా?" అంది. ఇద్దరు కలిసి బెడ్ వద్దకు వెళ్ళారు.

"అమ్మ పరిస్థితి బాగాలేదు. ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళదాం" అంది.

"కనీసం పదిలక్షలు అయితయి. దక్కుతదని నమ్మకం లేదు".

"అయినా ఫరవాలేదు. ప్రయత్నం చేద్దాం".

అతడు తనకు తెలిసిన వాళ్ళద్వారా ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యానికి ఫోన్ చేయించాడు. యాజమాన్యం అంగీకరించింది. ముసలమ్మకు అంబులెన్స్‌లోనే ఆక్సిజన్ అరేంజ్ చేసి, ప్రభుత్వాసుపత్రి నుండి ప్రైవేట్ ఆసుపత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో ముసలమ్మ కళ్ళు తెరిచింది. కండ్లారా కొడుకును, బిడ్డను చూపించి కన్ను మూసింది. అతనికెందుకో అనుమానమొచ్చింది. అంతలోనే ఆసుపత్రిలోకి అంబులెన్స్ ప్రవేశించింది. డాక్టర్ చూసి పెదవి విరిచింది. కూతురు గొల్లుమంది.

"అక్కా, ఏడవకు. అమ్మ మనకు దక్కింది".

"ఎట్లా"

"గవర్నమెంట్ హాస్పిటల్‌లో చనిపోతే శవం మనకు ఇవ్వకపోయేవారు" అన్నాడు.

శవాన్ని తీసుకొని ఇంటికి బయల్దేరారు. ముసలమ్మ చనిపోయిందనే విషయం వాళ్ళకంటే ముందే వాడలో వ్యాపించింది. శవం ఇల్లు చేరింది. అప్పటికే అక్కడికి కార్పొరేటర్ వచ్చాడు.

"శవాన్ని ఇంటికి ఎందుకు తెచ్చారు సర్" అడిగిండు.

"మా ఇంటికి మేం వచ్చినం. ఈ ఇల్లు, మా అమ్మ దగ్గరుండి కట్టించింది. అమ్మకు కరోనా నిర్ధారణ కాలేదు".

"మీ అమ్మ కరోనా పేషెంట్. వాడోల్లందరు ఆబ్జక్షన్ చేస్తున్నారు. త్వరగా ఇక్కడినుండి తీసుకెళ్ళండి" తొందర పెట్టిండు కార్పొరేటర్. శవం

అంబులెన్స్ నుండి వెహికిల్లోకి మారింది. శ్మశానానికి వెహికిల్ వెళ్ళింది. అక్కడంతా సందడిగా వుంది. ఒకవైపు చితులు కాలుతున్నాయి. మరొకవైపు ఎత్తని బూడిదరాశులు కొలువుదీరినయి. వీళ్ళ వెహికిల్ లైన్లో నిలబడింది. గంట గడిచింది. శ్మశాన ఉద్యోగి వచ్చిండు.

"ఖాళీ జాగలు లేవు" అన్నాడు.

"ఎంత సేపైనా ఫరవాలేదు"

"రేపటిదాకా జాగ దొరకది"

"మరెట్ల"

"వేరే జాగలకు పొండ్రి"

"ఎక్కడో చెప్పు"

అడ్రస్ తెలుసుకొని వెహికిల్ వేరేచోటుకు బయల్దేరింది. కొడుకులు, కోడండ్లు, బిడ్డలు, అల్లుండ్లు, మనుమలు, మనుమరాండ్లు, బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కలవాళ్ళు బోలెడంత బలగం ఉన్న ఆ శవం ఒంటరిగా శ్మశానానికి బయల్దేరింది. కాసేపటికి నామరూపాలు లేకుండా పోయింది. ఇల్లు బెంగటీలింది. పెళ్ళిసందడి, శ్మశాన నిశ్శబ్దంగా రూపాంతరం చెందింది. ఒక బరువు దిగింది అనుకున్న వేళ మరో బరువు అతని నెత్తిన చేరింది. జరిగిన అంత్య క్రియలకు సామాజిక ఆమోదం దొరికింది. జరగాల్సిన కర్మకాండ భయపెట్టింది. పెళ్ళికి లేని పట్టింపులు కర్మకాండవరకు వచ్చేసరికి వచ్చిపడుతవి. మాతృభక్తికి సానుభూతి తోడై ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కర్మకాండ తంతులో ఏ చోట, ఏది తక్కువైనా ఆత్మకు పరలోక ప్రాప్తి జరగదని బెదిరిస్తుంటరు. పదమూడు రోజుల కార్యక్రమాల్లో అయ్యవార్ల ఆధిపత్యం స్పష్టంగా కనపడుతుంది. ప్రతీచోట వ్యాపారం.

సంభావన రూపంలో నాట్యమాడుతుంది. మూడవరోజు అస్థికలు నిమజ్జనం, పదవరోజు దశావహము, పదకొండు సహపంక్తి భోజనం, పన్నెండు తొళక్కము, పదమూడు పరమపదోత్సవం, ఇలా కార్యక్రమాలు వరుసగా కుమారుని చేతులమీదుగా జరగాలి. ఆ విషయాలన్నీ గుర్తుకొచ్చి అతడు కుదేలయ్యాడు. రావాల్సిన వారెవరు కరోనా భయంతో ఏరోజూ రాలేదు. జరగాల్సినవన్నీ శాస్త్రోక్తంగా జరిగాయి. ఇరవైమంది కంటే ఎక్కువ కాకుండా శ్రాద్ధకర్మలు జరిగాయి. చావుకూడా పెళ్ళిలాగే బోసిపోయింది. చివరిరోజు చావు విందు పూర్తయ్యాక ఆశీర్వాదం అందజేసి అందరు వెళ్ళిపోయారు. కొత్త వియ్యంకుడు మాత్రం బలవంతంపైన ఉండిపోయాడు. ఆరోజు వియ్యంకులిద్దరు మందు, మాంసం ముందు పెట్టుకొని కూర్చున్నారు. ఒక రౌండ్ పూర్తయింది.

"బావా, నువ్వు గొప్పోనివి"

"అట్ల, ఎందుకంటున్నారు"

**ఇల్లు బెంగటీలింది. పెళ్ళిసందడి, శ్మశాన నిశ్శబ్దంగా రూపాంతరం చెందింది. ఒక బరువు దిగింది అనుకున్న వేళ మరో బరువు అతని నెత్తిన చేరింది. జరిగిన అంత్య క్రియలకు సామాజిక ఆమోదం దొరికింది. జరగాల్సిన కర్మకాండ భయపెట్టింది. పెళ్ళికి లేని పట్టింపులు కర్మకాండవరకు వచ్చేసరికి వచ్చిపడుతవి. మాతృభక్తికి సానుభూతి తోడై ఉక్కిరిబిక్కిరి**

"పదిహేను రోజుల వ్యవధిలో పెండ్లి-చావు రెండు చేయగలిగినవు"

"మన చేతుల ఏముంది బావా. అంతా దైవేచ్ఛ"

"ఇవి మాత్రం నీ చేతులమీదుగానే జరిగినవి"

"తప్పదు కదా"

"ఇవి రెండూ నీ కనుసైగల ద్వారానే జరిగినవి"

"కావాలని కోరుకున్నది పెళ్ళి. హఠాత్తుగా సంభవించింది మరణం"

"బావా, నువ్వు గట్టోనివి. ఇమ్యూనిటీ ఉన్నోనివి. కరోనా నిన్ను ఏమీ చేయలేదు. మీ అమ్మను కాటేసింది. నన్ను కాటివరకు తీసికెళ్ళింది. నాకు నేలపై నూకలు ఉన్నవి కనుక బతికి బయటపడ్డాను".

"అది మా అదృష్టం".

"కావచ్చు. ఎంగేజ్మెంట్కు మీ ఇంటికి వచ్చి, మీతో కలిసి షాపింగ్ చేసి ఇంటికి వెళ్ళాకనే, నా ఆరోగ్యం చెడిపోయింది. అంతకుముందే నీకు కరోనా సోకిందని తెలిసింది. అది నాకు పాకింది. నన్ను పెళ్ళికి దూరం చేసి, బెడ్కు దగ్గర చేసింది. దేవుని దయనో, నా అదృష్టమో మాకు ఆర్థిక నష్టం జరిగింది కానీ, ప్రాణనష్టం జరగలేదు. మీకు మాత్రం ప్రాణ నష్టం జరిగింది. సుఖం వస్తే దాచుకోవాలె, రోగమొస్తే చెప్పుకోవాలె. నువ్వు అందుకు వ్యతిరేకంగా నడిచినవు".

"బావా దాసుని తప్పులు దండంతో సరి" అంటూ మోకరిల్లాడు.

"నిన్నెప్పుడూ పశ్చాత్తాపం దహించలేదా?"

"బావా పెళ్ళిపని మంచిదే. కాని కాలం వల్ల చేసిన పని తృప్తి కలిగించలేదు. దొంగతనం చేసిన భావన కుదిపింది. దానికి తోడు అమ్మ చావు నావల్లే జరిగిందనే బాధ పీడిస్తుంది" అంటూ బోరుమన్నాడు.

"సరేలే. జరిగినదాంట్లో ఇద్దరి తప్పు ఉంది. బాధ్యతలు మనతో నాటకం వేయించాయి. బంధాల సంకెళ్ళు మన ఆలోచన్లను కట్టడి చేశాయి.

"మనం స్వార్థపరులం బావా"

"అభివృద్ధి పేరిట ప్రకృతిని నాశనం చేస్తూ పోయేవారిని ఏమనాలి? నాశనం నుండే వైరస్లు పుట్టుకొస్తున్నాయి. వాటివల్లే ఈరోజు అన్నీ తెలిసిన మనం తలకిందులుగా ఆలోచించి పనులు చేశాం".

"నాకైతే లోకమంతా తలకిందులుగా నడుస్తున్నట్టనిపిస్తుంది బావా!"

అప్పటికి నాలుగో రౌండ్ పూర్తయింది. అక్కడ ఇద్దరే ఉన్నారు. మందు వాళ్ళతో మాట్లాడిస్తుంది. ఒప్పుకోలు మాటలు తడితడిగా, ముద్దముద్దగా వస్తున్నాయి.



# ప్రజ్ఞాపూర్



నాంపల్లి సుజాత, 98480 59893

బస్సింకా ఆగనే లేదు
బిలబిల మంటూ వచ్చి వాలాయి
మక్కబుట్టలతో
మసిబారిన సీతాకోకల చేతులు

కిటికీల చుట్టూ
చూపులు సారిస్తూ..
'లాతెయ్. లాతెయ్..
పదికోటి.. పదికోటి.. పదికోటి
వేడివేడి కంకులంటూ'
ఒక్కసారిగా
ఎడారి కోయిలల రొదలు

మక్క కంకుల పరిమళం
ముక్కు పుటాలను సోకీ..
చిన్నప్పుడెప్పుడో
తంపి పెట్టి కంకులు కాల్చిచ్చిన
మా తాతే 'సుజవ్వా'.. అంటూ..
నా కళ్ళముందిప్పుడు.

నిముషమన్నా
ఆగని నిదుర బస్సుల తొవ్వన
నీరెండలా
తళుక్కున మెరిసీ జారిపోయే ఊరే
ప్రజ్ఞాపూర్
పంట కాలమేదైనా..
పచ్చల రాసులకు నెలవైన తొవ్వే
ప్రజ్ఞాపూర్
వచ్చిపోయే వాహనాలనూరిస్తూ
ఉడుకుడుకుగా కడుపునింపే పల్లెతల్లే
ప్రజ్ఞాపూర్

ఓ తెరచుకున్న కిటికీ
కాల్చిన కంకుల గుత్తుల్లోంచి
వేడివేడి పొత్తునెంచుకుంది
చిల్లర వెతికేంతలో
వేగం పుంజుకుంది వాహనం
ఆ వెనకే..
నిట్టూర్పుల పరుగుల దృశ్యం
ద్రవించిన హృదయంతో
సమయ పాలకుడిని నిందిస్తాం.. !

చలువ కారుల్లో షికార్లు
కొందరివైతే..
ఎండ తొవ్వన రాలే
చెమట బింధువులు మరెందరివో
ఎత్తు పల్లాల తొవ్వ
ఇంకెప్పటికి చదునెక్కేనో!
పేదరికంలోనే
పుట్టి పెరిగిన ఈ విసనకర్ర
నిత్య నిప్పుల కొలిమిలో
మాడి మసిబారిన  ఓ ఎనగర్ర..!!

# పని చేస్తూ పోవడమే మన కర్తవ్యం

## - ఆచార్య వెలుదండ నిత్యానందరావు

ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమీక్షకుడు, పీఠికాకారుడు, వ్యాస రచయిత, విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఇలా ఎన్ని పాత్రలు పోషించినా లోకం మాత్రం ఆయన్ని పరిశోధకుడిగానే గుర్తించింది. ఆయన కూడా "ఆచార్యుడు" అనడం కన్నా "పరిశోధకుడు" అంటేనే సంతోష పడతాడు. వ్యక్తిగా సౌమ్యుడు. వివాద రహితుడు. హాస్య చతుర సంభాషణా ప్రియుడు. నిత్య సంతృప్త శీలుడు. అవ్యాజంగా శిష్యులను అక్కున చేర్చుకునే వాత్సల్య హృదయుడు. ఆనందం, ఆలోచన, అధిక్షేపం, నూతన సమాచారం, సరికొత్తసూచనలతో మార్గదర్శకత్వంతో అలరారే రచనా వ్యాసంగం ఆయనకే సొంతం. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో మూడు దశాబ్దాల అధ్యాపకత్వం నుంచి మరో నాలుగు నెలల్లో విశ్రాంతి తీసుకోబోతున్న సందర్భంలో నిత్యానందరావుగారితో "తంగేడు" ముఖాముఖి.



**ముందుగా షష్టిపూర్తి దశకు చేరుకున్నందుకు అభినందనలు. ఈ సంవత్సరం మీ సమగ్ర రచనలు వస్తున్నాయని వింటున్నాము**

ఈ ఆగస్టులో నాకు "స్వీట్ సిక్స్టీ పూర్తి" జరుగుతుంది. నేను పుట్టిన శుభకృత్ శ్రావణ శుద్ధ నవమిని తిరిగి ఈ ఆగస్టులో చూడబోతున్నాను. ఆంగ్లేయులకు కాలం ఒక సరళరేఖ. సిల్వర్ జూబ్లీ (25 ఏళ్లు), గోల్డెన్ జూబ్లీ (50 ఏళ్లు), డైమండ్ జూబ్లీ (75 ఏళ్ళు) ఇత్యాదిగా జరుపుకుంటారు. మన కాలమానం వర్తులం. మన పుట్టిన తేదీ, నెల, సంవత్సరం 60 ఏళ్లకు తిరిగి రావడం ద్వారా ఒక ఆవృత్తి (వలయం) పూర్తి అవుతుంది. జీవితంలో ఇది ఒక సారి మాత్రమే సంభవిస్తుంది. ఔద్యోగిక, కౌటుంబిక బాధ్యతలు, ఆరాటాలు, పోరాటాలు, అసంతృప్తులు వీటన్నింటి నుండి క్రమేపి ఉపసంహరింపబడుతూ ఒక ప్రశాంత స్థితిలోకి మనిషి రావాలన్నది ఆంతర్యం.

**మీ సంపుటాల గురించి చెప్పండి.**

1978 నవంబర్ నుండి నిరంతరం రాస్తున్నాను. దాదాపు చిన్నవి, పెద్దవి 2500 దాక రాశాను. వాటిలో కొన్ని మాత్రమే పుస్తకాల రూపంలో వచ్చాయి. కరోనా మహమ్మారి ఎంత విలయ తాండవం చేసిందో మీకు తెలుసు, కానీ చాలామందికి ఒక ఏకాంతాన్ని, తీరికను కల్పించి తాము చేయదలచుకొని చేయలేకపోయినవాటికీ, తమ అభిరుచులకు, ఆనందాలకు కార్యరూపం

ముఖాముఖి

ఇచ్చేలా దోహదం చేసింది.

దాదాపు 3500 పుటలు కరోనా కాలంలో డి.టి.పి చేయడం, అచ్చు తప్పులు సరిదిద్దడం చేశాను. ఏడు సంపుటాలలో దాదాపు తొమ్మిది లక్షల ఖర్చుతో సమగ్ర సాహిత్యం తెస్తున్నాను 1. అనుభూతి అన్వేషణ (సమీక్షలు-పీఠికలు) 600 పుటలు 2. అక్షరమాల సాహితీ ప్రముఖుల వ్యక్తిత్వ సాహిత్య సౌరభాలు 660 పుటలు. 3. వాగ్దేవి వరివస్య భాషా సాహిత్య వ్యాసాలు 612 పుటలు. వీటిని ఇప్పటిదాక వెలువరించాను. సాహిత్య ప్రముఖులు, శ్రేయోభిలాషులు అందరూ హర్షిస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. తక్కిన నాలుగు సంపుటాలు ఈ జూలై చివరి వరకు తీసుకురావాలన్నది నాపూనిక. ఇవి ప్రధానంగా పరిశోధనాత్మక, సమాచారాత్మక రచనలు. కొత్త విషయాలను, అప్రసిద్ధ అంశాలను అందుబాటులోకి తెచ్చేవి.

**మీకు బాగా పేరు తెచ్చి పెట్టిన గ్రంథం.**

"విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన". మనకు ఎంతసేపు కూడా కాలక్రమ సూచికలు, అకారాది సూచికలు ఉంటాయి. వాటి స్వభావం వేరు. పరిశోధక విద్యార్థులకు విషయానుగుణ సూచికలు కావాలి. మేం పరిశోధన చేసేటప్పుడు అలాంటివి లేవు. ఏ యూనివర్సిటీలో ఏం జరిగిందో అనే కాదు, అదే యూనివర్సిటీలో ఎవరు దేని మీద చేశారన్నది కూడా తెలియక పోయేది. వివిధ విశ్వవిద్యాలయాల్లోని ఆనాటి సీనియర్ ఆచార్యుల ప్రోత్సాహంతో, ఆశీస్సులతో 1988లో మొదటిసారి, 1996లో రెండవసారి చిన్నగా వేశాను. 2013లో 5250 ఎంఫిల్, పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాల వివరాలతో 600 పుటల బృహత్ గ్రంథాన్ని వెలువరించాను. నవల, నాటకం, దళిత, జానపద, గిరిజన సాహిత్యాలు ఇలా ఏ రంగం తీసుకుంటే, ఆ రంగంలో వచ్చిన పరిశోధనల వివరాలు ఒక్క సెకండ్‌లో దొరికే విధంగా తయారుచేశాను. ఆనాటి



నుండి పిహెచ్. డి ప్రవేశాల ఇంటర్వ్యూలలో, పరిశోధకుల్లో, పర్యవేక్షకుల్లో నా నామస్మరణం, నా గ్రంథ సందర్శనం తరచూ జరుగుతుంది. ఇంతకన్నా నాకు ప్రత్యేక గుర్తింపు మరేముంటుంది?

దీనికి పొడిగింపుగా "పరిశోధన వ్యాసమంజరి" పేరుతో రెండు సంపుటాలు తెచ్చాను. వీటిలో 145 సిద్ధాంత గ్రంథాల స్థూల పరిచయాలు ఉన్నాయి. వీటి లక్ష్యం పరిశోధకులకు ఆసక్తిని, విషయ జ్ఞానాన్ని పెంచి మార్గదర్శనం చేయడానికే. నీవు (అట్టెం దత్తయ్య) "సారాంశం" పేరుతో రెండు సంపుటాల్లో పరిశోధన గ్రంథాల పరిచయవ్యాసాలను వేస్తున్నావు కదా! అట్లాగే సాహిత్య అకాడమీ కోసం దాదాపు పదహారు వేల తెలంగాణ గ్రంథాలతో సూచిక తయారు చేశావు కదా! ఇవన్నీ ఓ తీరుగా నా ప్రభావానికీ, నా ప్రణాళికల కొనసాగింపునకు నిదర్శనమే నని నేను సంతోషిస్తున్నాను. ఒక చోట జ్ఞాన ప్రవాహం ఆగిపోకుండా, ఒక తరం నుంచి మరొక తరానికి అందించడం, ఉన్నత/ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పడానికి పాటుపడడమే మనం చేయవలసింది

**మీరు జీవిత చరిత్రల మీద కూడా కృషి చేశారు కదా....**

వందేమాతర గీతాన్ని రాసి చరిత్రలో చిరస్మరణీయుడైన బంకించంద్ర చటర్జీ సాహిత్య విశ్లేషణ చేస్తూ స్వతంత్ర గ్రంథం తెలుగులో లేకపోవడం నన్నెంతో బాధించింది. "భారతీయ జ్వలిత చేతన బంకించంద్ర" పేరుతో 2005లో రాసింది ఒక ప్రామాణిక స్వతంత్ర విశిష్ట గ్రంథంగా మన్ననలందుకొంది. బంకించంద్ర చటర్జీ గురించి తెలుగువారికి తెలియని ఎన్నో అపూర్వాంశాలను పొందుపరిచాను. ఇది నాకు చాలా ఇష్టమైంది. నా రచనల్లో శిఖర ప్రాయమైంది. అయితే "విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన" గ్రంథం విద్యార్థులకు ఉపయోగపడడం వల్ల నాకు పేరొచ్చింది. కానీ నాశక్తి సామర్థ్యాలు, భావుకత, శైలీవిన్యాసం బాగా ప్రదర్శితమైన బంకిం చంద్ర గ్రంథమే నాపట్ల గీటురాయిగా నిలిచేది.

తెలంగాణ ఉద్యమం సందర్భంగా రాజనీతిజ్ఞుడు బూర్గుల రామకృష్ణారావు జీవిత చరిత్ర ప్రకటించాను.

**మీరు రాసిన జీవితపరిచయాత్మక వ్యాసాల సంగతి?**

షష్టిపూర్తులు, పదవీవిరమణలు, జయంతులు, వర్ధంతులు ఇలా వివిధసందర్భాలకు జీవిత పరిచయాత్మక వ్యాసాలెన్నో రాశాను. అవన్నీ నా 'అక్షరమాల' సంపుటంలో వున్నాయి. తెలుగుశాఖ చరిత్రకు సంబంధించిన

ముఖాముఖి

ఎన్నో అపూర్వ అంశాలను చెప్పాను. పరిశోధన అంటే అంతవరకు లేనిది మనం చేర్చడమే. చెదురుమదురుగా ఒక రూపం లేకుండా ఉన్నదాన్ని ఒక చోటికి తెచ్చి ఒక ఆకృతి కల్పించడమే.

**మీరే ప్రథమంగా చెప్పాననుకొనే వ్యాసాల సంగతి చెప్పండి?**

ఉస్మానియా విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ప్రిన్సిపల్ రాస్ మసూద్, వైస్ ఛాన్సలర్ ఎం. ఎస్ దొరైస్వామి, 1950లో తెలుగు శాఖలో పనిచేసిన లెక్చరర్ వి. వి.రాఘవశర్మ, తొలి తెలుగు విద్యార్థి పల్లా దుర్గయ్య, రెండవ విద్యార్థి ఈటూరి లక్ష్మణరావు, తెలుగు ప్రథమ విద్యార్థిని ఇల్లిందలసుజాత, స్వాతంత్ర్య సమర యోధుడు కాటం లక్ష్మినారాయణ ఇలా ఎన్నో వ్యాసాలు రాశాను. ఏది రాసిన అధికార పత్రాలనుంచి ఆధారాలు సేకరించి ప్రామాణికంగా రాయడానికి ప్రయత్నం చేశాను. సమాచార సేకరణ కోసం, నిర్ధారణ కోసం ఎంతో శ్రమ పడవలసి వచ్చింది. ఎందరినో కలవవలసి వచ్చింది. కొత్త విషయం ఏది తెలిసినా నేను పులకించిపోతాను. ఇష్టపడి చేశాను కనుక కష్టమనే భావన రాలేదు. ఓపిక ఉండాలి. ఎలా ప్రశ్నలు వేసుకోవాలి ఎలా సమాధానాలు రాబట్టుకోవాలి అన్న అవగాహన ఉండాలి. అన్నింటికీ మించి మనం చేస్తున్న పనిని ప్రేమించాలి, గౌర వించాలి. ఈ రోజు ఇది లోపించిందేమో అన్న భావన పెరుగుతుంది.

**మీరు పూర్వ తరానికి, తరువాతి తరానికి, వర్తమాన తరానికి వారధిలాంటి వారు అంటారు కదా...**

ప్రశ్న తమాషాగా ఉంది. బాగుంది. అయితే కావచ్చునేమో!. నేను 1983లో ఎం.ఎ.లో చేరాను. ఆపైన 1990లో పిహెచ్.డి ముగిసింది. అంటే 1983-90 ఈ ఏడేళ్ళకాలంలో బి. రామరాజు, సి. నారాయణ రెడ్డి కె గోపాల కృష్ణ రావు, పి. యశోదారెడ్డి, నాయని కృష్ణకుమారి, వేటూరి ఆనందమూర్తి, కులశేఖర రావు లాంటి పెద్ద తరంవారు రిటైరయ్యారు. నేను ఒక్క ఉస్మానియాకే పరిమితమైన వాడిని కాదు, జి.వి. సుబ్రహ్మణ్యం, కేతవరపు రామకోటి శాస్త్రి, పేర్వారం జగన్నాథం, కోవెల సుప్రసన్నాచార్య, సంపత్ కుమార, కొర్లపాటి శ్రీరామమూర్తి, ఎస్.వి జోగారావు, శలాక రఘునాథ శర్మ, కొలకలూరి ఇనాక్ లాంటి ఇతర విశ్వవిద్యాలయాల వారందరితో కూడా నాకు సంబంధం ఉండేది. నా పట్ల వారంతా అపారమైన వాత్సల్యం ప్రదర్శించేవారు. ముదిగొండ శివప్రసాద్, ఎస్.వి రామారావు, ఎన్.గోపి, ఎల్లూరి శివారెడ్డి, సుమతీ నరేంద్ర, కసిరెడ్డి, తంగెడకిషన్ రావు, ఎస్వీ సత్యనారాయణ లాంటి ఉస్మానియా మధ్యతరం వారితో కలిసి పనిచేశాను. కొందరికి విద్యార్థిని కూడా. వారే కాక హరిశివకుమార్, రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, కే. మలయవాసిని, వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, హెచ్.ఎస్. బ్రహ్మానంద లాంటి ఇతర విశ్వవిద్యాలయాలవారందరితో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఉస్మానియా తెలుగుశాఖలో చివరగా రిటైర్ అయిన మసనచెన్నప్ప గారి కన్నా ఏడున్నరేళ్ళు నేను చిన్న. ఇప్పుడున్న వారి కన్నా నేను ఏడేళ్ళు పెద్ద వాడిని. కనుక మీరన్నది కరెక్టే.

**వయసుతో నిమిత్తం లేకుండా అన్నితరాలవారి అభిమానాన్ని చూరగొన డంలో మీ విజయరహస్యమేమిటి?**

ఇది నిజంగా నా అదృష్టమే. చీమకుర్తి వెంకటేశ్వరరావు, బొమ్మకంటి శ్రీనివాసాచార్య, పొత్తూరి వెంకటేశ్వరరావు, ముదిగొండ వీరభద్రశాస్త్రి లాంటి పెద్దలు నాపట్ల సుధాసదృశమైన ఆత్మీయతను కురిపించేవారు.

బి.రామరాజు, సి.నారాయణరెడ్డి లాంటి పెద్దలు ఎక్కడ కనిపించినా "ఏం పరిశోధక! ఏం రాస్తున్నావ్" అని ఆత్మీయంగా పలకరించేవారు. చేకూరి రామారావు వెల్చేరు నారాయణ రావులు ప్రశ్నలు వేసుకునే నైపుణ్యం, ఆలోచించ గలిగే తీరు నేర్పడంతో పాటు సాహిత్య స్ఫూర్తి కలిగించారు. ఉస్మానియాతో సహా అన్ని విశ్వవిద్యాలయాలవారితో నా వయసు వారితో, నాకంటే చిన్న వారితో ఆత్మీయమైన అనుబంధం ఉంది. విద్యార్థులతో సత్సంబంధాలే ఉన్నాయి. సర్దుబాటు, సంయమనం, ప్రేమతత్వం, ఏమీ ఆశించక పోయే లక్షణం, ప్రతిదానిలోను వేలుపెట్టాలనుకోకపోతే చాలు స్నేహాలకు ఎలాంటి విఘాతాలు కలుగవని విశ్వసిస్తాను.

**మీ కళాశాల జీవితాన్ని గురించి చెప్పండి?**

నాగర్ కర్నూలు జిల్లా మంగనూరు గ్రామంలో పదవ తరగతి దాకా చదివాను. టెన్త్ క్లాస్ నాటికే చాలా పుస్తకాలు చదివాను. తర్వాత పాలెం ఓరియంటల్ కళాశాలలో 1978లో చేరాను. శ్రీ రంగాచార్య, మామిడన్న సత్యనారాయణ మూర్తి, కపిలవాయి లింగమూర్తి లాంటి దిగ్గంతులైన గురువుల ఒడిలో పెరిగిన వాడిని. ఇంకా చెప్పాలంటే అందరం ఒకే ఇంట్లో కలిసిమెలిసి ఉండే వాళ్ళం. ఆ గురువుల సాహచర్యంలో రచయితగా నన్ను నేను తీర్చిదిద్దు



ముఖాముఖి

కున్నాను. అలా మొదలైన రచనా వ్యాసంగం హైదరాబాద్ వచ్చాక మరింత అభివృద్ధి చెందింది. అప్పుడు అక్కడే కేవీ రమణాచారి ఆర్డీవోగా నియమితులయ్యారు. ఆయన ప్రభావం నా మీద బాగా ప్రసరించింది. అవధులు లేని వారి వాత్సల్యం, పరిధులు దాటని నాప్రవర్తన గత 40 ఏళ్లుగా మాస్నేహాన్ని పచ్చగా ఉంచింది.

స్వతహాగా నాది అకడమిక్ చైతన్యం. ఉద్యమ చైతన్యం కాదు. తెలంగాణ కోసం మా తెలుగుశాఖ అధ్యక్షులు, ఇప్పటి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు కిషన్ రావు తెలుగుశాఖ పక్షాన ఒకరోజు నిరాహార దీక్ష చేశాం. చాలా మంది తెలంగాణవారి గురించి రాశాను. సాహిత్య అకాడమీ తరపున తూము రామదాసు ఆంధ్ర పదవిధానం పద్యరూపనిఘంటువు, జనగామ దగ్గరున్న బచ్చన్నపేట చెందిన వెంకట రామరాజు రాసిన రామకృష్ణ యుధిష్ఠిర సంవాదం మూడర్థాల సంస్కృత కావ్యం ప్రకటించే అవకాశం కలిగింది.

**అకడమిక్ చైతన్యానికి ఉద్యమ చైతన్యానికి ఏమిటి తేడా...**

ఉద్యమ వాదులు తమ నమ్మకాలను ఎంత బలంగా విశ్వసిస్తే అంత బలంగా కృషి చేస్తారు. అది పాక్షికసత్యమైనా సరే. పది మందిని ఉత్తేజ పరుస్తారు. కార్య సాధకులవుతారు. అకడమిక్ చైతన్యశీలి ఏ ఒక్క వ్యతిరేకాంశం దొరికినా నిశితంగా, నిదానంగా పరిశీలిస్తాడు.

ప్రతిదీ కాలపరిణామంలో భాగం. చారిత్రక కారణాలు ఉన్నాయి. ఆంధ్ర తెలంగాణ కలువడంతో అభివృద్ధితో పాటు నష్టమూ జరిగింది. ఆనాడు అలా కలవడం ఎంత ప్రధానమైందో, ఎంత ప్రయోజనాత్మకమైందో ఈనాడు విడిపోవడం కూడా అంతే ప్రధానం, అంతే ప్రయోజనాత్మకమైంది. ప్రతి ఉద్యమం కూడా అంతవరకు మన అనుభవంలో లేని కొత్త అంశం వైపు మన దృష్టిని ప్రసరింపజేస్తుంది. ఆ లోటు పూడ్చుకొమ్మని చెప్తుంది. అది



స్త్రీవాదమైనా, దళితవాదమైనా, తెలంగాణవాదమైనా.

ఇప్పుడు తెలంగాణ గురించి సుమారు ఓ లక్ష పేజీల సమాచారం బయటకు వచ్చి ఉంటుంది కదా! ఇది హర్షదాయకమైన పరిణామం కాదా? ఇతిహాసపు చీకటి కోణంలో పడిపోయిన తెలంగాణ ప్రముఖుల సంగతులు, తెలంగాణ విషయాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ఇంకా ఇంకా మరెన్నో రావాల్సి ఉంది. వాటి కోసం మనం కృషి చేయాలి. తెలంగాణ భాషలో ఈనాడు పాజిటివ్‌గా సినిమాలు తీస్తున్నారుగదా! తెలంగాణ రాక ముందు ఉద్యమ ఆవేశంలో ఎన్నో మాట్లాడవచ్చు కానీ ఇప్పుడు అలా కాదు ఎన్నో హిందీ రాష్ట్రాలు ఉన్నట్లే రెండు తెలుగు రాష్ట్రాలు కవల పిల్లల్లా స్నేహసంబంధాలతో అభివృద్ధి చెందాలి. ఈఅరవై ఏళ్ళల్లో జరిగిన పెళ్ళిల్లు, పేరంటాలు, ఏర్పడిన బంధుత్వాలు ఎక్కడికి పోతాయి? కాంట్రాక్టర్లకు, దొంగలకు, హంతకులకు, రాజకీయ నాయకులకు, కూలి చేసుకుని బతికే సామాన్యులకు తెలంగాణ-ఆంధ్ర తేడా లేదు. తెలంగాణ రాష్ట్రం సాకారమై ఎనిమిదేళ్ళయ్యాక వ్యక్తుల స్వార్థాల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం సెంటిమెంటును రెచ్చగొట్టకూడదు. ప్రతికూల ధోరణులతో కాకుండా సానుకూలమార్గంలో నిర్మాణాత్మకరీతిలో ముందుకు సాగాలి.

**ప్రస్తుత తెలుగు పరిశోధన స్థితిగతుల పై మీ అభిప్రాయం**

నేడు ఆశించినంత స్థాయిలో లేదు అనేది అందరూ అంగీకరిస్తున్నారు. దీనికి నిర్బంధ ప్రవేశ ప్రక్రియ, పూర్వ నేపథ్య జ్ఞాన సాహిత్యం, నిరుద్యోగం, ఇలాంటి సామాజిక ఆర్థిక విద్యాత్మక కారణాలు ఎన్నో లేకపోలేదు. మొత్తం జాతి శీలంలోనే ఒక వెలితి, లోపం, అనైతికత ప్రవేశించినప్పుడు ఈ పరిశోధన లాంటి చిన్న విషయాలు మాత్రం వాటికి అతీతంగా ఎలా ఉంటాయి? నిన్న మొన్న బజార్లో రికామీగా తిరిగిన అతి సామాన్యుడు రాజకీయాల్లో చేరి క్వాలిస్ కార్లల్లో ఊరేగుతూ ఉంటే పొట్ట చేత్తో పట్టుకొని ఏదో చిన్నపాటి కొలువైనా దొరుకకపోదా అన్న కొండంత ఆశతో యునివర్సిటీ హాస్టల్లో చేరి అల్లాడుతున్న యువకుని నుంచి ఏమాశించగలం?. తాము చేస్తున్న పని పట్ల చిత్తశుద్ధి, గౌరవం, నిబద్ధత లేని ఒక వింత అయోమయ పరిస్థితి అన్నిరంగాల్లో ఉంది. అందువల్ల భర్తృహరి చెప్పినట్లు "జీర్ణమంగే సుభాషితం" అంటాను. ఉపదేశాలు, ప్రబోధాలు మాని ఎలాంటి ప్రచారాన్ని, కీర్తిని కోరుకోకుండా తోచిన మంచి పనేదో చేసి, మౌనంగా ఉండి పోవడమే మంచి పని అనుకొంటున్నాను.

నా అభిప్రాయాలను తంగేడు పాఠకులతో పంచుకొనే సదవకాశాన్ని కలిగించిన ఆత్మీయమిత్రులు డా. కాంచనపల్లి గారికి కృతజ్ఞతలు.

ఇంటర్వ్యూ...
డా॥ అట్టెం దత్తయ్య
94947 15445



కవిత

# ఓ కొత్త తేదీ కావాలి...



శీలం భద్రయ్య, 98858 38288

ఓ కొత్త తేదీ కావాలి!
మనిషి కనిపెట్టిన కాలెండరులోనే మరో కొత్త తేదీ కావాలి...
ఉగాది రోజున ఆదాయ వ్యయాలను
గౌరవ మర్యాదలను చూసి సంబురపడే
సగటు బతుకులకు నిజాన్ని గ్రహించే ఓ కొత్త తేదీ కావాలి!

పిల్లల చదువులనీ, ఉద్యోగాలనీ కన్న తల్లిదండ్రుల విడిచి
పట్నాలకు, విదేశాలకూ పోతున్న పిల్లలను కళ్ళార చూడాలనుకునే
తల్లిదండ్రులకు ఎదురు చూపులేని ఓ కొత్త తేదీ కావాలి!

అభివృద్ధి పేరుతో మనం తెచ్చుకున్న సాంకేతికత
మన జీవితాలలో తెచ్చే కొత్త చిక్కులను
వదిలించుకునే ఓ కొత్త తేదీ కావాలి!

చినిగిన లాగులేసుకొని ఊరంతా ఉరికినా,
ఒడవని నిండైన పల్లె వాడలు, వరుస వాయి ముచ్చట్లను
వెనక్కు తెచ్చే ఓ కొత్త తేదీ కావాలి!

అమ్మా నాయిన కూలికి బోయి దినాం దారబోసిన చెమట విలువంతా
పొద్దూక బెల్టు షాపుకు పోని క్యాలండరులోని ఓ కొత్త తేదీ కావాలి!

ఎదుటి వాడి తెలివి, తన తెలివి కంటే తక్కువని
అంచనా వేసే మనిషి మేథలో మార్పు తెచ్చే ఓ కొత్త తేదీ కావాలి!

ఆత్మరక్షణ కోసం కాకుండా అధిపత్యానికి చేస్తున్న యుద్ధం
పోయి మానవత్వ మనుగడకు ఓ కొత్త తేదీ కావాలి!

ఓటేసిన ఓటరును మరవని నాయకుడు,
ఓటరుకు విలువనిచ్చే ప్రజాస్వామ్యానికై ఓ కొత్త తేదీ కావాలి!

చివరగా... కాలెండరు మారినా
మనుషులు మారని, మనవత్వం వీడని
ఓ కొత్త క్యాలెండరు తేదీ కావాలి!

## 1984 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

సాహితీ శిఖరం





# కేరళ సమాజాన్ని చిత్రీకరించిన

# తకళి శివశంకర పిళ్ళై

తకళి శివశంకర పిళ్ళై 7 ఏప్రిల్ 1912న జన్మించాడు. ఈయన మలయాళ నవలా రచయిత, కథా రచయిత. 1984లో ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన శివశంకర పిళ్ళై భారతీయ సాహిత్య రంగంలో విశేష ఖ్యాతి గాంచారు. ఆయన సుమారు 600 లఘు కథలు, నవలలు వ్రాసారు. ఆయన రచనలలో "కాయర్" చెమ్మీన్ (నవల) ప్రసిద్ధమైనవి. 1958లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1984లో జ్ఞానపీఠ పురస్కారం, 1985లో పద్మభూషణ్ పురస్కారం, 1973లో సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు ఆయనను వరించాయి. అతను కేరళ కేసరి దినపత్రికలో రిపోర్టర్‌గా తన వృత్తిని ప్రారంభించాడు. అయితే అంబలప్పుజలోని మున్సిఫ్ కోర్టులో పి. పరమేశ్వరన్ పిళ్లై అనే న్యాయవాది వద్ద ప్రాక్టీస్ చేయడం ద్వారా న్యాయవాద వృత్తికి మారాడు. ఈ సమయంలోనే ఆయన కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఆకర్షితులై సాహిత్య ప్రవర్తక సహకార సంఘం (రచయితల సహకార సంఘం) కార్యవర్గంలో పాల్గొన్నారు.

అతను కేరళ సాహిత్య అకాడమీకి అధ్యక్షత వహించాడు మరియు సాహిత్య అకాడమీకి దాని సాధారణ కౌన్సిల్ సభ్యునిగా కూడా సంబంధం కలిగి ఉన్నాడు. అతని మొదటి చిన్న కథ దరిద్రన్ (ది పూర్) 1929లో ప్రచురించబడింది. అనేక చిన్న కథల తర్వాత అతను 1934లో త్యాగతిను ప్రతిఫలం (త్యాగ ఫలాలు) రాశాడు. ఇది ప్రధానంగా ఆ సమయంలో ప్రబలంగా ఉన్న సామాజిక అన్యాయాలకు సంబంధించినది. ఇది అతని 39 నవలలలో మొదటిది. అతను 600కి పైగా చిన్న కథలు, రెండు నాటకాలు మరియు నాలుగు జ్ఞాపకాలతో కూడిన 21 సంకలనాలను కూడా ప్రచురించాడు. పిళ్లై యొక్క సాహిత్య రచనలు 20వ శతాబ్దపు మధ్యకాలంలో కేరళలోని సమాజాన్ని చిత్రీకరిస్తాయి. తొట్టియుడే మకాన్ (స్కావెంజర్స్ సన్), తన కొడుకు కుటుంబ వృత్తిని కొనసాగించకుండా విఫలమైన స్కావెంజర్ గురించిన కథ 1947లో ప్రచురించబడింది మరియు ఇది మలయాళ సాహిత్యంలో మొదటి వాస్తవిక నవలగా ప్రసిద్ధి చెందింది. అతను ఏప్రిల్ 10, 1999న 86 సంవత్సరాల వయస్సులో మరణించాడు.

సాహితీ శిఖరం



## 1985 నోబెల్ సాహిత్య విజేత




# సంప్రదాయ నవలాకారుడు క్లాడ్ సైమన్

క్లాడ్ సైమన్ 1913 అక్టోబర్ 10న ఫ్రెంచ్ మడగాస్కర్ ద్వీపంలోని తననారివ్‌లో జన్మించాడు. అతని తల్లిదండ్రులు ఫ్రెంచ్. అతని తండ్రి మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించిన కెరీర్ అధికారి. తన పూర్వీకులలో ఫ్రెంచ్ విప్లవం కాలం నుండి ఒక జనరల్ కూడా ఉన్నాడు. పారిస్‌లోని కాలేజ్ స్టానిస్లాస్‌లో మాధ్యమిక పాఠశాల మరియు ఆక్స్‌ఫర్డ్ మరియు కేంబ్రిడ్జ్‌లలో క్లుప్తంగా గడిపిన తర్వాత అతను ఆండ్రే లోట్ అకాడమీలో పెయింటింగ్‌లో కోర్సులు అభ్యసించాడు. అతను స్పెయిన్, జర్మనీ, సోవియట్ యూనియన్, ఇటలీ మరియు గ్రీస్‌లో విస్తృతంగా పర్యటించాడు. ఈ అనుభవం మరియు రెండవ ప్రపంచ యుద్ధం నుండి వచ్చినవి అతని సాహిత్యంలో కనిపిస్తాయి. యుద్ధం ప్రారంభంలో క్లాడ్ సైమన్ మ్యూస్ (1940) యుద్ధంలో పాల్గొన్నాడు. ఖైదీగా ఉన్నాడు. అతను తప్పించుకొని ప్రతిఘటన ఉద్యమంలో చేరాడు. అదే సమయంలో అతను యుద్ధానికి ముందు రాయడం ప్రారంభించిన తన మొదటి నవల లే ట్రిచెర్ ("ది చీట్" 1946లో ప్రచురించబడింది) పూర్తి చేశాడు. 1960లో అతను అల్జీరియా స్వాతంత్ర్యానికి అనుకూలంగా 121 మ్యానిఫెస్టోపై సంతకం చేశాడు. 1961లో క్లాడ్ సైమన్ లా రూట్ డెస్ ఫ్లాండ్రెస్ కొరకు ఎల్.ఎక్స్‌ప్రెస్ బహుమతిని మరియు 1967లో హిస్టోయిర్ కొరకు మెడిసిస్ బహుమతిని అందుకున్నాడు. యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా 1973లో ఆయనకు గౌరవ వైద్యునిగా చేసింది.

క్లాడ్ సైమన్ రచనలో ఎక్కువ భాగం రెండవ ప్రపంచ యుద్ధం మరియు స్పానిష్ అంతర్యుద్ధం మరియు అతని కుటుంబ చరిత్ర నుండి వ్యక్తిగత అనుభవాలతో వ్యవహరించే స్వీయచరిత్ర. అతని ప్రారంభ నవలలు చాలావరకు సాంప్రదాయ రూపంలో ఉంటాయి. కానీ లే వెంట్ (1957) మరియు ఎల్. హెర్బే (1958) తో అతను నోయువే రోమన్‌తో అనుబంధించబడిన శైలిని అభివృద్ధి చేశాడు. లా రూట్ డి ఫ్లాండ్రెస్ (1960) ఇది యుద్ధకాల అనుభవాల గురించి చెబుతుంది. ట్రిప్టిక్ (1973), హిస్టోయిర్ (1967) లెస్ జార్జిక్స్ (1981), ఎల్. అకాసియా (1989) నవలలు ఎక్కువగా సైమన్ కుటుంబ చరిత్రకు సంబంధించినవి. 2005 జులై 6వ తేదీన పప్యారిస్ లో 91 సంవత్సరాల వయసులో మరణించాడు.

# పి.వి. సాహిత్య వ్యక్తిత్వం చిరస్మరణీయం

- ఎం.ఎల్.సి. సురభి వాణి దేవి



ఏప్రిల్ 8, 2022 రవీంద్రభారతి మినీ హాల్‌లో జరిగిన 'కాలాతీతుడు' పుస్తకావిష్కరణ సభలో కాలాతీతుడు కవితా సంకలనాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. 'కాలాతీతుడు' సభకు ముఖ్య అతిథిగా హాజరైన వాణీదేవి ఈ సంపుటిలోని కవులు తమని అమితంగా ఆకర్షించారని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన 'తంగేడు' సహ సంపాదకుడు కాంచనపల్లి గో.రా. వాణిదేవి ఉత్తమ సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. 'కాలాతీతుడు' సంకలనంలోని వివిధ కవుల కవిత్వాలోచనాలోని విశిష్టతను ప్రశంసించారు. విశిష్ట అతిథులుగా విచ్చేసిన మేడ్చల్ అదనపు కలెక్టర్ ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి ప్రభుత్వ కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పి.వి. సాహిత్య వ్యక్తిత్వంలోని సొగసులను వివరించారు. కవి సమ్మేళనానికి వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. హైదరాబాద్ పాతనగరం కవుల వేదిక, ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడెమి సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకుడు కె. హరినాథ్ విజేతలను, అతిథులను సన్మానించారు. తదనంతరం జరిగిన కవి సమ్మేళనంలో ముప్పై మంది కవులు కవితాగానంతో అలరించారు.

## 'సుదూర తీరాలు' గ్రంథ పరిచయ సభ

9 ఏప్రిల్, 2022 శనివారం సాయంత్రం 5 గంటలకు కటుకోజ్వల మనోహరాచారి కథాసంపుటి 'సుదూర తీరాలు' గ్రంథ పరిచయం జరిగింది. ఈ సభకు జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గారు, జిల్లా అదనపు పాలనాధికారి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తెలంగాణలో విస్తరిస్తున్న కథాసాహిత్యం పట్ల శ్యాంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. పుస్తక పరిచయం చేసిన సువర్ణ వినాయక్ తెలంగాణ పాఠ్యపుస్తకాల కో-ఆర్డినేటర్ పుస్తక పరిచయం చేస్తూ కథాసంపుటిలోని విశిష్టతలను వివరించారు. సభాధ్యక్షులుగా అఖిల భారతీయ సాహిత్య పరిషత్తు అధ్యక్షులు గాజల రవీందర్ వ్యవహరించిన ఈ సభలో డా॥ గంగ్రద లక్ష్మణరావు, డా॥ పత్తిపాక మోహన్, డా॥ వెల్దండి శ్రీధర్ వక్తలుగా పాల్గొన్నారు. నంది శ్రీనివాస్ నిర్వహణలో జరిగిన ఈ సభకు ఆహ్వాన సంఘ సభ్యులుగా స్తంభంకాడి గంగాధర్, శ్రీమతి అనంతోజు పద్మశ్రీ వ్యవహరించారు.

## ఆచార్య వెలుదండకు చెన్నకేశవరెడ్డి పురస్కారం

7 ఏప్రిల్, 2022 గురువారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో 'జయమిత్ర సాహిత్య సాంస్కృతిక సంస్థ' ఆధ్వర్యంలో ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి 78వ జన్మదినోత్సవం సందర్భంగా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఆచార్య వెలుదండ నిత్యానందరావుకి ఈ సభలో పురస్కార ప్రదానం జరిగింది. డా॥ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఆచార్య కొలుకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డా॥ కె.పి. అశోక్ కుమార్ విశిష్ట అతిథిగా డా॥ గడ్డం మోహనరావు ఆత్మీయ అతిథిగా ప్రసంగించారు. పురస్కార గ్రహీత తెలుగులో పరిశోధన - నేటి స్థితిగతులు అనే అంశం మీద ప్రసంగించారు. డా॥ అప్పం పాండయ్యపై సభకు సమావేశకర్తగా వ్యవహరించారు.

## ఘనంగా నిజాం కళాశాల సాహిత్య సదస్సు

ఉస్మానియా పరిధిలోని నిజాం కళాశాలలో జరిగిన సాహిత్య సదస్సులో రాష్ట్రంలోని అనేకమంది రచయితలు, అధ్యాపకులు హాజరై వివిధ అంశాల మీద పత్ర సమర్పణ చేశారు. వివిధ సదస్సులకు అధ్యక్షులుగా నిత్యానందరావు, సంగనభట్ల నర్సయ్య, డా॥ పల్లె విజయలక్ష్మి, డా॥ కసప నరేందర్, డా॥ ఎస్. రఘు ప్రభృతులు వ్యవహరించారు. ఈ సదస్సులలో గంగ్రద లక్ష్మణరావు, బాణాల భుజంగరెడ్డి, గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, కాంచనపల్లి గో.రా., రెడ్డి శ్యామల మొదలైన ప్రముఖులు పత్ర సమర్పకులలో ఉన్నారు.



స్వీకారం




## అవాల్మీకములు

పల్లెర్ల రామమోహన రావు
సెల్ : 91778 40278

వెల : అమూల్యం




## జూన్ 2, 2014

కోడం పవన్ కుమార్

లయ పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ.125/-




## మిక్చర్ పొట్లం

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
సెల్ : 9393662821

వెల : రూ.125/-




## ఝోళి

డా॥ సూర్య ధనుంజయ్
సెల్ : 9949996902

వెల : రూ.200/-




## శిలాఫలకం

దేవనపల్లి వీణావాణి
వరంగల్
సెల్ : 09951331122
వెల : రూ. 150/-




## ఎర్రమందార మకరందం

కె. ప్రభాకర్

రవి పబ్లిషింగ్ హౌస్
హైదరాబాద్
సెల్ : 944013665
వెల : రూ. 150/-




## ఎర్రమట్టి గాజులు

రేణుక అయోల

బోధి ఫౌండేషన్
సెల్ : 98482 54745
వెల.రూ. 100/-




## స్థిత ప్రజుడు

గుర్రపు సత్యనారాయణ

మహబూబాబాద్
సెల్ : 98499 82452




## స్వాతంత్ర్య మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
మహబూబ్‌నగర్
సెల్ : 90328 44017
వెల : రూ. 30/-




## జేమ్స్ జాయిస్
### యువ కళాకారుని ఆత్మగీతం

చింతపట్ల సుదర్శన్
సెల్ : 92998 09212
వెల : రూ. 150/-

